www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మండిన రాయలసీమ 14

నంద్యాలలో దేశంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రత

ఆత్మకూరులో 40.9 డిగ్రీలు నమోదు

నేడు 143 మండలాల్లో వడగాడ్పులు



కివీస్ వచ్చేసింది

రచిన్, కేన్ శతకాల హోరు

సెమీస్‌లో దక్షిణాఫ్రికా చిత్తు

మిల్లర్ సెంచరీ వృథా 10

గురువారం | 6-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 320 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.10.51 తదుపరి అష్టమి, నక్షత్రం: రోహిణి రా.12.05 తదుపరి మృగశిర, వర్జ్యం: సా.4.26-5.57, తె.5.33 మొ., అమృతఘడియలు: రా.9.01-10.33, దుర్ముహూర్తం: ఉ.10.28-11.15, మ.3.11-3.58, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.33, సూర్యాస్తమయం: 6.19 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'ఢిల్లీ'ని మించి జగన్ అవినీతి

పాతికేళ్ల వరకు మద్యం ఆదాయం తాకట్టు

జగన్ అవినీతితో పోల్చితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ చిన్నదే

జగన్, కేజ్రీ ప్రయోగాలు విఫలం

జనాభా పెరుగుదల రాజకీయ సమస్య కాదు

ఏపీ ప్రజలు పూర్తిగా మా వైపే.. పట్టభద్రుల ఫలితాలే నిదర్శనం.. ఢిల్లీలో సీఎం చంద్రబాబు 13



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అరకు కాఫీ అందజేస్తున్న సీఎం చంద్రబాబు

కబ్జాలకు కళ్లెం!

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం.. నిషేధ బిల్లు ఆమోదించండి.. అమిత్‌షాకు చంద్రబాబు వినతి

నిర్మల, నితిన్ గడ్కరీలతోనూ భేటీ

అమరావతికి 8 వరుసల ఓఆర్ఆర్‌ను ఆమోదించాలని అభ్యర్థన

నదుల అనుసంధానానికి కేంద్ర సహకారం కోరిన సీఎం

అభివృద్ధి, ఆదాయం, సంపద సృష్టి.. సంక్షేమం.. ఇదే మా విధానం

పోలవరం-బనకచర్ల అనుసంధానంలో వేరే రాష్ట్రాల పాత్ర లేదు

ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు వచ్చాక పీడీ కేసులు

ప్రతి పది కేసుల్లో ఆరు భూ వివాదాలవే: సీఎం

న్యూఢిల్లీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిషేధం చట్టంతో రాష్ట్రంలో భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జగన్ ఐదేళ్ల పాలనలో విచ్చలవిడిగా భూ ఆక్రమణలు జరిగాయని, చివరికి అటవీ భూములను సైతం వదల్లేదని చెప్పారు. ప్రైవేటు భూములను బలవంతంగా 22ఏ జాబితాలో చేర్చారని విమర్శించారు. ల్యాండ్ గ్రాబింగ్ బిల్లును అసెంబ్లీ, మండలి ఆమోదించాయని.. కేంద్రం కూడా ఆమోదముద్ర వేయాలని కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయాలు, ఎన్డీఏ పాలన, ఆంధ్రప్రదేశ్‌కు చేయూత తదితర అంశాలపై గంటకు పైగా చర్చించారు. తర్వాత ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో.. కేంద్ర మంత్రులతో చర్చించిన అంశాలను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో

మిగతా 13వ పేజీలో...

అయోమయం.. జగన్ వాదం!

ఏం మాట్లాడుతున్నారో తెలియని వైనం

సొంత ప్రెస్‌మీట్‌కూ.. అసెంబ్లీకీ పోలిక

నాడు బాబుకు విపక్ష హోదా తీసేస్తానని బెదిరింపు

నేడు.. తనకు ఆ హోదా ఎందుకివ్వరని ఆక్రోశం

తన వాదనను తానే ఖండించుకున్న జగన్

విపక్ష హోదాకూ.. సభలో టైంకు సంబంధమేదీ?

సభ్యుల సంఖ్యను బట్టి నిష్పత్తి ప్రకారం మైక్

ముందు వరుసలో సీటు ఇచ్చినా సభకు డుమ్మా

పార్టీని నడిపించడంలోనే గందరగోళం

వాయిదాల బాటలో జిల్లాల పర్యటనలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏం చెప్పాలనుకుంటారో... ఏం చెబుతారో తెలియదు! సీఎంగా ఉన్నప్పుడు ఒకటి చెప్పి... అధికారం పోగానే ఇంకోటి చెప్పి... చివరికి, తాను చెప్పింది తానే ఖండించుకుంటారు! అంతా... అయోమయం! ఇదీ జగన్ 'వాదం'! ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తానని మంకుపట్టు పట్టిన ఆయన... తన వైఖరిని సమర్థించుకునేందుకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. 'ఐదుగురు ఎమ్మెల్యేలను లాక్కొంటే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా రాదు' అని ముఖ్యమంత్రి హోదాలో జగనే నిండు సభలో ప్రకటించారు. అంటే... నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం ఎమ్మెల్యేలుంటేనే ఆ హోదా దక్కుతుందని ఆయనే చెప్పారు. ఇప్పుడు 11 సీట్లకు

మిగతా 12వ పేజీలో...



బాబుకు విపక్ష హోదా నేనే ఇచ్చా

పవన్ కార్పొరేటర్‌కు ఎక్కువ.. ఎమ్మెల్యేకు తక్కువ: జగన్

అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్

డిప్యూటీ సీఎంపై నోరుజారితే ఊరుకునేది లేదు

జగన్ మెజారిటీ ఎంత?.. పవన్ మెజారిటీ ఎంత?

మద్యంలో అవినీతి చేయలేదని తన పిల్లలపై ప్రమాణం చేయగలరా?: లోకేశ్

అవి సంధి ప్రేలాపనలు!

అన్నీ తెలిసీ జగన్ అవాకులు.. విపక్షనేత హోదా దక్కదు

నిబంధనలు, సంప్రదాయాల ప్రకారమే నిర్ణయం

పది శాతం సభ్యులు ఉండాల్సిందే.. స్పీకర్ రూలింగ్



13

నాగబాబుకు ఎమ్మెల్సీ

ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా ఖరారు

జనసేనాని పవన్ కల్యాణ్ ప్రకటన

2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలు

చైనా, మెక్సికో, కెనడా, ద.కొరియా, యూరప్ దేశాలపైనా విధిస్తాం



అమెరికా కాంగ్రెస్ సమావేశంలో ట్రంప్

ఇండియా తమ ఆటో ఉత్పత్తులపై 100% కన్నా ఎక్కువ సుంకాలు వేస్తోందని ఆగ్రహం

శత్రుదేశాలే కాక మిత్రదేశాలూ అమెరికాను దశాబ్దాలుగా దోచుకుంటున్నాయని ధ్వజం

వేరే మార్గాల్లో తమ ఉత్పత్తుల్ని నియంత్రిస్తే తామూ అలాగే చేస్తామని తేల్చిచెప్పిన ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్, మార్చి 5: భారత్‌పై ఏప్రిల్ 2 నుంచి పరస్పర (ప్రతీకార) సుంకాలు విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన మంగళవారం అమెరికన్ కాంగ్రెస్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. అందులో పలు అంశాల గురించి ప్రస్తావించిన ట్రంప్.. శత్రు దేశాలే కాక మిత్ర దేశాలు సైతం అమెరికాపై అన్యాయంగా సుంకాలు విధిస్తున్నాయంటూ మండిపడ్డారు. "పలు దేశాలు కొన్ని దశాబ్దాలుగా మనపై అత్యధిక సుంకాలు విధిస్తున్నాయి. ఇప్పుడిక మన వంతు. యూరోపియన్ దేశాలు, చైనా, బ్రెజిల్, ఇండియా, మెక్సికో, కెనడా, ఇంకా బోలెడన్ని దేశాలు మనం వారిపై

మిగతా 2వ పేజీలో...

700 కోట్ల డాలర్ల ఎగుమతులకు దెబ్బ

అమెరికా ప్రతీకార సుంకాల వల్ల ఏటా భారత్‌కు కలిగే నష్టం

ఐటీ సేవలు, ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తే భారీగా ప్రభావం

ఆక్వా, ఆభరణాల పరిశ్రమలకూ నష్టం

అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ ప్రయత్నాలు

అందుకే ఆ దేశానికి పీయూష్ గోయల్

ట్రంప్‌కు సుంకాల సెగ!

ఏ యుద్ధానికైనా సిద్ధం

తుది వరకూ పోరాడతాం 2

అమెరికా తీరుపై చైనా ఆగ్రహం

కరెంటు కోతలు విధిస్తాం

25% సర్‌చార్జీలు కూడా: కెనడా

మస్క్ స్టార్‌లింక్‌తో ఒప్పందం రద్దు



14

పోసానికి ఆదోని కోర్టు రిమాండ్

కర్నూలు జిల్లా జైలుకు తరలింపు

బెయిల్ పిటిషన్‌పై నేడు నరసరావుపేట కోర్టులో విచారణ

ఇటు బెజవాడలోనూ పీటీ వారెంట్లు

సర్కారీ భూములు స్వాహా



నాడు చెరపట్టిన వైసీసీ నేతలు

ఒక్క పీలేరులోనే 7 కేసుల్లో రూ.175 కోట్ల భూముల కబ్జా

ఇందులో 14 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్

అక్రమార్కులకు అధికారుల అండ

భూముల రికార్డులు తారుమారు

ప్రజల ఫిర్యాదుతో తాజాగా వెలుగులోకి

సమగ్ర విచారణకు రెవెన్యూ ఆదేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు తవ్వేకొద్దీ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వైసీపీ బడా నేతలు గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూములను చెరపడితే.. వారి అనుచరులూ తమ స్థాయిలో కంటికి కనిపించిన ప్రభుత్వ భూములను సొంత ఖాతాలో వేసుకున్నారు. ఇటు రీ సర్వే, అటు రికార్డుల స్వచ్ఛీకరణ పేరిట జరిగిన తంతును అడ్డం పెట్టుకొని వందల కోట్ల

మిగతా 14వ పేజీలో...

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు!

అక్రమాలను గుర్తించేందుకు చర్యలు

రద్దుపై కలెక్టర్లదే తుది నిర్ణయం

ఫార్మాట్ పంపనున్న సర్కారు

కలెక్టర్ తరఫున రద్దు ప్రక్రియ పూర్తి చేసే బాధ్యత తహశీల్దార్‌కు

నేడో, రేపో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రభుత్వ భూములను గుర్తించి, ఆ రిజిస్ట్రేషన్లను రద్దుచేసే దిశగా చర్యలు

మిగతా 14వ పేజీలో...



కాకాణి మెడకు 'ఫోర్జరీ' ఉచ్చు!

ఎంపీ మాగుంట సంతకాలు ఫోర్జరీ చేసి మరీ వైసీపీ హయాంలో రూ.కోట్ల గ్రావెల్ స్వాహా



ఐదేళ్లూ బరి తెగించిన వైసీపీ ఘనులు

సర్వేపల్లి రిజర్వాయర్‌లో భారీగా తవ్వకాలు

అప్పట్లోనే కాకాణిపై తీవ్రమైన ఆరోపణలు

కొద్దిమందిపై తూతూమంత్రం కేసు

దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం

ఫోర్జరీ కేసు దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

బాపట్ల ఎస్పీ, డీఎస్పీ సహా పది మందితో టీమ్

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

సర్వేపల్లి రిజర్వాయర్‌లో వైసీపీ నాయకులు గ్రావెల్ కొల్లగొట్టడానికి అనుసరించిన తప్పుడు విధానాలు ఇప్పుడు ఏకంగా ఆ పార్టీకి చెందిన అగ్రనాయకుల మెడకు చుట్టుకునేలా ఉన్నాయి. గ్రావెల్ కొల్లగొట్టడం కోసం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతకాలను సైతం ఫోర్జరీ చేశారు. అప్పట్లో దీనిపై మాగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారంలో వైసీపీ ఉండటం, అక్రమాలకు తెరలేపింది. దందాలో ఉన్నది ఆ పార్టీ ముఖ్యనాయకులే కావడంతో


మిగతా 3వ పేజీలో...

వివేకా ఇంటి వాచ్‌మన్ రంగయ్య మృతి

అనారోగ్యంతో కడప రిమ్స్‌లో కన్నుమూత

వివేకా హత్య కేసులో ఇతడు ప్రత్యక్ష సాక్షి

ఆరేళ్లుగా సా..గుతున్న సీబీఐ విచారణ 14



అటు ఒక్కొక్కరుగా సాక్షులు, కీలక వ్యక్తుల మరణాలు



గంప ప్రవీణ్

2

అమెరికాలో కాల్పులు..

తెలుగు విద్యార్థి మృతి

3 నెలల్లో ఎంఎస్ పూర్తి చేసుకుని రావాల్సి ఉండగా దారుణం

నేహారెడ్డి కంపెనీ ఖర్చుతోనే ఆ గోడ కూల్చండి

ఆ సంస్థపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

భాగస్వాములను ప్రాసిక్యూట్ చేయాలి

సాయిరెడ్డి కుమార్తె కేసులో హైకోర్టు ఆదేశం

ప్రకృతికి జరిగిన నష్టం అంచనాకు నిపుణుల కమిటీ వేయాలి 2



కులాంతర ప్రేమలపై కత్తి!

గుంతకల్లులో పరువు హత్య

కూతురిని ఉరేసి చంపి.. పెట్రోలు పోసి నిప్పు

మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న వైనం

4 రోజుల క్రితం ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

కుప్పంలో కూతురిపై కత్తితో దాడి 14

ప్రేమికులతోపాటు మధ్యవర్తులకూ గాయాలు

ఆత్మహత్యాయత్నం కాదు



నిద్ర పట్టక ఎక్కువ మాత్రలు వేసుకున్నా..

పోలీసులకు చెప్పిన గాయని కల్పన

మందుల ఓవర్ డోస్ వల్లే అమ్మ అపస్మారక స్థితికి: కల్పన కుమార్తె దయ 2

నియోజకవర్గాల పునర్విభజనను 30 ఏళ్లు వాయిదా వేయాలి

లేదా 1971 జనాభా ప్రాతిపదికనే చేయాలి 2

తమిళనాడు అఖిలపక్ష భేటీ ఏకగ్రీవ తీర్మానం

దక్షిణాది ఎంపీలతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ

పునర్విభజనతో 'దక్షిణాది'కి పెను ముప్పు: స్టాలిన్

దేశాన్ని 'హిందియా'గా మార్చే కుట్ర: కమల్‌హాసన్

2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)



విధిస్తున్న సుంకాల కన్నా మనపై ఎక్కువగా వేస్తున్నాయి. ఇది అన్యాయం. భారతదేశం మన ఆటో ఉత్పత్తులపై 100 శాతం కన్నా ఎక్కువ సుంకాలు వేస్తోంది" అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మన ఉత్పత్తులపై చైనా సగటు సుంకాలు.. మనం వారిపై విధిస్తున్న దానికన్నా రెట్టింపుస్థాయిలో ఉన్నాయి. దక్షిణ కొరియా సుంకాలైతే ఏకంగా నాలుగు రెట్లు అధికంగా ఉంటున్నాయి. ఒక్కసారి ఆలోచించండి.. నాలుగు రెట్లు అధికం. మనమేమో అదే దక్షిణ కొరియాకు సైనిక సాయం చేయడంతోపాటు రకరకాలుగా అండగా ఉంటున్నాం. కానీ, జరుగుతోంది ఏమిటి?.. వారు మనపై అధిక సుంకాలు విధిస్తున్నారు. మన మిత్రులు, శత్రువులు అందరూ ఇదే చేస్తున్నారు. ఈ భూమ్మీద దాదాపు ప్రతిదేశమూ దశాబ్దాలుగా అధిక సుంకాలతో మనల్ని దోచుకుతింటోంది" అని ఆగ్రహం వెలిబుచ్చారు. ఇకపై అలా జరగనివ్వబోమని తేల్చిచెప్పారు. "మీరు మీ ఉత్పత్తులను అమెరికాలో తయారుచేయకపోతే.. ట్రంప్ పాలనలో మీరు సుంకాలను, కొన్ని సందర్భాల్లో అధిక సుంకాలను చెల్లించాల్సి ఉంటుంది" అని ఆయా దేశాలను హెచ్చరించారు. "ఇతర దేశాలు మాపై ఏస్థాయిలో సుంకాలు విధిస్తే.. మేమూ అలాగే విధిస్తాం. వారు మనల్ని తమ మార్కెట్లకు దూరంగా ఉంచే ఉద్దేశంతో నాన్-మానెటరీ టారిఫ్స్ (డబ్బు రూపంలో కాకుండా.. విధానపరమైన నిర్ణయాల ద్వారా నియంత్రించడం) విధిస్తే మనం కూడా వారిని మన మార్కెట్లకు దూరంగా ఉంచడానికి అలాగే చేస్తాం" అని వ్యాఖ్యానించారు. తాను ఇదే పనిని చైనాతో, ఇతర దేశాలతో కూడా చేశానని.. ఇంతకుముందున్న బైడెన్ పాలనలో ఇలా చేయలేకపోయారని స్వీయ కితాబు ఇచ్చుకున్నారు. మెక్సికో, కెనడాల విషయానికి వస్తే.. వాణిజ్యపరంగా ఎంతో లోటు ఉందని, ఆయా దేశాలు అమెరికాకు అధికంగా ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ, తాము మాత్రం తక్కువగా దిగుమతి చేసుకుంటున్నాయని విమర్శించారు. ఆ విషయాన్ని పక్కనపెడితే.. "ఆయా దేశాలు మన దేశంలోకి ఫెంటైనిల్ రాకను మునుపెన్నడూ లేని విధంగా అనుమతిస్తున్నాయి. అది మన దేశానికి చెందిన యువతీయువకులను వేలు, లక్షల సంఖ్యలో చంపేస్తోంది. కుటుంబాలను ఛిద్రం చేస్తోంది. అందుకు బదులుగా ఆ రెండు దేశాలూ అమెరికా నుంచి వందల కోట్ల డాలర్లు రాయితీ రూపంలో పొందుతున్నాయి. ఇకపై అలా జరగనివ్వం" అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి తాను ఈ సుంకాల విధింపును ఏప్రిల్ 1 నుంచి అమలు చేద్దామనుకున్నప్పటికీ.. అంతా 'ఏప్రిల్ ఫూల్స్ డే' అని ఎగతాళి చేసే అవకాశం ఉంది కాబట్టి ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి తెస్తున్నానన్నారు.

గ్రీన్‌లాండ్‌ను కలిపేసుకుంటాం: ట్రంప్

అమెరికాలో కలిసిపోవాలని గ్రీన్‌లాండ్‌ను ట్రంప్ మళ్లీ కోరారు. అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ట్రంప్ ఈ మేరకు పిలుపునిచ్చారు. ఆయన ప్రతిపాదనను డెన్మార్క్ వెంటనే తిరస్కరించింది. గ్రీన్‌లాండ్ అమెరికాలో కలవడం జరగదని డెన్మార్క్ రక్షణ మంత్రి ట్రూల్స్ లండ్ పౌల్సెన్ స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ ఎలా ముందుకు వెళ్లాలనే విషయాన్ని అక్కడి ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. గ్రీన్‌లాండ్‌లో సాధారణ ఎన్నికలు జరగడానికి వారం రోజుల ముందు.. ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తక్కువ జనాభా ఉన్న, భారీగా ఖనిజ సంపద ఉన్న గ్రీన్‌లాండ్ ద్వీపంలోని అత్యద్భుత ప్రజలకు ఒక సందేశం ఇస్తున్నానన్న ట్రంప్.. "మీ భవిష్యత్తును మీరే నిర్ణయించుకొనే హక్కుకు మేం మద్దతిస్తాం. మీరు యూఎస్‌ఏలో కలవాలనుకుంటే సాదరంగా ఆహ్వానిస్తున్నాం" అని పేర్కొన్నారు.

ఏటా 700 కోట్ల డాలర్ల ఎగుమతులకు దెబ్బ

ఐటీ సేవలు, ఫార్మాపై సుంకాలు విధిస్తే భారీగా ప్రభావం

(ఆంధ్రజ్యోతి - బిజినెస్ డెస్క్)

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధంతో ప్రపంచ దేశాలు బెంబేలెత్తి పోతున్నాయి. చైనా, మెక్సికో, కెనడా దేశాలపైన విధించిన సుంకాలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా ఇతర దేశాలపై ప్రతీకార సుంకాలు తప్పవని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. దానివల్ల మనకు ఏటా 700 కోట్ల డాలర్ల మేర (దాదాపు రూ.61 వేల కోట్లు) నష్టం తప్పదని అంచనా! ఈ నేపథ్యంలోనే.. అమెరికాతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) మోదీ సర్కారు సిద్ధమవుతోంది. కెనడా, మెక్సికో వంటి దేశాలు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా అమెరికాతో ఒప్పందాలకు సిద్ధపడుతున్నాయి. ఆయా దేశాల అధికారులు తమతో చర్చలు జరుపుతున్నట్టు అమెరికా అధికారికంగానే వెల్లడించింది!

అధిక సుంకాల ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ట్రంప్ ముఖ్యంగా ప్రస్తావించే పేరు భారత్‌దే. 'ఇండియా 'ఆటో' టారిఫ్‌లు 100 శాతానికి మించి ఉన్నాయ'ంటూ ట్రంప్ తాజాగా కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అలా కుదరదని.. కంటికి కన్ను, పంటికి పన్ను తరహాలో పరస్పర సుంకాలు తప్పవన్నది ట్రంప్ ప్రతిన. అయితే.. ప్రతీకార/పరస్పర సుంకాలు అనగానే 'ఆటో మొబైల్' రంగంలో మనం విధిస్తున్నట్టే 100 శాతం సుంకాలు విధిస్తారని చెప్పలేం. ఎందుకంటే.. మన దేశం నుంచి అమెరికా నుంచి దిగుమతి చేసుకునే లగ్జరీ కార్లు, బైకులతో పోలిస్తే ఇక్కడి నుంచి అక్కడికి అయ్యే ఎగుమతుల విలువ చాలా తక్కువ. కాబట్టి ఆటో ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం వల్ల అమెరికాకు ఏమీ లాభం ఉండదు. అందువల్ల అమెరికా ఆ మార్గం ఎంచుకోదని.. ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాటికి బదులుగా మన దేశం నుంచి తాను ఎక్కువగా దిగుమతి చేసుకునే ఫార్మా ఉత్పత్తులు, ఐటీ సేవల వంటివాటిపై దృష్టి సారించి, వాటిపై అత్యధిక సుంకాలు విధిస్తే మాత్రం మనదేశంలో ఆ రంగాల పరిశ్రమలపై పెను ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీటిపై ఎక్కువ ప్రభావం..

ట్రంప్ రాగానే అమెరికాకు దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై 25% సుంకం విధించారు. దీంతో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతయ్యే ఈ రెండు ఉత్పత్తుల ఎగుమతులూ 5-10% మేర దెబ్బతినబోతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి కొత్తగా అమల్లోకి వచ్చే సుంకాలతో ఇంజనీరింగ్, ఫార్మా, ఫోన్లు, ఆభరణాలు, రొయ్యల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అందుకే.. వీలైనంత త్వరగా పరిమిత స్థాయిలోనైనా అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునేందుకు మోదీ సర్కార్ తొందర పడుతోంది. అందులో భాగంగానే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్ని పనులూ వాయిదా వేసుకుని మరీ అమెరికాకు వెళ్లి ఆ దేశ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఈ ఒప్పందం సాకారమైతే మన దేశం నుంచి అమెరికాకు, అమెరికా నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులపై దాదాపుగా సుంకాలు ఉండవు. ఒకవేళ ఉన్నా అవి కనిష్ఠ స్థాయిలోనే ఉంటాయి.

ట్రంప్‌కు తప్పుడు సమాచారం..

అమెరికా నుంచి మన మొత్తం దిగుమతుల విలువలో 75 శాతంపై.. మన దేశం విధించే దిగుమతి సుంకం సగటున 5 శాతం మించదు. లగ్జరీ కార్లు, హైఎండ్ బైకులు, బోర్బన్ విస్కీ వంటి విలాస వస్తువులపై మాత్రమే మనం అత్యధిక సుంకాలు విధిస్తున్నాం. భారత్ ఆటో టారిఫ్‌లు 100 శాతానికి పైగా ఉన్నాయని ట్రంప్ చెప్పారుగానీ.. ప్రస్తుతం భారత్ అత్యధికంగా విధిస్తున్న ఆటో టారిఫ్ 70%. దిగుమతి చేసుకునే విలాసవంతమైన కార్లపై 125 శాతంగా ఉన్న సుంకాన్ని 70 శాతానికి భారత్ తగ్గించింది. హై-ఎండ్ మోటార్‌సైకిళ్లపై సుంకాన్ని 50% నుంచి 40శాతానికి కుదించింది.

ఫార్మా, ఆక్వా, ఆభరణ పరిశ్రమలకు..

అమెరికా మన పాడి ఉత్పత్తులు, యాపిల్స్, బాదంపై ఉన్న 50 శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరుతోంది. ట్రంప్ ప్రతీకార సుంకాలకు భయపడి దీన్ని తగ్గిస్తే.. మన వ్యవసాయ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే.. ఏప్రిల్ 2 నుంచి ఆభరణాలపైనా 5 నుంచి 20% సుంకాల భారం పడే ముప్పుంది. అదే జరిగితే ఈ పరిశ్రమపై ఆధారపడిన లక్ష నుంచి లక్షన్నర మంది రోడ్డున పడే ప్రమాదం ఉందని జెమ్స్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇక.. అమెరికా నుంచి వచ్చే ఫార్మా ఉత్పత్తులపై భారత్ 10% దాకా సుంకం విధిస్తుండగా.. అమెరికా ఏమీ విధించట్లేదు. వీటిని తనలాగే జీరో స్థాయికి తగ్గించి, మరింత పక్కాగా పేటెంట్ హక్కులు కాపాడాలని ట్రంప్ సర్కారు కోరుతోంది. లేకపోతే భారత ఫార్మా ఎగుమతులపైనా పరస్పర సుంకాలు తప్పవని హెచ్చరిస్తోంది. దీంతో ఫార్మా కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. ఇక.. మన రొయ్యల ఎగుమతులకు అమెరికానే ప్రధాన మార్కెట్. జీరో సుంకంతో అమెరికా ఈ దిగుమతులను అనుమతిస్తోంది. మన దేశం మాత్రం అన్ని మత్స్య దిగుమతులపై 30% సుంకం విధిస్తోంది. ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల వల్ల 'మేకిన్ ఇండియా' కార్యక్రమమూ ప్రమాదంలో పడింది. మన దేశంలో తయారయ్యే యాపిల్ ఐఫోన్లు, ఇతర వినియోగ ఎలక్ట్రానిక్ పరికరాలను అమెరికా ప్రస్తుతం జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మనం మాత్రం 20% వరకూ సుంకాలు విధిస్తున్నాం. ఇప్పుడు పరస్పర సుంకాల భయంతో యాపిల్ కంపెనీ మేకిన్ ఇండియాపై పునరాలోచనలో పడినట్టు సమాచారం. భారత్‌లో తన విస్తరణను పక్కన పెట్టి, 10% కంటే తక్కువ సుంకాలున్న దేశాలపై దృష్టి పెట్టే దిశగా యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం అమెరికాతో ఎఫ్‌టీఏ కుదుర్చుకోవడమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2023 గణాంకాల ప్రకారం.. దిగుమతులపై భారత్ విధిస్తున్న సుంకాలు (శాతాల్లో)..

ఉత్పత్తులు/వస్తువులు	సుంకం
పొగాకు, బేవరేజెస్	74.5
ఆయిల్ సీడ్స్, నూనెలు	60.1
చక్కెర, కన్ఫెక్షనరీ	51.5
కాఫీ, టీ	47.6
తృణధాన్యాలు, వాటి ఉత్పత్తులు	37.8
పాల ఉత్పత్తులు	35.2
పండ్లు, కూరగాయలు, మొక్కలు	34.6
జంతు ఉత్పత్తులు	32.5
చేపలు, చేపల ఉత్పత్తులు	30.0
రవాణా పరికరాలు	28.2
వస్త్రాలు	20.7
జౌళి ఉత్పత్తులు	16.0
తోలు, పాదరక్షలు	15.1
ఖనిజాలు, లోహాలు	11.9
ఎలక్ట్రిక్ యంత్రాలు	11.2
కాగితం, కలప	10.6
రసాయనాలు	10.3
పెట్రో ఉత్పత్తులు	9.2

మన ఫార్మా సుంకాలను తగ్గించక్కర్లేదు

ఫార్మా ఉత్పత్తులపై మనం 10% సుంకం విధిస్తుంటే, అమెరికా జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. అయితే, ట్రంప్‌కు బెదిరి ఇప్పుడు మనం సుంకాలను తగ్గించాల్సిన పని లేదు. ఎందుకంటే ఏ దేశమూ అమెరికాకు మన కంటే చౌకగా, నాణ్యమైన జనరిక్ ఔషధాలు సరఫరా చేయలేదు. ఒకవేళ అమెరికానే వీటిని తయారు చేసుకోవాలనుకున్నా 30% అధికంగా ఖర్చవుతుంది. కాబట్టి ట్రంప్ హెచ్చరికలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

-ఆర్.ఉదయ్‌భాస్కర్, మాజీ డైరెక్టర్ జనరల్, ఫార్మాగ్జిల్

అమెరికాకే నష్టం

మన ఫార్మా ఎగుమతులపై సుంకాలతో అమెరికాకే నష్టం. ఇప్పటికే అక్కడ ఔషధాలు, వైద్య ఖర్చులు పెరిగిపోయాయి. అదనపు సుంకాలతో మరింత పెరుగుతాయి.

-ఎవీపీ చక్రవర్తి, ఛైర్మన్, ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఆంత్రప్రెనర్స్ (ఏపీ అండ్ తెలంగాణ)



ఉక్రెయిన్‌తో శాంతికి రష్యా సిద్ధం!

అమెరికా కాంగ్రెస్‌లో ట్రంప్ వెల్లడి

న్యూయార్క్, మార్చి 5: ఉక్రెయిన్‌తో శాంతియుత సంబంధాలను నెలకొల్పుకోవటానికి సిద్ధంగా ఉన్నట్లు రష్యా నుంచి బలమైన సంకేతాలు తనకు అందాయని ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్ కూడా చర్చలకు సిద్ధమని ప్రకటించిందని, ఈ మేరకు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ తనకు లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. మంగళవారం రాత్రి అమెరికా చట్టసభల (కాంగ్రెస్) సంయుక్త సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. రెండోసారి అధ్యక్షుడైన తర్వాత కాంగ్రెస్‌లో ఇదే ఆయన తొలి ప్రసంగం. మూడేళ్లుగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వారానికి సగటున 2 వేల మందికిపైగా మరణిస్తున్నారని ట్రంప్ చెప్పారు. 'ఈ యుద్ధంలో అమెరికన్లేమీ చనిపోవటం లేదు.. కానీ, నేను ఆపాలనుకుంటున్నా. ఈ ఉన్మాదాన్ని, ఆ హత్యాకాండను ఆపాలనుకుంటున్నా' అని తెలిపారు. యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్నామని చెబుతున్న యూరప్ దేశాల గురించి ప్రస్తావిస్తూ.. ఉక్రెయిన్ రక్షణకు ఖర్చు చేసిన దానికన్నా, రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేయటానికి యూరప్ దేశాలు ఎక్కువ ఖర్చు చేశాయని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు, 2021లో కాబూల్‌లో ఆత్మాహుతి దాడి జరిపి 13 మంది అమెరికన్ సైనికులను చంపిన ఘటనకు బాధ్యుడైన ఉగ్రవాది షరీఫుల్లాను పట్టుకున్నామని, అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికాకు తరలిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు. కాగా, రష్యాతో వీలైనంత త్వరగా శాంతి చర్చలు జరిపేందుకు జెలెన్‌స్కీ సంసిద్ధత వ్యక్తం చేయడం సానుకూల పరిణామమని రష్యా అధ్యక్ష భవనం పేర్కొంది. అయితే, రష్యాతో చర్చలను నిరోధిస్తూ 2022లో ఉక్రెయిన్ జారీ చేసిన ఉత్తర్వుల సంగతేంటని ప్రశ్నించింది.

14.2 కిలోల బంగారం నడుముకు కట్టుకుని స్మగ్లింగ్

» బెంగళూరులో కన్నడ నటి రన్యా అరెస్టు



బెంగళూరు, మార్చి 5: రన్యా రావు.. ప్రముఖ కన్నడ నటి. అంతేకాదు.. పోలీసు ఉన్నతాధికారి కుమార్తె. ఏడాది కాలంలో 30 సార్లకు పైగా గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చారు. బెంగళూరు కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగినప్పుడల్లా ఓ ప్రొటోకాల్ అధికారి ఆమెకు ఎస్కార్ట్ కల్పించి సెక్యూరిటీ చెక్‌లు లేకుండా బయటకు తీసుకొచ్చేవారు. అక్కడి నుంచి ప్రభుత్వ వాహనంలో దర్జాగా వెళ్లిపోయే వారు. సోమవారం రాత్రి కూడా రన్యా రావు అలాగే ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చే క్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) బృందం అడ్డుకుంది. సోదాలు చేస్తే.. ఆమె నడుముకు కట్టుకొని అక్రమంగా తరలిస్తున్న 14.2 కిలోల బంగారం దొరికింది. దీని విలువ రూ. 12.56 కోట్లుగా అంచనా వేశారు. ఆ తర్వాత బెంగళూరులోని లావెల్లె రోడ్‌లో ఉన్న రన్యా రావు ఇంటిలో కూడా అధికారులు సోదాలు జరిపారు. అక్కడ రూ. 2.06 కోట్ల విలువైన స్వర్ణ ఆభరణాలు, రూ. 2.67 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. రన్యా రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. జడ్జి 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. రన్యా రావు గత 15 రోజుల్లోనే నాలుగుసార్లు తిరిగారు. ఈ నాలుగు సార్లూ ఒకే రకమైన వస్త్రధారణలో ఉన్నట్లు డీఆర్‌ఐ అధికారులు గుర్తించి నిఘా పెట్టారు. స్మగ్లింగ్‌కు అనుకూలంగా మార్పులు చేసిన జాకెట్, బెల్ట్ ఆమె ధరించారు. వాటిల్లో బంగారం కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు.

ఆత్మహత్యాయత్నం చేయలేదు: కల్పన

హైదర్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో నిద్ర మాత్రలు తీసుకుని ఆస్పత్రిపాలైన సినీ నేపథ్య గాయని కల్పన ఆరోగ్యం మెరుగుపడింది. అయితే, తాను ఆత్మహత్యకు యత్నించలేదని కల్పన పోలీసులకు బుధవారం వెల్లడించారు. కుమార్తెతో జరిగిన వాగ్వాదం అనంతరం నిద్ర పట్టక అధిక మోతాదులో మందులు తీసుకోవడం వల్లే అపస్మారక స్థితిలోకి వెళ్లానని పోలీసులకు వివరించారు. గాయని కల్పనను విచారించిన కేపీహెచ్‌బీ పోలీసులు ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దాని ప్రకారం.. కల్పన, ప్రసాద్ ప్రభాకర్‌కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరికీ ఇది ద్వితీయ వివాహం. మొదటి వివాహం ద్వారా కల్పనకు ఒకరు, ప్రసాద్‌కు ఇద్దరు సంతానం ఉన్నారు. కల్పన దంపతులు, ముగ్గురు సంతానం కలిసి కేరళలోని ఎర్నాకులంలో నివాసం ఉంటున్నారు. వృత్తిరీత్యా కల్పన.. కూకట్‌పల్లి నిజాంపేటలోని వెర్టెక్స్ ప్రివిలేజ్ విల్లాలో ఐదేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 2న ఎర్నాకులం వెళ్లారు. తనతోపాటు హైదరాబాద్‌కు వచ్చి చదువుకోవాలని కుమార్తె దయ ప్రసాద్‌ను 3వ తేదీన కోరగా ఆమె తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురైన కల్పన ఈ నెల 4న కొచ్చి నుంచి హైదరాబాద్‌కు విమానంలో బయలుదేరారు. అయితే, నిద్రలేమీ సమస్యకు వైద్యులు సూచించిన మందులను అప్పటికే వినియోగిస్తున్న కల్పన.. విమానం ఎక్కే ముందు రెండు మాత్రలు వేసుకున్నారు. నిజాంపేటలోని ఇంటికి ఆ రోజు మధ్యాహ్నం చేరుకున్న తర్వాత నిద్ర రావడం లేదని ఎనిమిది మాత్రలు వేసుకున్నారు. ఆ తర్వాత కూడా నిద్ర పట్టకపోవడంతో మరో 10 మాత్రలు వేసుకున్నారు. మోతాదు మించడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. భర్త ప్రసాద్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా కల్పన స్పందించకపోవడంతో ఆయన.. కాలనీ సొసైటీ సభ్యుల సాయం కోరారు. వారి ద్వారా విషయం తెలుసుకుని ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు తెరిచి అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను ఆస్పత్రికి తరలించడం తెలిసిందే.

అమెరికాలో కాల్పులు.. తెలుగు విద్యార్థి మృతి

కేశంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప రాఘవులు-రమాల కుమారుడు ప్రవీణ్ (27) ఎంఎస్ చేయడానికి 2023లో అమెరికాకు వెళ్లాడు. అయితే తన ఖర్చుల కోసం ఒక స్టోర్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం ఆ స్టోర్‌లో ప్రవీణ్ విధులు నిర్వర్తిస్తుండగా కొందరు దుండగులు ప్రవీణ్‌పై కాల్పులు జరిపి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను మిల్వాకీ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

నియోజకవర్గాల పునర్విభజనను 30 ఏళ్లు వాయిదా వేయాలి

» తమిళనాడు అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవ తీర్మానం

» తీర్మానానికి నటుడు విజయ్ పార్టీ గట్టి మద్దతు



చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను మరో 30 ఏళ్ల వరకూ వాయిదా వేయాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమస్యపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో ఒక ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని, దీనికోసం ఆయా రాష్ట్రాల అధికార పార్టీలకు అధికారిక ఆహ్వానపత్రాలు పంపాలని నిర్ణయించింది. అన్ని రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేందుకు వీలుగా 1971 నాటి జనాభా లెక్కల ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని 2000లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హామీ ఇచ్చినట్టుగానే, ప్రస్తుత ప్రధాని మోదీ కూడా 2026 నుంచి మరో 30 ఏళ్ల దాకా 1971 జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని పార్లమెంటులో హామీ ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. ప్రతిపక్షం అన్నాడీఎంకే, సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీలు ఈ తీర్మానానికి గట్టి మద్దతు ఇవ్వడం విశేషం. 'మక్కల్ నీది మయ్యం' పార్టీ అధినేత, సినీనటుడు కమల్ హాసన్ మాట్లాడుతూ ఇండియాను 'హిందియా'గా మార్చేందుకు బీజేపీ కుట్రపన్నుతోందని ఆరోపించారు. ఈ సమావేశానికి బీజేపీ తదితర కొన్ని పార్టీలు దూరంగా ఉన్నాయి.

ట్రంప్‌కు సెగ!

కెనడా, చైనా 'సుంకాల' ఫైర్



ఒంటారియో/బీజింగ్, మార్చి 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పలు దేశాల నుంచి భారీ సెగ తగులుతోంది. సుంకాల విధింపులో ఆయన అనుసరిస్తున్న వైఖరిపై పలు దేశాలు నిప్పులు చెరుగుతున్నాయి. కెనడాలోని అత్యధిక జనాభా ఉన్న ఒంటారియో ప్రావిన్స్ ప్రధాని డగ్ ఫోర్డ్ అమెరికాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగుమతులపై 25% సుంకాలు విధించడం ద్వారా కెనడాను బలహీన పరిచేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను తాము బలంగా నిలువరిస్తామని పేర్కొన్నారు. తమవైపు నుంచి కూడా.. అంతేస్థాయిలో ప్రతిఘటన ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ కోతలు విధిస్తామని తెలిపారు. "అమెరికన్ల పట్ల విచారంగా ఉంది. ఒంటారియో నుంచి న్యూయార్క్, మిషిగన్, మిన్నెసోటా ప్రాంతాల్లోని 1.5 మిలియన్ల ఇళ్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీనికి కోతలు విధించనున్నాం.అమెరికా ప్రజలను హృదయ పూర్వక క్షమాపణలు కోరుతున్నా. ఇది మీ అధ్యక్షుడు సృష్టించిన సమస్యే" అని వ్యాఖ్యానించారు. "ఒంటారియోను వారు నాశనం చేయాలని భావిస్తే.. మేం కూడా చేయాల్సింది చేస్తాం. వారికి కూడా నొప్పి తెలియాలి. మనపై వారు కఠినంగా వ్యవహరిస్తే.. దానికి రెండింతలు మనం కఠినంగా వ్యవహరిస్తాం" అని ఫోర్డ్ తేల్చి చెప్పారు. అదేవిధంగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌తో ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. అంతేకాదు, సుంకాల యుద్ధం ప్రారంభిస్తే తమదే విజయమని ఫోర్డ్ పునరుద్ఘాటించారు. అయితే.. విద్యుత్ కోతల ప్రకటనపై కొంత సందిగ్ధం ఏర్పడింది. ఫోర్డ్ చెప్పినట్టు కేవలం ఒంటారియో నుంచి మాత్రమే అమెరికాకు కోతలు ఉంటాయా? లేక పూర్తిగా కెనడా నుంచి కూడా కోతలు ఉంటాయా? అనే విషయం స్పష్టత రాలేదు. కాగా, ట్రంప్ విధించిన సుంకాలపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందిస్తూ.. తాము కూడా అమెరికా దిగుమతులపై 25% సుంకాలు విధిస్తామన్నారు. అయితే.. ఇది 20.7 బిలియన్ డాలర్లకే పరిమితం చేస్తామన్నారు. మరో 21 రోజుల తర్వాత కూడా ట్రంప్‌తీరులో మార్పు రాకుంటే.. 125 బిలియన్ కెనడియన్ డాలర్ల వాణిజ్యంపైనా సుంకాలు పెంచుతామన్నారు.

ఏ తరహా యుద్ధం కావాలన్నా రెడీ: చైనా

అమెరికా ఏ తరహా యుద్ధం కావాలన్నా తాము సిద్ధమేనని, తుది వరకు పోరాడతామని చైనా తేల్చి చెప్పింది. ఈ మేరకు అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. "మీకు యుద్ధమే కావాలంటే మేం సిద్ధం. అది సుంకాల యుద్ధమైనా, వాణిజ్య యుద్ధమైనా.. ఏ తరహా యుద్ధమైనా మేం సిద్ధం. తుదివరకు పోరాడతాం" అని ఉభయ సభల సంయుక్త సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ చైనా దౌత్యకార్యాలయం స్పష్టం చేసింది.

ఈనెలాఖర్లో భూమ్మీదకు సునీతా విలియమ్స్



న్యూఢిల్లీ, మార్చి 5: తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ ఎట్టకేలకు 10నెలల తర్వాత భూవికి తిరిగిరానున్నారు. నాసా వర్గాల సమాచారం ప్రకారం సునీత, విల్మోర్ స్థానంలో అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు చేసేందుకు మరో ఇద్దరు వ్యోమగాములు వచ్చే వారమే అంతరిక్ష కేంద్రానికి బయలుదేరనున్నారు. ఆ వ్యోమగాములు వెళ్లాక, అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెలాఖరులో సునీత విల్మోర్ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరి భూమి మీదకు చేరుకుంటారు. మంగళవారం ఐఎస్ఎస్ నుంచి సునీత, విల్మోర్ మీడియాతో మాట్లాడారు. ఈ ప్రదేశం (అంతరిక్ష కేంద్రం) నిజంగా అద్భుతం అని, అత్యున్నత శిఖరమ్మీద ఉన్న భావన కలుగుతోందని సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. అయితే తాము ఎప్పుడు తిరిగి వస్తామనే విషయంలో భూమ్మీదున్నవారికి కచ్చితమైన సమాచారం లేకపోవడం, ఫలితంగా నెలకొన్న తీవ్ర అనిశ్చితి బహుశా అత్యంత కఠినమైన అంశం అని విలియమ్స్ పేర్కొన్నారు. త్వరలోనే భూమ్మీదకు తిరిగి రానున్న నేపథ్యంలో తన పెంపుడు కుక్కలను మళ్లీ చూడబోతున్నానే విషయం తనను ఉద్విగ్నతకు గురిచేస్తోందని చెప్పారు. కాగా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2030 వరకు కాకుండా వెంటనే అంతరిక్ష కేంద్రాన్ని మూసివేయాలంటూ ఎలాన్ మస్క్ చేసిన ప్రతిపాదనపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పేస్ స్టేషన్‌ను మూసేయాలని చెప్పడానికి ఇది సరైన సమయం కాదని ఆమె పేర్కొన్నారు.

గోడ కూల్చివేత ఖర్చు.. నేహారెడ్డి కంపెనీ నుంచే వసూలు

» విశాఖ కమిషనర్, ఏపీ సీజడ్‌ఎంఏకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతిసమీపంలో కాంక్రీట్ గోడ నిర్మించిన వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డికి చెందిన కంపెనీపై హైకోర్టు కన్నెర చేసింది. ఆమె భాగస్వామిగా ఉన్న అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ కంపెనీపై క్రిమినల్ చర్యలు ప్రారంభించేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీ సీజడ్‌ఎంఏ) సభ్య కార్యదర్శిని ఆదేశించింది. అవ్యాన్ రియల్టర్స్ భాగస్వాములను ప్రాసిక్యూట్ చేయాలని నిర్దేశించింది. అక్రమ కాంక్రీట్ నిర్మాణాలతో ప్రకృతికి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు నిపుణుల కమిటీని వేయాలని కేంద్ర అటవీ-పర్యావరణ శాఖ (ఎంవోఈఎఫ్)ను ఆదేశించింది. మరోవైపు.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కాంక్రీట్ గోడను పునాదులతో సహా తొలగించకపోవడాన్ని ఆక్షేపించింది. గోడను పూర్తిగా తొలగించని విషయాన్ని నివేదికలో కూడా పేర్కొనలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చిత్తశుద్ధితో వ్యవహరించాలని హితవు పలికింది. ఇసుక కింద 588 మీటర్ల పొడవు, ఆరడుగుల లోతున్న గోడ మొత్తాన్ని తొలగించాలని అధికారులకు తేల్చిచెప్పింది. అలాగే భీమునిపట్నం సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి నాలుగు రెస్టోబార్లు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్న నేపథ్యంలో వాటిని సీఆర్‌జడ్ ప్రాంతంలో నిర్మించారో లేదో సర్వే జరిపి నివేదిక సమర్పించాలని ఏపీ సీజడ్‌ఎంఏ సభ్య కార్యదర్శి, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీని ఆదేశించింది. సర్వే చేసే సమయంలో సంబంధిత రెస్టోబార్ యజమానులను భాగస్వాములను చేసి, వారి వివరణ కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

పాక్షికంగానే కాంక్రీటు గోడ తొలగింపు..

భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో నేహారెడ్డి శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ పిల్ దాఖలుచేశారు. ఇదే వ్యవహారంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతిసమీపంలో జరుపుతున్న నిర్మాణాల తొలగింపు విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. భీమునిపట్నం తీర ప్రాంతంలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించేందుకు ఏపీ సీజడ్‌ఎంఏ సభ్య కార్యదర్శి, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. నిబద్ధత కలిగిన అధికారుల బృందంతో సర్వే చేయించి సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని.. అందుకు సంబంధించిన నివేదికను కోర్టు ముందుంచాలని అధికారులను ఆదేశించింది. నివేదిక సమర్పించడంలో విఫలమైతే తదుపరి విచారణకు కోర్టు ముందు ఆన్‌లైన్ ద్వారా హాజరుకావాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, మూర్తి యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కాంక్రీట్ గోడను పాక్షికంగానే తొలగించారని కేఎస్ మూర్తి కోర్టు దృష్టికి తెచ్చారు. భూమి పైన ఉన్న గోడ మొత్తాన్ని అధికారులు తొలగించారని ఇప్పటికే ఆదేశాలిచ్చామని ఎస్‌జీపీ తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. గోడను పూర్తిగా తొలగించని విషయాన్ని నివేదికలో పేర్కొనకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. కాంక్రీట్ గోడ కూల్చివేతకయ్యే ఖర్చు మొత్తాన్ని ఆ కంపెనీ నుంచే వసూలు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. కాగా, గంటా నూకరాజు వేసిన పిల్‌పైనా ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.జాయ్ వాదనలు వినిపించారు. సీఆర్‌జడ్ పరిధిలో శాశ్వత నిర్మాణాలు జరిపి రెస్టోబార్లు నడుపుతున్నారని వివరించారు. అధికారులు కూల్చివేసిన నిర్మాణాలకు 280 మీటర్ల దూరంలోనే ఈ రెస్టోబార్లు ఉన్నాయన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ,సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి ఆ రెస్టోబార్లు నిర్మించారో లేదో సర్వే జరిపి నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది.

తిరుమల నడక దారిలో యువకుడి మిస్సింగ్

- లోయలోకి దూకాడని భద్రతా సిబ్బందికి సమాచారం
- రెండున్నర గంటలపాటు గాలించినా లభించని ఆచూకీ,
- సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలన.. నేడు మరోసారి గాలించాలని నిర్ణయం


లోయలో పడినట్టుగా అనుమానిస్తున్న భక్తుడు

తిరుమల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల అవ్వాచారికోన లోయ వద్ద బుధవారం ఉత్కంఠ నెలకొంది. 'కాలినడకమార్గంలోని లోయలో ఎవరో యువకుడు దూకేశాడు' అంటూ ఓ భక్తుడు భద్రతా సిబ్బందికి బుధవారం ఉదయం సమాచారం ఇచ్చాడు. తిరుమల పోలీసులు అవ్వాచారి కోన లోయలోకి తాళ్ల సాయంతో దిగారు. సుమారు రెండున్నర గంటలపాటు గాలించినా ఆచూకీ దొరకలేదు. భక్తుడు చెప్పిన ట్టుగా తలనీలాలు సమర్పించి తిరుమల నుంచి కాలినడక ప్రారంభించి తిరుపతికి ఎవరైనా చేరు కోలేదా అనే కోణంలో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఓ వ్యక్తి మార్గమధ్యలో కనిపించకుండా పోయినట్టు గుర్తించారు. లోయలో దూకిన వ్యక్తి కనిపించకపోవడంతో తిరిగి మరొక మార్గంలో తిరుమలకే వచ్చాడా, లేకుంటే ఎక్కడైనా ఉండిపోయాడా కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గురువారం ఉదయం మరోసారి గాలించాలని భావిస్తున్నారు.

సెకండ్ ఇంటర్ ఇంగ్లీషు ప్రశ్నపత్రంలో తప్పులు

అమరావతి, నెల్లూరు విద్య, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. ఈ నెల 1న జరిగిన ఇంటర్ ఫస్టియర్ తెలుగు ప్రశ్నపత్రంలో తప్పులు దొర్లగా.. తాజాగా బుధవారం జరిగిన సెకండ్ ఇంటర్ ఇంగ్లీషు ప్రశ్నపత్రంలో కూడా రెండు తప్పులు కనిపించాయి. డయాగ్రాం ఆధారంగా ఇచ్చిన రెండు ఐదు మార్కుల ప్రశ్నలకు డయాగ్రాంలు సరిగా ప్రింట్ కాలేదు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి.. సరిగా కనిపించని అంకెలు, పదాలను ఇన్విజిలేటర్ల ద్వారా బోర్డులపై రాయించారు. కొన్నిచోట్ల మౌఖికంగా విద్యార్థులకు వాటిని తెలియజేశారు. మరికొన్నిచోట్ల తెల్ల కాగితంపై రాసి విద్యార్థులకు పంచి పెట్టారు. కాగా, ప్రశ్నపత్రాల రూపకల్పన, ముద్రణకు ఇచ్చే ముందు పరిశీలించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఈ తప్పిదాలకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రెండు ప్రశ్నలకు అదనపు మార్కులు వేయాలని పేరెంట్స్ అసోసియేషన్ నేతలు కోరారు.

వృత్తిపన్ను వసూళ్ల బాధ్యత వాణిజ్య పన్నుల శాఖకు!

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో వృత్తి పన్ను వసూళ్ల బాధ్యతను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అప్పగిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ బుధవారం జీవో జారీ చేశారు. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో గత పదేళ్ల నుంచి వసూలైన వృత్తి పన్ను వివరాలు సమగ్రంగా లేవని జీవోలో పేర్కొన్నారు.

డైట్ బకాయిలకు 5.50 కోట్లు విడుదల

మైనార్టీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి డైట్ బకాయిలు చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.5.50 కోట్లు విడుదల చేసిందని మంత్రి ఫరూక్ బుధవారం తెలిపారు. 2024-25కు సంబంధించి డైట్ బకాయిల చెల్లింపుల కోసం నిధులు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.

కాకాణి మెడకు 'ఫోర్జరీ' ఉచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

కేసు దర్యాప్తు మొదలు పెడితే మొదటికే మోసం వస్తుందని వైసీపీ అధిష్ఠానం భావించి కేసును పక్కన పెట్టేసింది. అయితే చేసిన పాపం ఊరకే పోదన్నట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాగుంట పెట్టిన కేసుకు మళ్లీ ప్రాణం వచ్చింది. ఫోర్జరీ సంతకాలపై మాగుంట చేసిన ఫిర్యాదుపై సమగ్ర విచారణకు నిర్ణయించుకుంది. ఈ క్రమంలో పది మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేసింది. బాపట్ల ఎస్పీ పర్యవేక్షణాధికారిగా, బాపట్ల డీఎస్పీ పరిశోధనాధికారిగా ఉన్న సిట్ బృందం రెండు రోజుల క్రితం రంగంలోకి దిగింది. నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయం, వెంకటాచలం పోలీసు స్టేషన్లలో ఈ కేసుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుంది. మాగుంట సంతకాలను ఫోర్జరీ చేసింది ఎవరు, చేయించింది ఎవరు, వెనుక నుండి కథ నడిపిన శక్తి ఎవరు? అనే విషయాలను లోతుగా దర్యాప్తు చేయనున్నారు. దీంతో ఈ వ్యవహారంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇరుకున పడనున్నారనే ప్రచారం ఊపందుకుంది.

జరిగింది ఇదీ...

వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా సహజ వనరులను కొల్లగొట్టారు. సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి భారీ ఎత్తున గ్రావెల్ దోపిడీ జరిగింది. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి కూడా కావడంతో గ్రావెల్ దందా అడ్డూఅదుపు లేకుండా సాగింది. రకరకాల వ్యక్తులు, సంస్థల పేర్లతో ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని గ్రావెల్‌ను బ్లాక్‌లో అమ్ముకున్నారు. రైల్వే ట్రాక్‌ల నిర్మాణాలు, జాతీయ రహదారుల నిర్మాణాలతోపాటు 'జగనన్న లే అవుట్ల' చదును కార్యక్రమాలకు పెద్ద ఎత్తున గ్రావెల్ అవసరం ఏర్పడింది. ఈ క్రమంలోనే దీని ధర బంగారమయ్యింది. సర్వేపల్లికి చెందిన వైసీపీ నాయకులు దీనిని అవకాశంగా తీసుకొని సర్వేపల్లి రిజర్వాయర్‌పై కన్నేశారు. అధికార పార్టీ పలుకుబడితో అప్పట్లో రకరకాల పేర్లతో దొంగ పర్మిట్లు తీసుకొని గ్రావెల్ కొల్లగొట్టారు. ఈ క్రమంలోనే 2021 జూన్ 18వ తేదీన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేరుతో కూడా వెయ్యి టన్నుల మట్టికి అనుమతులు ఇచ్చారు. ఈ బరితెగింపే ఇప్పుడు వైసీపీ అగ్రనాయకుల మెడకు ఉచ్చులా చుట్టుకుంది.

మాగుంట ఫిర్యాదుతో ఉలికిపాటు

సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి ఇష్టారీతిగా గ్రావెల్ తరలింపును తెలుగుదేశం నేత, నాటి మాజీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంలో నాయకులు నిరసించారు. రిజర్వాయర్‌లో అనుమతులకు మించి తవ్వకాలు జరుపుతున్నారని ఆధారాలతో సహా నిరూపించారు. దీంతో ఇరిగేషన్ అధికారులకు విచారణ జరపక తప్పలేదు. రిజర్వాయర్‌ను పరిశీలించి అనుమతులకు మించి తవ్వకాలు జరిపింది నిజమేనని నివేదిక ఇచ్చారు. ఇదే సమయంలో టీడీపీ నాయకులు దొంగ పర్మిట్లతో వెళుతున్న టిప్పర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ప్రజలు, ప్రతిపక్షం నుంచి తిరుగుబాటు ఎక్కువ కావడంతో అధికారులు రంగంలోకి దిగి ముగ్గురిపై వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురిలో మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా ఒకరు. అయితే అప్పటివరకు మాగుంట ఎంపీ అనే విషయం ఎవరికీ తెలియదు. పర్మిట్లు ఇచ్చిన ఇరిగేషన్ శాఖకూ తెలియదు. తనకు వెయ్యి టన్నుల గ్రావెల్ అవసరం అవుతుందని ఎంపీ మాగుంట ఇరిగేషన్ శాఖకు లేఖ రాసినట్లు, దాని ఆధారంగా అనుమతులు ఇచ్చినట్లు రికార్డులు బయటపడ్డాయి. మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతకాలనుకూడా స్థానిక వైసీపీ నాయకులు ఫోర్జరీ చేశారనే విషయం చాలాఆలస్యంగా తెలిసింది.


నెల్లూరు జిల్లా సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు(ఫైల్)

వివాదమయ్యింది ఇలా...

వెంకటచలం స్టేషన్‌లో కేసు నమోదు అయిన నేపథ్యంలో పోలీసులు నోటీసులు తీసుకొని మాగుంట వద్దకు వెళ్లారు. తనకు ఏమాత్రం సంబంధం లేని కేసులో తన పేరు చేర్చి నోటీసులు తీసుకొచ్చిన పోలీసులపై మాగుంట విరుచుకుపడ్డారు. ఆ వెంటనే తన సంతకాలు ఎవరో ఫోర్జరీ చేశారని. వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు పిర్యాదు చేశారు. అప్పుడు ఆయన అధికార వైసీపీకి చెందిన ఎంపీ కావడం విశేషం.

ఈ దందాపై టీడీపీ నేతలు సోమిరెడ్డి నాయకత్వంలో పెద్దఎత్తున ఉద్యమించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ఉద్యమాలు చేశారు. లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. సొంత పార్టీకి చెందిన ఎంపీ సంతకాలను ఫోర్జరీ చేయడం, దానిపై సాక్షాత్తు ఆ ఎంపీనే పోలీసులకు పిర్యాదు చేయడంతో వివాదం పెద్దదయ్యింది. దీంతో మాగుంట ఫిర్యాదును వైసీపీ అధినాయకత్వం తొక్కిపెట్టింది. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఈ ఫోర్జరీ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

కాకాణి అండతోనే..

గత వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డే సర్వాధికారి. సర్వేపల్లి రిజర్వాయర్ గ్రావెల్ దోపిడీకి సైతం కాకాణి సహాయ, సహకారాలు పూర్తిగా ఉన్నట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కాకాణి అండ లేకుంటే ఎంపీ మాగుంట సంతకాలు ఫోర్జరీ చేసే సాహసం ఎవరూ చేయలేరనే వాదన కూడా ఉంది. ఈ కోణంలోనే సిట్ దర్యాప్తు సాగనున్నట్లు తెలుస్తోంది.

పెట్టుబడుల పర్యవేక్షణకు
'స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్'

- చైర్మన్‌గా సీఎం, వైస్ చైర్మన్‌గా సీఎస్
- సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుల ఏర్పాటు, వాటి పర్యవేక్షణతో పాటు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రత్యేకంగా "స్టేట్ ప్రాజెక్టు మోనిటరింగ్ గ్రూప్"ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రాజెక్టు పర్యవేక్షణ గ్రూపునకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్ చైర్మన్‌గా, ఇంధనం, పరిశ్రమలు, ఆర్ అండ్ బీ, టూరిజం, విద్య, మున్సిపల్, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శులతో పాటు ఈడీబీ సీఈవో మెంబర్లుగా వ్యవహరిస్తారు. సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్వీనర్‌గా ఉంటారు. చైర్మన్ హోదాలో ఉన్న సీఎం, వైస్ చైర్మన్ హోదాలో ఉన్న సీఎస్ కొంత మంది మెంబర్లను నియమించుకునేందుకు అవకాశం కల్పించారు. స్టేట్ ప్రాజెక్టు మోనిటరింగ్ గ్రూప్ రాష్ట్ర ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) పరిధిలో ఉంటుంది. సాధారణ పరిపాలన శాఖ పాలన వ్యవహారాలు చూసుకుంటుంది.

గ్రూప్ విధివిధానాలు..

- రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణలో కీలకమైన పాత్ర పోషించాలి. రూ. 50 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన పెట్టుబడులను పర్యవేక్షించాలి. ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి. సమస్యలు సులభంగా పరిష్కరించాలి.
- భారీ ప్రాజెక్టులకు ఆమోదాలు, అనుమతులను ఇవ్వడంతో పాటు వాటిని వేగవంతం చేయాలి. దీనిపై శాఖల మధ్య ఉన్న సమస్యలు పరిష్కరించాలి.
- ప్రాజెక్టులు సజావుగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత విభాగాలు, ఏజెన్సీలు, నియంత్రణ సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. పురోగతిని పర్యవేక్షించాలి. సకాలంలో సలహాలు, సూచనలు అందించాలి. కేంద్రంలోని పీఎంజీతో సమన్వయం చేసుకుని పనిచేయాలి. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రూపు కృషి చేయాలి.

రెవెన్యూ చట్టాల్లో మార్పులపై మంత్రివర్గ ఉపసంఘం

- అసైన్డ్, నాలా, ఓటీసీ, 22(ఏ)అంశాలపై అధ్యయనం
- సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు, సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ చట్టాలు, నిబంధనల్లో సమూల మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులు, సామాన్యులు ఎదుర్కొంటున్న అసైన్డ్ భూముల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని నిర్ణయించింది. దీనిపై దిశానిర్దేశం చేయడానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు (జీఓ 464) జారీ చేశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, టీజీ భరత్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూఖ్ సభ్యులుగా ఉన్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారని జీవోలో పేర్కొంది.

కమిటీ అధ్యయనం చేసే అంశాలివీ..

- అమల్లో ఉన్న రెవెన్యూ చట్టాలు, వాటి నియమ నిబంధనల్లో తీసుకురావాల్సిన మార్పులు, సవరణలు
- రెవెన్యూ వ్యవస్థను మరింత సులభతరం చేయడం, ప్రజలకు చేరువ చేసేందుకు భూ పరిపాలనకు సంబంధించిన బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్‌వో), ఉత్తర్వుల (జీవో)పై అధ్యయనం.
- వ్యవసాయ భూమి వినియోగ మార్పిడి, వన్ టైమ్ కన్వర్షన్ తదిత ర స్కీములను మరింత బలోపేతం చేయడానికి పురపాలక శాఖతో కలిసి సమగ్ర పాలసీని రూపొందించడం.
- అసైన్డ్ భూముల చట్టం ప్రకారం భూములను ఫ్రీహోల్డ్ చేయడంలో పేద వర్గాల ప్రయోజనాలు కాపాడేలా కొత్త పాలసీని ఖరారు చేయడం.
- రిజిస్ట్రేషన్ చట్టంలోని 22(ఏ) సెక్షన్‌ను అధ్యయనం చేసి అసైన్డ్, ఇతర కీలక భూముల విషయంలో తగిన పాలసీని సిఫారసు చేయాలి.
- భూ కేటాయింపు విధానం పక్కాగా అమలయ్యేలా తగిన జాగ్రత్తలు, సూచనలు చేయాలి. ఈ అంశాలపై ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సీఎస్ కోరారు.

ప్రాసిక్యూటర్ల నియామకంపై వివరణ ఇవ్వండి

- తదుపరి విచారణకు ఆన్‌లైన్‌లో మా ముందు హాజరుకండి
- రాష్ట్ర సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కింది కోర్టుల్లో ప్రాసిక్యూటర్లు, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ల నియామకం విషయంలో జరుగుతున్న జాప్యంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు ఆన్‌లైన్ ద్వారా తమ ముందు హాజరు కావాలని సీఎస్‌కు స్పష్టం చేసింది. విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని కింది కోర్టుల్లో ప్రాసిక్యూటర్లు, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతోందని, ఆరు నెలల్లో ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. కోర్టుల అవసరాలకు అనుగుణంగా ప్రాసిక్యూటర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ప్రణతి స్పందిస్తూ.. 'పిటిషనర్ చెబుతున్న స్థాయిలో ప్రాసిక్యూటర్ల అవసరం ఉండదు. రాష్ట్రంలోని కోర్టుల్లో ఎంతమంది అవసరమో అధ్యయనం చేసేందుకు, వారి నియామకంలో నిబంధనలు రూపొందించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది. వాటిని నోటిపై చేసేందుకు మరికొంత సమయం పడుతుంది. విచారణను వాయిదా వేయాలి' అని కోరారు.

ఏపీపీఎస్సీ నియామకాల నోట్ ఫైళ్లు మా ముందు ఉంచండి: హైకోర్టు

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిపిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్, సభ్యుల నియామకానికి సంబంధించిన నోట్‌ఫైళ్లను తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను 19కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకాలను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జరపడం లేదని పేర్కొంటూ న్యాయవాది తాండవ యేగేష్ 2022లో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా, పిటిషనర్ తాండవ యేగేష్ వాదనలు వినిపించారు. కనీస అర్హతలు లేని రాజకీయ నాయకులు, మెడికల్ షాపులు నడిపేవారు, ఎల్ఐసీ ఏజెంట్లు, అధికార పార్టీతో అంటకాగినవారిని కమిషన్ సభ్యులుగా నియమించారని తెలిపారు. మార్గదర్శకాలకు విరుద్ధంగా నియామకాలు జరిగాయని, ఆ నోట్ ఫైళ్లను కోర్టు ముందు ఉంచేలా ఆదేశాలివ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్. ప్రణతి స్పందిస్తూ.. గత ప్రభుత్వంలో నియమితులైన సభ్యులు ఇప్పటికే కొంత మంది రాజీనామా చేయగా, మరికొందరు పదవీ విరమణ చేశారని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామక అర్హతల విషయంలో స్పెషల్ సీఎస్ నేతృత్వంలో వేసిన కమిటీ గతేడాది డిసెంబరులో నివేదిక ఇచ్చిందని, ఆ వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తామని నివేదించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటల గొప్పలు

అమెరికా అధ్యక్షబాధ్యతలు రెండోసారి చేపట్టిన తరువాత, మొదటిసారి కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో డోనాల్డ్‌ట్రంప్ చేసిన ప్రసంగంలో ఆత్మస్తుతి, పరనిందలతో పాటుగా, ప్రమాద హెచ్చరికలు కూడా ప్రబలంగానే ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన ఈ నెలన్నరలోనూ తాను సృష్టించిన గందరగోళాన్నీ, చేపట్టిన విధ్వంసాన్ని మహా అద్భుతాలుగా, చారిత్రాత్మక పరిణామాలుగా అభివర్ణించుకోవడం అటుంచితే, ముందుముందు మరింత వినాశనం ఉన్నదని కూడా ఆయన హెచ్చరిస్తున్నారు. గత ఎనిమిదేళ్ళ కంటే ఈ ఆరువారాల్లోనే అధిక విజయాలు, అద్భుతాలు జరిగాయని ఆయన భుజాలు చరుచుకున్నారు. అమెరికా ఇక హాయినపడవచ్చునని చెప్పుకున్నారు. పాడుకాలం పోయి గత కాలపు ఘనమైన రోజులు తిరిగొచ్చాయని అంటూనే, అమెరికాను మళ్ళీ అగ్రస్థానాన నిలబెట్టే క్రమంలో ఇది ఆరంభం మాత్రమేనని హెచ్చరిక కూడా చేశారు. తన దేశాన్ని యావత్ ప్రపంచం దోచుకుంటూంటే, రక్షకుడిగా తాను అవతరించానన్నది ఆ ప్రసంగం అంతరార్థం.

ఇది ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఓ నాయకుడి ప్రసంగంలా కాక, ఓ చక్రవర్తిలాగా ఆయన మాట్లాడాడు. దూకుడు వ్యాఖ్యలు, అర్ధసత్యాలు, అపహాస్యాలు గుదిగుచ్చిన ప్రసంగం అది. డెమోక్రాట్లు అడ్డు తగులుతారని అనుకున్నదే కానీ, అదేమీ గట్టిగా జరగలేదు. నువ్వేమీ రాజువు కావు అంటూ కొందరు ఆక్షేపించారు, చిన్నచిన్న నిట్టూర్పులతో తమ అసమ్మతిని తెలియచేశారు. కాస్తంత గట్టిగా నిరసన తెలియచేసిన టెక్సాస్ డెమోక్రాట్ అల్ గ్రీన్‌ను సభనుంచి గెంటేయడంతో ఆయన ఇప్పుడు అధ్యక్షుడిని అభిశంసించే ఆలోచనలో ఉన్నాడు. రెండుసార్లు అభిశంసనకు గురై, ముప్పైనాలుగు అపరాధాలు రుజువైన ట్రంప్‌కు అదేమీ కొత్తకాదు కూడా. ఈ ప్రయత్నం గనుక తప్పిజారి పట్టాలెక్కితే, మలివిడతలో కూడా ఒక సుదీర్ఘమైన అభిశంసన ప్రక్రియను అమెరికాతో పాటు మిగతా ప్రపంచమూ భరించాల్సివస్తుంది.

అమెరికా అధ్యక్షుడు ఆరువారాల్లోనే తనకు శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరని తేల్చేశారు. ఆప్తమిత్రదేశాలను అదిలించి, అవమానించి దూరం నెట్టేశారు. అధికారులంతా దోపిడీదారులనీ, బద్ధకస్తులనీ, జనం సొమ్మును రాళ్ళపాల్జేశారనీ ఆరోపిస్తూ వారిని వెంటాడుతున్నారు, ఇంటికి పంపేస్తున్నారు. గత పాలకుల చేతకానితనం, బాధ్యతారాహిత్యం కారణంగా దేశం అప్పుల ఊబిలోకి జారిపోయిందనీ, మిగతా ప్రపంచం దోచుకుందనీ, తాను ఉద్ధరిస్తానన్న కథనాలకు అనుగుణంగానే ఆయన చర్యలన్నీ ఉన్నాయి. మిగతా దేశాలకు ఇచ్చేది ఆపేయడం, సాధ్యమైనంత దోచేయడం లక్ష్యంగా దాడి సాగుతోంది. మిత్రుడు, శత్రువు తేడాలేకుండా సుంకాలతో బాదేయడం, నమ్ముకున్న వారిని నట్టేటముంచేయడం, సుంకాలతో మొత్తి, ప్రాంతాలను లాక్కోవడం ఒక కొత్తవిలువగా కొనసాగుతోంది. ఆయన ప్రసంగంలో ప్రతిఫలించింది ఇదే.

ఆయన మస్క్‌ను మెచ్చుకున్నారు, మెలానియాను ప్రశంసించారు. స్వల్పకాలంలోనే వంద ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశానని, వందలాది చర్యలు తీసుకున్నానని చెప్పుకున్నారు. నినాదాలు చేసినా, నిరసనలు వెలిబుచ్చినా యూనివర్సిటీలనుంచి వెళ్ళగొడతానని హెచ్చరించిన ఈయనే, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ మళ్ళీ తిరిగొచ్చిందని గొప్పలకు పోయారు. ఇక ఏప్రిల్ ఫూల్ మీమ్స్ బారిన పడలేనంటూ ఆ మర్నాటి నుంచి అమలు చేయబోతున్న ప్రతీకార సుంకాలతో ఈ వికార యుద్ధానికి ఇప్పట్లో ముగింపు లేదని అర్థం. భారతదేశం సహా అన్ని దేశాలనూ ఆయన తన ప్రసంగంలో ఆడిపోసుకున్నారు. ఎవరు ఎంతగా తమను దోచేస్తున్నదీ, దాచేస్తున్నదీ చెప్పుకొచ్చారు. తన సుంకాల యుద్ధంతో దేశం మరింత సుసంపన్నమై, గొప్పదేశంగా అవతరిస్తుందని భరోసా ఇచ్చారు. మిగతా దేశాల సంగతి అటుంచితే, నలభైశాతానికి పైగా ఎగుమతులు దిగుమతులు జరిగే మెగ్జికో, కెనడా, చైనాతో ఈ యుద్ధం ఇదేరీతిలో కొనసాగితే ఆదాయాలు పడిపోయి, అమెరికా మధ్యతరగతికి పెద్ద దెబ్బ తగులుతుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ అధ్యక్షుడి హయాంలో అమెరికా పరువుదిగజారిపోతోందని గట్టిగా చెప్పగలిగే బలం డెమొక్రాట్లకు కూడా లేదు. ఉభయసభల్లోనూ ఆయనే బలవంతుడు కనుక వ్యతిరేకించే వాతావరణం లేదు. పెరిగిన జీవన వ్యయం ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చేవరకూ ట్రంప్ ఓటు బ్యాంకు తిరగబడే పరిస్థితీ ఉండదు. కానీ, స్టాక్ మార్కెట్లు ఎప్పటికప్పుడు ట్రంప్ చర్యలను గమనిస్తూ, తుళ్లిపడుతూనే ఉన్నాయి. కనీసం పాతికేళ్ళుగా మనకు తెలిసిన, మనతో వ్యవహారాలు నడిపిన అమెరికా ఇది కాదన్నది వాస్తవం.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సంకీర్ణ ప్రభుత్వం

భారతదేశంలో ఏక పార్టీ పాలన ముగిసిన తరువాత డెబ్బైయ్యో దశకంలో ప్రారంభమైన సంకీర్ణ రాజకీయాలు అనేక ఒడిదుడుకులు, ఎత్తుపల్లాల్ని ఎదుర్కొంటూ పరిణతి చెందుతూ వస్తున్నాయి. జనతా ప్రభుత్వంతో మొదలై నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీయే, యూపీఏ, ఇండియా కూటముల రూపంలో నేటికీ దేశంలో సంకీర్ణ రాజకీయాలు నడుస్తూనే ఉన్నాయి. ఈ పరిపక్వతకి చరిత్ర నేర్పిన అనేక పాఠాలే కారణం. సమకాలీన పరిస్థితుల్లో ఏదో ఒక పార్టీ మెజార్టీ సాధించినా, అది ఎంతకాలం ఉంటుందో తెలియదు. పార్టీ ఫిరాయింపులు వెన్నంటే ఉంటున్నాయి. తరువాతి ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉండబోతోందో తెలియదు. నేడు ప్రతి సామాజిక వర్గం, రాజకీయ పార్టీ అధికారంలో తన వాటా డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడున్న సమీకరణాలు రేపు ఉంటాయో లేదో తెలియదు. ఎలా మారుతాయో ఊహించలేం. రాజకీయ పార్టీలది ఎన్నికల వరకు ఒక తీరు, గెలిచాక మరో తీరు. ఏదీ గ్యారంటీ లేని నియో లిబరల్ రాజకీయ వాతావరణం సమాజాన్ని ఆవహించింది. ఈ పరిస్థితుల్లో సంకీర్ణాల్ని తెగేవరకి లాగటం ఎంత ప్రమాదకరమో గత ఐదు దశాబ్దాల్లో అవగాహన కలిగింది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను పాలిస్తున్న కూటమి నాయకుల్లో ఈ అవగాహన బలంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా టీడీపీ, జనసేన వర్గాల్లో అక్కడక్కడ కొన్ని టెన్షన్స్ కనిపిస్తున్నా చంద్రబాబు, పవన్ కల్యాణ్ వాటిని సముదాయిస్తున్నారు. భవిష్యత్తు పట్ల అవగాహన లేకుండా, బాధ్యతారహితంగా రెచ్చగొట్టే వ్యాఖ్యల్ని ఇద్దరూ హద్దుల్లోనే ఉంచుతున్నారు. వారు పరస్పర గౌరవాన్ని, ప్రాధాన్యతని పదేపదే శ్రేణులకి గుర్తుచెయ్యటం అందులో భాగమే. గత ఎన్నికల్లో కూటమిలో పవన్ కల్యాణ్ లేకపోతే ఎంత రిస్కో చంద్రబాబుకు, ఆయన లేకపోతే ఎంత ప్రమాదకర పరిణామాలు చోటుచేసుకునేవో పవన్ కల్యాణ్‌కి తెలుసు. పొత్తు లేకపోతే ఫలితాలు ఇలా ఉండేవికావన్న విశ్లేషణలు భవిష్యత్తులో ఇద్దరూ కలిసి నడవాల్సిన అవసరాన్ని నొక్కి చెపుతున్నాయి. ఈ సందర్భంలోనే 15 సంవత్సరాల వరకు కూటమి ప్రభుత్వ పాలన అవసరాన్ని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు కొనసాగుతుందని చెప్పటం ఆయన వాస్తవిక దృక్పథాన్ని సూచిస్తుంది.



సంకీర్ణ ప్రభుత్వాలైనా, ఏకపార్టీ ప్రభుత్వాలైనా పాలనలో కొన్ని పొరపాట్లు దొర్లటం సహజం. దురదృష్టవశాత్తూ ఆ పొరపాట్ల మీద నాయకుల్లో ఆత్మవిమర్శ అరుదుగా జరుగుతుంది. ఫలితంగా ఆ పొరపాట్లని ప్రతిపక్షాలు ఆయుధాలుగా మలుచుకుంటాయి. పవన్ కళ్యాణ్ ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిమీద తానే ముందుగా స్పందించి సహచరులను అప్రమత్తం చేస్తున్నారు. ఇది ప్రభుత్వం పట్ల ప్రజల్లో క్రెడిబిలిటీ పెంచుతుంది. లోపాలు దిద్దుకునే అవకాశం కలిగిస్తుంది. ప్రతిపక్షాలు కొత్తగా ప్రజలకి చెప్పటానికి ఏదీ లేకుండా చేస్తుంది.

సంకీర్ణ రాజకీయాల్లో సాధారణంగా పెద్ద పార్టీలు చిన్న పార్టీల అభిప్రాయాల్ని గౌరవించకుండా వ్యవహరిస్తాయి. సంకీర్ణాలకి ఇది ప్రమాదకరం అని గుర్తించనందు వల్ల దేశంలో అనేక ప్రభుత్వాలు కూలిపోయాయి. అన్నింటికంటే ఉమ్మడి అజెండాకి దెబ్బతగలకుండా చూసుకోవాలి. దీని బాధ్యత అన్ని పార్టీలపై ఉన్నప్పటికీ పెద్ద పార్టీల పైనే ఎక్కువ ఉంటుంది. గతంలో మొరార్జీదేశాయి, విపి సింగ్, గుజ్రాల్, వాజపేయి లాంటి వారు మొదలుపెట్టిన సంకీర్ణ రాజకీయాలు ముక్కచెక్కలు కావటానికి కారణం భాగస్వాముల మధ్య పట్టువిడుపులు లేకపోవటమే. ఆ రాజకీయాలకి పూర్తిగా భిన్నమైన సంకీర్ణం నేడు ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తుంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలసి రాష్ట్రంలో గాడితప్పిన శాంతిభద్రతలు, అభివృద్ధి కోసం పొత్తు అవసరమని ప్రజల్ని ఒప్పించారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు గాడిలో పడుతున్నాయి. పరిస్థితుల్ని చక్కదిద్దాలంటే ఈ ప్రభుత్వానికి తగినంత సమయం కావాలి. గత ప్రభుత్వం కేంద్రం నుంచి కనీస వనరుల్ని కూడా సమకూర్చలేకపోయింది. ఇప్పుడు రాష్ట్రం కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా అన్ని రంగాల్లో తన వాటాని పొందుతున్నది. కేంద్రంతో ఇటువంటి సానుకూలమైన వాతావరణంలో ప్రగతికి అవకాశం మెండుగా ఉంటుంది. ఈ అవకాశాన్ని వాడుకోలేకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని తెలియజేయటానికి తరచూ పవన్‌కల్యాణ్ కూటమి ప్రాధాన్యతని గుర్తు చేస్తున్నట్టు కనిపిస్తుంది. భాగస్వాములు సంయమనం, సహనంతో ఒకరినొకరు గౌరవించుకుంటూ కూటమినీ, తద్వారా రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని ఆ మాటలు తెలియజేస్తున్నాయి. చిన్నాచితకా సమస్యల్ని పెద్దగా చూపి కూటమిని బలహీనపరచాలనుకునే ప్రచారాలకి చెక్ పెడుతూ, రాష్ట్రం అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంటుందని ప్రజల్లో భరోసా కలిగించటంగా ప్రజలు ఆయన మాటల్ని తీసుకుంటున్నారు.

● ప్రొఫెసర్ శ్రీపతి రాముడు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

డిజిటల్ విప్లవంతో వికసిత భారతం



ప్రపంచ ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తూ ఐదు సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. నేడు మన ప్రధాన ఎగుమతుల్లో తొలి మూడూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులే. ఈ ఏడాదే మొట్టమొదటి 'మేక్ ఇన్ ఇండియా' చిప్‌ను ఆవిష్కరించబోతున్నాం. సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ దన్నుగా, భారతదేశపు సాంకేతిక విప్లవాన్ని డీపీఐ ముందుకు తీసుకువెళుతోంది. భారత్ తనదైన ఏఐ వ్యవస్థ ద్వారా ఆ అధునాతన సాంకేతికతను ప్రజాస్వామ్యీకరిస్తూ దాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తోంది.

మహారాష్ట్రలోని బారామతిలో, ఒక చిన్న రైతు కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి వ్యవసాయం రూపురేఖల్ని మార్చివేస్తున్నాడు. ఈ అసాధారణ ప్రయత్నం ఇపుడు మన కళ్ల ఎదుట రూపుకడుతున్నది. ఎరువుల వాడకం తగ్గిపోయింది. నీటిని సమర్థంగా వినియోగిస్తున్నారు. అలాగే అధిక దిగుబడీ సుసాధ్యం అయింది. ఇదంతా ఏఐ వల్లనే!

భారతదేశంలో ఏఐ సృష్టిస్తున్న విప్లవంలో ఇది ఒక భాగం మాత్రమే. అధునాతన సాంకేతికతలు, ఆవిష్కరణలు ఇక ఎంతమాత్రం ప్రయోగశాలలకే పరిమితం కావు. సాధారణ పౌరుల జీవితాలను అవి సమూలంగా మార్చివేస్తున్నాయి. రేపటి రోజున జరగబోయే పెను మార్పులకు బారామతి రైతు కథ ఒక సూక్ష్మరూపం- అంటే.. 2047 వికసిత భారత్ దిశగా మనం వేస్తున్న తొలి అడుగులు.

డిజిటల్ గమ్యం దిశగా మన ప్రయాణం వేగవంతమవుతోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీపై ప్రధానంగా దృష్టి సారించిన భారత్ తన డిజిటల్ భవిష్యత్తును స్వయంగా రూపొందించుకుంటున్నది. దశాబ్దాలుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న భారత్, ఇప్పుడు హార్డ్‌వేర్ తయారీలో కూడా పెద్ద అంగలు వేస్తూ ముందుకు సాగుతోంది.

ప్రపంచ ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తూ ఐదు సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. నేడు భారతదేశం ప్రధాన ఎగుమతుల్లో తొలి మూడూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులే. అలాగే ఈ సంవత్సరం మరో అద్భుతం జరగబోతున్నది. మొట్టమొదటి 'మేక్ ఇన్ ఇండియా' చిప్‌ను మనం ఆవిష్కరించబోతున్నాం.

ఏఐ రూపకల్పన: కంప్యూట్, డేటా, ఆవిష్కరణలు : సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ దన్నుగా, భారతదేశపు సాంకేతిక విప్లవాన్ని డీపీఐ ముందుకు తీసుకువెళుతోంది. భారత్ తనదైన ఏఐ సాంకేతికత వ్యవస్థ ద్వారా దానిని ప్రజాస్వామ్యీకరిస్తూ అందరికీ అందుబాటులోకి తెస్తోంది.

ఈ విషయంలో 18,000లకు పైగా గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూలు) గల భారత కామన్ కంప్యూట్ సౌకర్యం కీలక మైలురాయిగా నిలుస్తుంది. గంటకు 100 రూపాయల కంటే తక్కువ ధరకు అందుబాటులో ఉండడం ద్వారా, పరిశోధకులు, అంకుర సంస్థలు, విద్యావేత్తలు, ఇతర సంబంధిత వ్యక్తులకు అత్యాధునిక పరిశోధనలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రాథమిక నమూనాలు, అనువర్తనాలు సహా ఏఐ-ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి జీపీయూలను సులభంగా వినియోగించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

వైవిధ్యమైన, అధిక-నాణ్యమైన డేటాతో ఏఐ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి భారత్ పెద్ద ఎత్తున వ్యక్తిగతేతర అనామక డేటాసెట్‌లను రూపొందిస్తోంది. పక్షపాతాన్ని తగ్గిస్తూ, ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది, అలాగే ఇది ఏఐ వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమగ్రంగా అందరికీ చేరుస్తుంది. ఈ డేటాసెట్‌లు వ్యవసాయం, వాతావరణ అంచనాలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి వివిధ రంగాల్లో ఏఐ-ఆధారిత పరిష్కారాలను రూపొందించేందుకు వీలు కల్పిస్తాయి.



ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సామాజిక వేడుకల్లో మొదటిది అయిన మహాకుంభ్ మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు భారత్ ఏఐ ఆధారిత పద్ధతులను సంపూర్ణంగా ఉపయోగించుకుంది. ఆ అధునాతన సాంకేతికత ఆధారిత నిర్వహణలో ప్రపంచస్థాయి ప్రమాణాలను మహాకుంభ్ నిర్దేశించింది.

భారత అవసరాలకు అనుగుణంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్‌లు), సమస్యకు సంబంధితమైన నిర్దిష్ట ఏఐ పరిష్కారాల వంటి సొంత ప్రాథమిక నమూనాల అభివృద్ధిని భారత ప్రభుత్వం అందిస్తుంది. ఏఐ పరిశోధనను ప్రోత్సహించడం కోసం అనేక ఎక్సలెన్స్ కేంద్రాలు కూడా ఏర్పాటయ్యాయి.

డిజిటల్ ఆవిష్కరణల కోసం భారత డీపీఐ ఒక బ్లూప్రింట్ : డీపీఐ కోసం భారత్ తొలిసారిగా చేసిన కృషి ప్రపంచ డిజిటల్ రంగాన్ని గణనీయంగా మార్చివేసింది. కార్పొరేట్ లేదా ప్రభుత్వ నియంత్రిత నమూనాల మాదిరిగా కాకుండా, భారత్‌లోని అద్భుతంగా చేపట్టిన ప్రభుత్వ-ప్రైవేట్ విధానం ద్వారా ఆధార్, యూపీఐ, డిజీలాకర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించడానికి ప్రభుత్వ నిధులను ఉపయోగిస్తున్నారు. ప్రైవేట్ రంగంలోని నిపుణులు డీపీఐ ఆధారంగా- వినియోగదారుల హితమైన, అప్లికేషన్ ఆధారిత పరిష్కారాలను రూపొందిస్తూ అద్భుతంగా ఆవిష్కరణలు చేస్తున్నారు.

యూపీఐ, డిజీలాకర్ వంటి ఆర్థిక, పాలనాపరమైన వేదికలను అద్భుతమైన పరిష్కారాలతో ఏకీకృతం చేస్తున్నారు. ఈ నమూనా ఇప్పుడు ఏఐ శక్తితో మరింత బలోపేతం అవుతున్నది. జీ20 సదస్సులో భారత డీపీఐ విధానం పట్ల ప్రపంచం అంతా ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ నమూనాను అనుసరించాలనే కోరికను వివిధ దేశాలు వ్యక్తం చేశాయి. భారత యూపీఐ చెల్లింపు వ్యవస్థకు జపాన్ పేటెంట్ మంజూరు చేసింది. దీనిని ఎంత వరకైనా విస్తరించడానికి అవకాశం ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం.

సంప్రదాయం, సాంకేతికతల సంగమంగా మహాకుంభ్: ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సామాజిక వేడుకల్లో మొదటిది అయిన మహాకుంభ్ సజావుగా, విజయవంతంగా నిర్వహించడం కోసం భారత్ తన డీపీఐ, ఏఐ ఆధారిత నిర్వహణా విధానాన్ని ఉపయోగించుకుంది. ప్రయాగ్‌రాజ్‌లోని రైల్వే స్టేషన్లలో జనసమూహానికి ఇబ్బందులు లేకుండా చేయడానికి ఏఐ -ఆధారిత సాధనాలు రైల్వే ప్రయాణీకుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాయి.

కుంభ్ సహాయక్ చాట్‌బాట్‌లో ఏకీకృతం చేసిన భాషిణి, అందరికీ వాయిస్-ఆధారంగా తప్పిపోయిన వారిని కనుగొనే అవకాశం లభించింది. రియల్-టైమ్ అనువాదం అలాగే బహుభాషా సహాయాన్ని అందించింది. భారతీయ రైల్వేలు, ఉత్తరప్రదేశ్ పోలీసులు సహా వివిధ విభాగాలు పరస్పర సహకారంతో సమస్యలకు త్వరిత పరిష్కారం కోసం కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించారు.

డీపీఐని ఉపయోగించడం ద్వారా, మహాకుంభ్ సాంకేతికత ఆధారిత నిర్వహణలో ప్రపంచస్థాయి ప్రమాణాలను నిర్దేశించింది, దీనిని మరింత సమ్మిళితంగా, సమర్థంగా, సురక్షితంగా చేసింది.

భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తిని రూపొందించడం : డిజిటల్ విప్లవానికి భారత శ్రామికశక్తి ప్రధాన కేంద్రంగా ఉంది. దేశంలో వారానికో కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటవుతూ, ప్రపంచ పరిశోధన, అభివృద్ధి, సాంకేతిక అభివృద్ధికి ప్రధాన గమ్యస్థానంగా భారత్ స్థితిని బలోపేతం చేస్తుంది. అయితే, ఈ వృద్ధిని కొనసాగించడానికి విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నిరంతర పెట్టుబడుల అవసరం ఎంతైనా ఉంది.

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ప్రకారం, ఏఐ, 5జీ, సెమీకండక్టర్ రూపకల్పన వంటి అంశాలను చేర్చుతూ విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వం ఈ సవాలును సమర్థంగా పరిష్కరిస్తోంది. పట్టభద్రులు ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో ఉద్యోగాలను ప్రారంభించేలా చేసి, విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని ఇది తగ్గిస్తోంది.

ఏఐ నియంత్రణ కోసం ఆచరణీయ విధానం : భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తిని రూపొందిస్తున్న భారత్ తన ఏఐ నియంత్రణ విధానంతో బాధ్యతాయుతంగా విస్తరించే ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. ఆవిష్కరణలను అణచివేసే 'హెవీ-హ్యాండెడ్' నియంత్రణ విధానం లేదా కొంతమంది చేతుల్లో అధికారాన్ని కేంద్రీకరించే 'మార్కెట్-ఆధారిత పాలన' వలె కాకుండా, భారత్ ఆచరణాత్మకమైన, సాంకేతిక-చట్టపరమైన విధానాన్ని అనుసరిస్తోంది.

ఏఐ సంబంధిత ఇబ్బందులను పరిష్కరించడానికి చట్టంపై మాత్రమే ఆధారపడకుండా, ప్రభుత్వం సాంకేతిక రక్షణ చర్యల్లోనూ పెట్టుబడులు పెడుతోంది. డీప్ ఫేక్స్, గోప్యతా సమస్యలు, సైబర్ భద్రతా ముప్పులను పరిష్కరించే సాధనాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, ఐఐటీల్లో ఏఐ-ఆధారిత ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తోంది.

ఏఐ ప్రపంచ పరిశ్రమల పునర్నిర్మాణాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఆవిష్కరణలను పెంపొందించే నియంత్రణ విధానాలను కొనసాగిస్తూనే సమ్మిళిత వృద్ధికి సాంకేతికతను ఉపయోగించుకోవాలనే స్పష్టమైన దార్శనికతతో భారత్ ముందుకు వెళ్తోంది. కానీ విధానాలు, మౌలిక సదుపాయాలకు అతీతంగా, ఈ పరివర్తన మన ప్రజల కోసమేననేది గమనించాల్సిన విషయం.

■ అశ్వినీ వైష్ణవ్
భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, రైల్వే, సమాచార ప్రసార శాఖల మంత్రి

ప్రజా సంక్షేమ బడ్జెట్ ఇది

ఏపీలో కూటమి ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి ప్రాధాన్యత ఇచ్చింది. సూపర్ సిక్స్ సహా మేనిఫెస్టోలో హామీల అమలుకు బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. రాష్ట్ర బడ్జెట్ తొలిసారి రూ.3 లక్షలు కోట్లు దాటింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాలకు ప్రాధాన్యతనిస్తూ కేటాయింపులు జరిపారు. అమరావతి, పోలవరంతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల సంక్షేమం కోసం నిధులు కేటాయించటం ద్వారా సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికీ ప్రభుత్వం భరోసానిచ్చింది. వీటితో పాటు పేదల గృహనిర్మాణానికి, రూ.25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు, చేనేత మగ్గాల కార్మికులకు, అలాగే నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయం. ఎంతో కసరత్తుతో రాష్ట్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ రూపొందించిన కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వసనీయత నిలబెట్టుకోవడంలో ముందడుగు వేసింది.

– అప్పన్న గొనప, విశాఖపట్నం

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచటం లేదని ప్రకటించారు. అది ఒక్కటే సరిపోదు. గతంలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరున అడ్డగోలుగా బస్సు, విద్యుత్ ఛార్జీల వంటివి భారీగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం తీవ్ర ఆందోళన చేసింది. అంతకు ముందు నెలకు 200 యూనిట్ల లోపు సాధారణ గృహ వినియోగదారులకు యూనిట్ ఒక్కటికి రెండు, మూడు రూపాయలు చొప్పున నెలకు నాలుగైదు వందల రూపాయల బిల్లులు వచ్చేవి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకానికి ట్రూఅప్ చార్జీలు, రకరకాల సెస్సుల పేర్లతో విద్యుత్ సంస్థలు నెలనెలా వేయి రూపాయలు సామాన్య గృహ వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేశాయి. ఇప్పటికీ ఆ అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయి. మరోవైపు నెలకు కనీస విద్యుత్ వాడకం 200 యూనిట్లుగా ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించి, ఎస్సీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. కానీ ఇతర వర్గాల సామాన్యులు వాడుకునే అదే 200 యూనిట్లలోపు బిల్లులు మాత్రం వేయి రూపాయలకు తగ్గకుండా వస్తున్నాయి. ఒకప్పుడు మన నేతలు సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో చార్జీలు తగ్గుతాయని భరోసా ఇచ్చారు. కానీ అవి తగ్గకపోగా, భారీగా పెరగడం దురదృష్టకరం. చార్జీల భారం తగ్గిస్తుందని ఆశించి ఓటర్లు తెలుగుదేశాన్ని గెలిపించారు. కనుక చార్జీలు పెంచకపోవడంతో పాటు, గత ప్రభుత్వం పెంచిన చార్జీలను తగ్గిస్తే మేలు.

– తిరుమలశెట్టి సాంబశివరావు
నరసరావుపేట

సమర్థ వాదనలతోనే రాష్ట్రానికి న్యాయం

బచావత్ ట్రిబ్యునల్ రక్షణ కల్పించి, ఆంధ్రప్రదేశ్‌లో వినియోగంలో ఉన్న నీటిని తమకు నేరుగా కేటాయించమని అడిగే వీలు లేనందున, బేసిన్ సమస్య ముందుకు తెచ్చి తెలంగాణ తొండి వాదన వినిపిస్తోంది. ఇది ఎంతవరకు వెళ్లిందంటే తెలంగాణలో పడే వర్షపు నీరు లెక్కించి, తమకు కేటాయించాలని వాళ్ల లాయర్ కోరారు. ఇది అమలు చేయాలంటే బేసిన్ మొత్తం మీద అమలు చేయాలి.



ఇంతవరకు రాజ్య విస్తరణ కాంక్షతో యుద్ధాలు జరిగితే, ఇక మీదట నీటి కోసం కూడా యుద్ధాలు జరగవచ్చని నిపుణులు కొందరు విశ్లేషించి ఉన్నారు. ఆయా రాష్ట్రాల్లో పెరుగుతున్న అవసరాలు, జనాభాకు అనుగుణంగా సాగు, తాగు నీటి లభ్యత క్రమేణా తగ్గిపోవడంతో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎన్నో ఎత్తుగడలతో తమ అవసరాలు తీర్చుకొనేందుకు సిద్ధమౌతున్నాయి. దీంతో ఇబ్బడిముబ్బడిగా అంతర్ రాష్ట్ర జల వివాదాలు తలెత్తుతున్నాయి.

ఈ నేపథ్యంలో సాధ్యమైనంత వరకు అంతర్ రాష్ట్ర జల వివాదాల నుంచి తప్పించుకొనేందుకు గతంలో ఇంజనీరింగ్ నిపుణులు ప్రాజెక్టుల రూపకల్పనలోనే కాకుండా వాటికి పేర్లు పెట్టడంలో కూడా ఎంతో జాగరూకత ప్రదర్శించేవారు. ఇప్పుడు ఇంజనీరింగ్ నిపుణుల స్థానంలో ప్రచారార్భాటాల కోసం 'రాజకీయ ఇంజనీర్లు' రంగప్రవేశం చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్టీఆర్ హయాంలో ప్రముఖ ఇంజనీర్ దివంగత డాక్టర్ శ్రీరామకృష్ణయ్య హంద్రీ నీవా పేరుతో ప్రాజెక్టుకు నామకరణం చేసినపుడు ఎగతాళి చేసిన వారున్నారు. ఈ పేరు ఎందుకు పెట్టారో అవగతం కాకుండా తల తోక లేదని అన్న వారూ ఉన్నారు. వాస్తవంలో ఈ ప్రాజెక్టు- రెండు అంతర్ రాష్ట్ర నదులు తుంగభద్ర పాలేరు నదుల అనుసంధానం. కర్ణాటకతో తుంగభద్ర, తమిళనాడుతో పాలేరు నది అంతర్ రాష్ట్ర అనుబంధముంది. ఈ రాష్ట్రాల నుంచి వివాదం తప్పించుకొనేందుకు తుంగభద్ర ఉప నది హంద్రీ, పాలేరు ఉప నది నీవా (ఉమ్మడి చిత్తూరు జిల్లా) రెండు పేర్లు ఈ పథకానికి డాక్టర్ శ్రీరామకృష్ణయ్య పెట్టారు.

ఇదంతా ఎందుకంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వం తెర మీదకు తెచ్చిన గోదావరి వయా కృష్ణా బనకచర్ల (ఒక విధంగా పెన్నా) అనుసంధానం అంతర్ రాష్ట్ర జల వివాదంలో చిక్కుకున్నది. ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ఢిల్లీలో విచారణ జరిపిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ఈ అంశమే ప్రధాన ఆయుధంగా మలుచుకొన్నది. గోదావరి నుంచి తరలించే నీళ్లు ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా ఆయకట్టుకు ఉపయోగపడుతున్నాయని ఆ మేరకు మిగిలే నీళ్లు తమకు కేటాయించాలని ట్రిబ్యునల్ ముందు తెలంగాణ లాయర్ వైద్యనాథన్ వాదించారు. ఈ పథకం ద్వారా బొల్లేపల్లి జలాశయంలో 150 టీయంసీలు, అంతిమంగా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు 200 టీయంసీలు చేరుతాయని, కృష్ణా జలాలు లేకున్నా ఆంధ్రప్రదేశ్‌కు ఇబ్బంది లేదన్నారు. అంతేకాదు. పుష్కలంగా నీటి వసతి ఒకటి రెండు వైపుల నుంచి ఉన్న ప్రాంతానికే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను కోరుతున్నదని, తెలంగాణలో ఒక పంటకు కూడా సాగునీరు లేదని చాలా దీనాతిదీనంగా తెలంగాణ లాయర్ ట్రిబ్యునల్‌ను కోరుతూ మొత్తం 811 టీయంసీల్లో తెలంగాణకు 71 శాతం నీళ్లు కేటాయించాలని అన్నారు. ఈ ప్రమాదం నుంచి తప్పించుకొనేందుకే అనుభవజ్ఞులైన నవ్యాంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ తరపున విశ్వేశ్వరరావు గోదావరి-బనకచర్ల పథకంలో కృష్ణా జలాలు, తుదకు నది ప్రస్తావన తీసుకురావద్దని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి సరైన స్పందన కన్పించలేదు. కనీసం అఖిలపక్షం సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలు తీసుకొని ఉంటే ఇంకా బాగుండేది. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ సమస్య కాదు, రాష్ట్ర ప్రజలందరికీ చెందినది.

అయినా ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు సహజ న్యాయసూత్రాలు, క్షేత్రస్థాయి పరిస్థితి అనుకూలంగా ఉంది. పైగా రాష్ట్ర విభజన చట్టమొకటి ఆపద్బంధువుగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రతి అంశం విభజన చట్టం మేరకు పరిష్కరిస్తూ, కొత్త ట్రిబ్యునల్ నియామకం చట్టంలో లేకున్నా కేంద్ర ప్రభుత్వం పరిధి దాటింది. తిరిగి పార్లమెంటులో విభజన చట్టం సవరణ చేస్తే తప్ప ట్రిబ్యునల్ నియామకం చెల్లుబాటు కాదనేది నిపుణుల అభిప్రాయం. గతంలో తను కేటాయించి వినియోగంలో ఉన్న నీటికి బచావత్ ట్రిబ్యునల్ రక్షణ కల్పించి ఉండటం, ట్రిబ్యునల్-2గా గతంలో వ్యవహరించిన ఇదే బ్రిజేశ్ కుమార్, బచావత్ ట్రిబ్యునల్ తీర్పు సాంప్రదాయాన్ని గౌరవించడం అనుకూలాంశాలుగా ఉన్నాయి.

తెలంగాణ మొన్నటి విచారణలో ప్రముఖంగా ప్రస్తావించిన, ప్రస్తుతం కాగితాలకే పరిమితమై ఉన్న గోదావరి బనకచర్ల అనుసంధానం ప్రయోజనాలు ఎలాంటివంటే వెనుకటికొక వెర్రిబాగులమ్మ మబ్బులను చూచి కుండలో నీళ్లు వొలక బోసుకోవడంతో సమానమే. ఇవన్నీ కూడా తిరిగి మార్చి 24 నుంచి 26 వరకు విచారణ జరుపనున్న ట్రిబ్యునల్ ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రంగా, సమర్థవంతంగా చేసే న్యాయపోరాటాన్ని బట్టి ట్రిబ్యునల్ తీర్పు ఉండబోతోంది.

2014లో ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే చంద్రబాబు నాయుడు ప్రతిపక్షాలకు సవాలు విసిరి పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మించారు. అప్పటి పరిస్థితులు వేరు. పట్టిసీమతో కృష్ణకు వరద ఆలస్యంగా వచ్చినా గోదావరి జలాలు జూన్ తొలి వారంలోనే డెల్టాకు ఇస్తున్నామని, మిగిలిన నీళ్లతో రాయలసీమ భూములు తడుపుతున్నామని గతంలో ఆయన చేసిన ప్రకటనలు ఇప్పుడు కూడా కొనసాగిస్తే, అవి ఆంధ్రప్రదేశ్‌కు ఇబ్బంది కలిగిస్తాయి. జగన్మోహన్‌రెడ్డితో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రానికి చేసిన అపకారం- ట్రిబ్యునల్ నియామకం- మెడ మీద కత్తిలా వేలాడుతోంది.

తను కేటాయించి వినియోగంలో ఉన్న ఏ రాష్ట్రం నీటికైనా బచావత్ ట్రిబ్యునల్ రక్షణ కల్పించి ఉన్నందున... ఆంధ్రప్రదేశ్‌లో వినియోగంలో ఉన్న నీటిని తమకు నేరుగా కేటాయించమని అడిగే వీలు లేనందున, బేసిన్ సమస్య ముందుకు తెచ్చి తెలంగాణ తొండి వాదన వినిపిస్తోంది. ఇది ఎంతవరకు వెళ్లిందంటే తెలంగాణలో పడే వర్షపు నీరు లెక్కించి తమకు కేటాయించాలని వాళ్ల లాయర్ కోరారు. ఇది అమలు చేయాలంటే బేసిన్ మొత్తం మీద అమలు చేయాలి. విభజన చట్టం సెక్షన్ 89 మేరకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2015లో విచారణ మొదలు పెట్టినప్పుడే తెలంగాణ బేసిన్ సమస్య తెర మీదకు తెచ్చింది. కేసీ కెనాల్, తుంగభద్ర ఎగువ కాలువ కేటాయింపులకు కోత పెట్టి ఆ నీటిని తమకు కేటాయించాలని నిత్య క్షామపీడిత ప్రాంతమైన రాయలసీమ రైతుల కడుపు కొట్టేందుకు సిద్ధమైంది. ఇప్పుడు గోదావరి నీళ్లు సాగర్ కుడి కాలువ డెల్టాకు వస్తాయి కాబట్టి, ఆ వాటాలో కోత పెట్టేందుకు సిద్ధమైంది.

ఇందుకోసం తెలంగాణ అనుసరించిన ఉదాహరణలు కూడా దారుణంగా ఉన్నాయి. కావేరి ట్రిబ్యునల్ తీర్పు, దాన్ని సుప్రీంకోర్టు బలపర్చడాన్ని తెలంగాణ లాయర్ ఉల్లేఖించారు. దీర్ఘకాలిక పంటల స్థానంలో స్వల్పకాలిక పంటలు వేసి నీటిని ఆదా చేసి మిగిలే నీటిని తెలంగాణకు కేటాయించాలని కూడా కోరారు. బాగానే వుంది. కావేరి ట్రిబ్యునల్ బేసిన్ మొత్తం మీద ఈ సూచన చేసింది. ఇప్పుడు కూడా కృష్ణ బేసిన్ మొత్తం మీద అన్ని రాష్ట్రాల్లో ఈ విధానం అమలు జరిపితే ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఆ మాట కొస్తే తెలంగాణకు ఏదైనా అన్యాయం జరిగి ఉంటే బేసిన్ మొత్తం మీద నీటి పంపకాలు జరిగినపుడు తప్ప, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంలో కాదు కదా! గత ఏడాది ఒక అంశం మీద సుప్రీంకోర్టులో విచారణ సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం ధర్మాసనం తెలంగాణకు ఏదైనా అన్యాయం జరిగివుంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తప్ప, ఇప్పుడు కాదు కదా? అని ప్రశ్నించడమే కాకుండా, విభజన తర్వాత తెలంగాణ విస్తీర్ణం పెరగలేదని కూడా తెలంగాణ లాయర్ వైద్యనాథన్‌ను నిలదీసింది. ఇన్ని అనుకూల అంశాలు ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నా తెలంగాణ మొండిగా న్యాయపోరాటం సాగిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెలలో జరిగే ట్రిబ్యునల్ విచారణ సమయంలో సమర్థవంతంగా వ్యవహరించి, అందుకు అనుగుణంగా విధానాలు రూపొందించుకొని గతంలో బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు కాపాడుకోవాలి.

◆ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు




తమకు తెలియకుండానే తమ ఖాతాల్లో జరిగిన లావాదేవీలను చూపిస్తున్న బాధితులు

ఎరవేసి..

ఈ-రికించారు

- సైబర్ క్రైమ్ ఉచ్చులో పారిశుధ్య కార్మికులు
- ఉచితంగా బ్యాంక్ ఖాతాలంటూ ఎర
- ఖాతా తెరిస్తే రూ.1,500 జమ చేస్తారంటూ మోసం
- నమ్మి ఖాతాలు తెరిచిన పేద కార్మికులు
- వారికి తెలియకుండా ఖాతాల్లో రూ.16 లక్షల జమ.. విత్‌డ్రా
- కార్మికులపై మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో కేసుల నమోదు
- పోలీసుల నోటీసులతో హడలిపోతున్న వైనం

తమకు న్యాయం చేయాలని వేడుకోలు



సరిగ్గా సెల్‌ఫోన్ వాడటం కూడా వారికి రాదు. అవతలివారు ఫోన్ నెంబర్ చెబితే ఫోన్‌లో పేరు ఫీడ్ చేసుకోవడం కూడా తెలియదు. ఎన్నడూ కంప్యూటర్‌ను తాకింది లేదు. ఏటీఎం కార్డు వాడిందీ లేదు. నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులుగా పనిచేయగా వచ్చే రూ.18 వేల జీతం తప్ప వారి ఖాతాలో అదనంగా ఒక్క రూపాయి కూడా ఉండదు. అలాంటి వారు అత్యంత అధునిక టెక్నాలజీని ఉపయోగించి చేసే సైబర్ క్రైమ్ కేసులో చిక్కుకున్నారు. సైబర్ నేరాలకు పాల్పడినట్టుగా మహారాష్ట్రలోని జలగావ్‌లో కేసులు నమోదయ్యాయి. ఒకటి రెండు కాదు.. ఏకంగా రూ.16 లక్షలు సైబర్ క్రైమ్ ద్వారా వీరి ఖాతాల్లోకి వచ్చి చేరడం, ఆ డబ్బు వీరికి తెలియకుండానే విత్‌డ్రా అయిపోవడం, మహారాష్ట్ర పోలీసులు వీరికి నోటీసులు పంపించడం, అక్కడి స్టేషన్‌కు విలవిల్లాడిపోతున్నారు. నోట్లో అక్షరం ముక్క లేని తాము అన్యాయంగా రాష్ట్రం కానీ రాష్ట్రంలో సైబర్ క్రైమ్ కేసులో ఇరుక్కున్నామని కన్నీటిపర్యంతమవుతున్నారు.

పాయకాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్‌నగర్‌లోని వడ్డెర కాలనీకి చెందిన పీట్ల దుర్గాభవాని, వేముల సుశీల నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వెహికల్ డిపోలో శానిటరీ మేస్త్రులుగా పనిచేస్తున్న కర్నాటి డానియేల్, రాములు.. ఆ మహిళా కార్మికులిద్దరికీ ఉచితంగా బ్యాంక్ ఖాతాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఉచిత ఖాతాలు తెరిచిన వారికి రూ.1,500 ఇస్తారని నమ్మించి వన్‌టౌన్‌లోని డీబీఎస్ బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఖాతాలతో పాటు రూ.1,500 ఇస్తుండటంతో దుర్గాభవాని తన భర్త వెంకటేశ్వరరావుతో కూడా మరో ఖాతా తెరిపించింది. బ్యాంక్ ఖాతాలతో పాటు ఏటీఎం కార్డు, చెక్‌బుక్, పాస్‌బుక్ కోసం దరఖాస్తు చేయించారు. అనంతరం వారం తర్వాత ఖాతాలు క్లోజ్ చేయాలని చెప్పి ముగ్గురి దగ్గర ఏటీఎం కార్డు, చెక్‌బుక్, పాస్‌బుక్, సెల్‌ఫోన్ తీసుకెళ్లారు. కట్‌చేస్తే.. 14 నెలల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు పారిశుధ్య కార్మికులతో పాటు వెంకటేశ్వరరావు సైబర్ క్రైమ్‌కు పాల్పడినట్టుగా మహారాష్ట్రలోని జలగావ్ సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు పంపించారు.

హడలిపోతున్న కార్మికులు

జలగావ్ నుంచి పోలీసు నోటీసులు రావడంతో వాటి సారాంశం తెలుసుకునేందుకు బాధితులు తెలిసిన వారిని సంప్రదించారు. సైబర్ క్రైమ్ అని తెలుసుకుని హడలిపోయారు. తాము సైబర్ నేరాలకు పాల్పడటం ఏమిటని బెంబేలెత్తిపోయారు. రూ.16 లక్షలు తమ ఖాతాలకు జమకావడం, విత్‌డ్రా కావడం ఏమిటని తెలుసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లగా, గుండెలు అదిరిపోయే విషయం తెలిసింది. వివిధ సమయాల్లో ముగ్గురు ఖాతాల నుంచి రూ.16 లక్షలు జమకావడం, విత్‌డ్రాలు కావడం తెలుసుకుని నివ్వెరబోయారు.

● ఇప్పటివరకు రూ.లక్ష ఖర్చు

మేస్త్రి చేసిన మోసానికి తాము ఇప్పటివరకు రూ.లక్ష వరకు ఖర్చుపెట్టామని బాధితులు బోరుమంటున్నారు. తమకు ఏ పాపం తెలియదని ఉచిత బ్యాంక్ ఖాతాలతో పాటు రూ.1,500 ఇస్తామంటే వెళ్లామని, తమను మేస్త్రి నిలువునా ముంచేశాడని కన్నీరుమున్నీరవుతున్నారు. పనులకు వెళ్లి చాలీచాలని జీతంతో ఇంటిని గడుపుతున్న తాము ఇంత ఖర్చు భరించలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. మహారాష్ట్ర పోలీసులు తమపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని చెబుతున్నారు. భాష రాక తాము అక్కడ నరకం అనుభవించామని వాపోయారు. ఏటీఎం కార్డు, సెల్‌ఫోన్ తీసుకెళ్లిన మేస్త్రి డానియేల్, రాము.. తమను మోసగించి తమ ఖాతాలను సైబర్ క్రైమ్ నేరస్తులకు ఇచ్చి లావాదేవీలు నడిపారని, అన్యాయంగా తమను కేసులో ఇరికించారని, కేసు నుంచి తమను బయటపడేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

● ఫిర్యాదు తీసుకోని పోలీసులు

తమ ఖాతాలను సైబర్ క్రైమ్ నేరస్తులకు అప్పగించి నిలువునా ముంచిన మేస్త్రి డానియేల్, రాముపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు మన పోలీసులు ఫిర్యాదు తీసుకోక, అటు మహారాష్ట్ర పోలీసులు తమపై కేసులు నమోదు చేయడంతో అల్లాడిపోతున్నామంటున్నారు.

తిరువూరు వైసీపీలో ముసలం

మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు పావులు

- రాజీనామా ఒప్పందం విస్మరించారని వాదన
- అధిష్ఠానం ఆదేశించే వరకు కుదరదన్న చైర్‌పర్సన్
- టీడీపీ మద్దతు కోరుతున్న వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు
- వైస్ చైర్‌పర్సన్ ఇస్తామంటూ మంతనాలు
- తమ పార్టీలో చేరాలని టీడీపీ కౌన్సిలర్ల షరతు
- రసవత్తరంగా మారిన తిరువూరు రాజకీయం



తిరువూరు మున్సిపాలిటీలోని అధికారపక్ష వైసీపీలో ముసలం రేగింది. ఆ పార్టీ వైసీపీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. అంతర్గత పోరు కాస్తా ఇప్పుడు భగ్గుమంది. చైర్‌పర్సన్‌ను గద్దె దించేందుకు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ సభ్యుల మద్దతు కోరుతుండగా, తమ పార్టీ కండువా కప్పుకొంటేనే మద్దతునిస్తామని టీడీపీ కౌన్సిలర్లు చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, తిరువూరు) : తిరువూరు మున్సిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్ల మధ్య అంతర్గత పోరు రోజురోజుకూ ముదురుతోంది. కొందరు వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. అసమ్మతి కౌన్సిలర్లు కొందరు మంగళవారం.. ఇతర కౌన్సిలర్లను కలిసి మద్దతు కోరినట్లు సమాచారం. వారం రోజులుగా అసమ్మతి వర్గం సమాలోచనలు చేయడంతో పాటు అవిశ్వాసం పెట్టేందుకు బలం కోసం టీడీపీ సభ్యుల మద్దతు కూడా కోరడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లలో ఒకరికి వైస్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చేలా వైసీపీ ప్రతిపాదన చేయగా, టీడీపీ కండువా కప్పుకొంటే ఓకే అని.. టీడీపీ కౌన్సిలర్లు షరతు విధించారు.

వివాదం ఇలా..


తిరువూరు మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులకు గాను వైసీపీ 17, టీడీపీ 3 స్థానాలు కలిగి ఉన్నాయి. చైర్మన్‌గా మోదుగు ప్రసాద్ పేరును అప్పటి ఎమ్మెల్యే రక్షణనిధి ప్రతిపాదించగా, వైసీపీ అధిష్ఠానం ఆశీసులతో గత్తం కస్తూరిబాయి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల తర్వాత చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని, అప్పటి ఎమ్మెల్యే సూచించిన వారు బాధ్యతలు చేపట్టాలని అప్పట్లో అధిష్ఠానం నిర్ణయించింది. రెండేళ్ల గడుపు పూర్తయినా చైర్‌పర్సన్ రాజీనామా చేయకపోవడం, రాష్ట్ర పార్టీ ఆదేశిస్తేనే తప్పుకొంటానని ఆమె అనడంతో మిగతా 6లో..

జటిలం!



- మండలాలకు పొంచి ఉన్న నీటి ఎద్దడి ముప్పు
- ఇప్పటికే గొంతెండుతోన్న గ్రామాలు
- ఆర్‌డబ్ల్యూఎస్‌లో అధికారుల కొరత
- ఎస్ఈ లేకుండానే జిల్లాలో పాలన
- క్షేత్రస్థాయిలో పనులు సాగక ఇన్‌చార్జుల ఇబ్బందులు
- ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు సీఈ పోస్టులు ఖాళీ

6లో



ప్రకృతి కాన్వాస్‌పై కళాకారుడు తీర్చిదిద్దిన మనోహరమైన ముగ్గులా ఉంది కదూ ఈ చిత్రం. బుధవారం సాయంసంధ్యవేళ సూర్యుడు అస్తమిస్తుండగా నగరంలో ఆవిష్కృతమైన అందమైన ప్రకృతి రూపమిది.

ఆ ఆత్మహత్య వెనుక..

జలవనరుల శాఖ నదీ పరిరక్షణ విభాగంలో కయ్యాలు

- 'పై అధికారులు, కొంతమంది కలిసి నన్ను దారుణంగా వేధిస్తున్నారు. అందుకే చనిపోవాలనుకున్నాను.' జలవనరుల శాఖలోని నదీ పరిరక్షణ (రివర్ కన్జర్వేషన్) విభాగంలోని గుమస్తా కె.వినోద్ ఉద్యోగుల వద్ద వ్యక్తం చేసిన ఆవేదన ఇది. అనుకున్నట్టుగానే ఆ విభాగ జేఈ శ్రీరామ జనార్దన్, విజయవాడ సెక్షన్‌లోని వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుజాత పేర్లు ఒక లేఖలో రాసి పురుగు మందు తాగి చనిపోయాడు. ఈ లేఖలో అధికారులతో పాటు తన అత్త కనకదుర్గ పేరు కూడా రాశాడు.
- వినోద్ సరిగ్గా విధులకు హాజరుకాడు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరవుతుంటాడు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మారలేదు. అయినప్పటికీ మానవతా దృక్పథంతో వ్యవహరించాం. నదీ పరిరక్షణ విభాగం జేఈ జనార్దన్ వాదన ఇది.

వినోద్ ఆత్మహత్య వెనుక అనేక కారణాలు కనిపిస్తుండగా, అధికారుల వాదన మాత్రం వేరేలా ఉంది. దీంతో అసలు విషయాలు విచారణలో బయటపడే అవకాశాలున్నాయి.

- ఉద్యోగి ఆత్మహత్యతో బయటపడ్డ వర్గ విభేదాలు
- చనిపోతానని ముందే అధికారులకు వినోద్ సందేశాలు
- పై అధికారులు వేధిస్తున్నారని సూసైడ్ లెటర్
- విధుల్లో అలసత్వంపై నిలదీసినందుకే.. : అధికారుల వాదన



వినోద్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు నుంచి ఘంటసాల మండలం పాపవినాశనం వరకు ఉన్న సెక్షన్‌లో పనిచేసే కె.వినోద్ ఆత్మహత్యలో నదీ పరిరక్షణ విభాగంలో నడుస్తున్న గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. కొద్దిరోజుల నుంచి జలవనరుల శాఖలో పనిచేసే కొంతమంది ఉద్యోగుల వద్ద వినోద్ తన ఆవేదనను వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో ఉన్న అధికారి, మిగిలిన ఇద్దరు ఉద్యోగులు ఏవిధంగా ఇబ్బంది పెడుతున్నారో చెప్పుకొని కన్నీమున్నీరైనట్టు ఉద్యోగులు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం వచ్చిన బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించడం, రుణానికి చేసుకున్న దరఖాస్తును తొక్కిపెట్టడం వంటి అంశాలను సన్నిహితుల వద్ద ప్రస్తావించాడు. తనకు ఈ విషయంలో న్యాయం చేయాలని ప్రాధేయపడినట్టు తెలుస్తోంది. అధికారులు వాదన మాత్రం భిన్నంగా ఉంది.


ఎవరూ వేధించలేదు

వినోద్ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదించగా, వారు మరో వాదనను వినిపిస్తున్నారు. డిసెంబరులో వినోద్ 20 రోజులపాటు ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యాడని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు లేఖ రాసినప్పటికీ మానవతా దృక్పథంతో మెడికల్ లీవ్‌గా పరిగణించామని తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 25వ తేదీ వరకు ఈవిధంగానే గైర్హాజరయ్యాడని వివరించారు. వినోద్ కొద్దిరోజుల క్రితం ఉద్యోగుల సహకార పరపతి సంఘం నుంచి రుణానికి దరఖాస్తు చేసుకున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. దీనిపై ఆయన సంతకం చేయకుండా కార్యాలయంలో ఇచ్చాడని, సంతకం ఉంటేనే తాను సంతకం చేసి పైఅధికారులకు పంపే అవకాశం ఉంటుందని జేఈ జనార్దన్ పేర్కొన్నారు. తాను ఫోన్ చేసి సంతకం చేయడానికి పిలిచినప్పటికీ వినోద్ రాలేదని చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం పురుగు మందు డబ్బాను మిగతా 6లో..

కొండవాగులో కబ్జాకోరులు

నున్నలో రూ.3 కోట్ల విలువైన స్థలం హాంఫట్

- వైసీపీ వార్డు సభ్యుడి భూమాయ
- వైసీపీ హయాంలోనే దర్జాగా కబ్జా
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- వెంచర్లు వేసి, ఇళ్లు నిర్మించి యథేచ్ఛగా అమ్మకాలు



నున్నలో కొండవాగు పోరంబోకు స్థలంలో నిర్మాణాలు

(ఆంధ్రజ్యోతి, గుణదల/విజయవాడ రూరల్) : విజయవాడ రూరల్ మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ భూమి.. అసైన్డ్ భూమి.. వాగు పోరంబోకు భూమి.. ఇలా ఏదైతే మాకేంటి అన్నట్టుగా నున్నలో ఓ వైసీపీ నాయకుడు దర్జాగా కబ్జా చేశాడు. రూ.3 కోట్ల విలువచేసే కొండవాగు పోరంబోకుగా ఉన్న ఎకరం పైచిలుకు భూమిపైనా గద్దలా వాలిపోయాడు.

వైసీపీ వార్డు సభ్యుడి నిర్వాకమే..

వైసీపీ హయాంలో నున్న పంచాయతీలో ఓ వార్డు సభ్యుడు చక్రం తిప్పాడు. తాను ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరించాడు. ఆయన భార్య సర్పంచ్‌గా ఉన్నారు. దీంతో అధికారులు ఆయన చెప్పిన దానికి ఎదురుచెప్పలేకపోయారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం నున్న పంచాయతీ పరిధిలోని 151-2 సర్వే నెంబరులో పంట సాగుకు పనికిరాని ఎకరం రెండు సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అందులో సర్పంచ్ భర్త వెంచర్ వేసి, 15 నుంచి 20 ప్లాట్ల వరకు వేశాడు. ఈ ప్లాట్లకు రోడ్లు వేయడానికి విద్యుత్ శాఖ అధికారులతో కుమ్మక్కయ్యాడు. కరెంటు స్తంభాలతో పాటు ఇంటి పన్నులు కూడా వేయించేశాడు. దీనిపై గత ఏడాది ఆగస్టులో స్థానికులు విజయవాడ రూరల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విద్యుత్ శాఖ అధికారులు మొదలు.. పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఈ వ్యవహారంలో ఎంతో కొంత డబ్బులు ముట్టడం వల్లే.. సదరు వైసీపీ నాయకుడికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఐదేళ్ల లీజు ప్రతిపాదన తిరస్కరణ

- దుర్గగుడిలో అగరబత్తి, దూప్ స్టిక్స్ విక్రయ లైసెన్స్‌పై నిర్ణయం
- మరో మూడు నెలల్లో ముగియనున్న లీజు గడువు
- గత వైసీపీ హయాంలో తక్కువ అద్దెకు షాపు కేటాయింపు
- ఆ తర్వాత నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల లీజుకు ప్రతిపాదనలు
- ఈ వ్యవహారంలో చక్రం తిప్పిన ఎన్ఎంఆర్ ఉద్యోగి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి, ఇతర ఉపాలయాల్లో స్వామివార్లకు ఉపయోగించిన పూల నుంచి అగరబత్తిలు, దూప్ స్టిక్స్ తయారు చేసి విక్రయించేందుకు వీలుగా రాజమండ్రికి చెందిన ఓ సంస్థకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్లకు లీజుకు ఇచ్చారు. సదరు సంస్థ దేవస్థానంలోనే విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ లీజు గడువు ముగియక ముందే మిగతా 6లో..

గత వైసీపీ ప్రభుత్వంలో తక్కువ ధరకే దుర్గగుడిపై అగరబత్తిలు, దూప్ స్టిక్స్ విక్రయ లైసెన్సు పొందిన సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల లీజు పొడిగింపునకు దరఖాస్తు చేసుకుంది. గత ఈవో రామారావు హయాంలో ఎన్ఎంఆర్ ఉద్యోగి చక్రం తిప్పి సదరు ప్రతిపాదనల ఫైల్‌ను దేవదాయ శాఖకు చేర్చారు. దేవస్థానం లీజుల విభాగంపై దృష్టి సారించిన ప్రస్తుత ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తాజాగా ఈ ఫైల్‌ను తిరస్కరించడం దుర్గగుడిలో చర్చనీయాంశంగా మారింది.



అసెంబ్లీ వేదికగా

అసెంబ్లీ వేదికగా నియోజకవర్గ సమస్యలపై బుధవారం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ఎమ్మెల్యేలు గళం విప్పారు. ప్రజల పక్షాన పలు సమస్యలను స్పీకర్ ఎదుట ఏకరువు పెట్టారు.

అమరావతి రాజధానికి కట్టుబడి ఉన్నాం..

» మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మూడు రాజధానులు కాదని, అమరావతి రాజధాని నినాదంతో ముందుకు వెళ్లిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శాసనమండలి సమావేశంలో బుధవారం మంత్రి రవీంద్ర వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్ర బాబు అమరావతి రాజధానికి నిధులు కేటాయింపుపై లేవనెత్తిన అంశంపై మంత్రి కౌంటర్ ఇచ్చారు. కేంద్రప్రభుత్వం అమరావతి రాజధానికి పెద్దఎత్తున నిధులు అందిస్తోందన్నారు. మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నినాదానికి రాష్ట్ర ప్రజలు దిమ్మతిరిగేలా కూటమికి మంచి మెజారిటీ ఇచ్చి గెలిపించారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : తాతయ్య



జగ్గయ్యపేట : నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలి. జగ్గయ్యపేటలో ఏకైక ఎయిడెడ్ కళాశాల 'ఎస్జీఎస్' గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రైవేటుకళాశాలగా మారిపోయింది. ప్రభుత్వ నిధులతో పలు భవనాలు, ఆడిటోరియం నిర్మించారు.. పాలకవర్గం అంగీకరిస్తే తిరిగి అక్కడే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించాలి, లేనిపక్షంలో ప్రభుత్వ స్థలాల్లో కొత్త కళాశాల ఏర్పాటు చేయాలి. లేకుంటే పేద, మధ్యతరగతి వర్గాలు ఉన్నతవిద్యకు దూరమవుతారు.

వాటా ప్రకారమే సాగర్ జలాలు విడుదల చేయాలి : వసంత



జి.కొండూరు : ఎన్ఎస్పీ ఎడమ కాల్వ కింద మూడోజోన్‌లో ఉన్న పంటలకు వాటా ప్రకారం సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి. మూడోజోన్‌లో మైలవరం, తిరువూరు, నూజివీడు తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఇందుకుగాను హక్కుగా 32 టీఎంసీ జలాలు కేటాయించారు. ఈఏడాది ఇప్పటి వరకు పలు సందర్భాల్లో 18 టీఎంసీలు మాత్రమే నీరు విడుదల చేసినా.. ఇంకా 13 టీఎంసీల సాగునీరు విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుత వ్యవసాయ సీజన్ ముగుస్తున్న తరుణంలో ఆరుతడి పంటలకు సాగునీరు అత్యవసరం. ఈవిషయాన్ని ఇప్పటికే మంత్రి, ఈఎన్‌సీని కలిసి విజ్ఞప్తి చేశా.

అడవి ఆవుల నుంచి రక్షణ కల్పించాలి : సౌమ్య



నందిగామ : అడవి ఆవుల వల్ల నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలి. చందర్లపాడు మండలంలోని కృష్ణాపరివాహక గ్రామాలలో పెద్ద సంఖ్యలో అడవి ఆవులు ఉన్నాయి. రాత్రి వేళ ఆవులు పంట పొలాను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటి నుంచి పంటల రక్షణకు ఫెన్సింగ్ వేయాల్సి ఉంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి.

గన్నవరంలో అక్రమ మైనింగ్ విచారణలో పురోగతి చెప్పండి : యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ మైనింగ్‌పై విచారణ పురోగతి తెలియజేయాలి. ఇసుక పాలసీ తరహాలో గ్రావెల్‌కు కూడా నూతన పాలసీ తీసుకురావాలి. డీఎంఎఫ్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడుతుంది. గన్నవరం విమానాశ్రయం నుంచి హనుమాన్ జంక్షన్ వైపు 45వేల చదరపు మీటర్లు గ్రీనరీ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కలం గ్రామాల్లో ఏలూరు కాలువపై వంతెనల నిర్మాణం చేయాలి. 479 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరణ చేయాల్సిన అవసరం ఉంది. 183 మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

టూరిజం, కల్చర్‌కు నిధుల కేటాయింపు హర్షణీయం : వర్ల



పామర్రు : టూరిజం అండ్ ఆర్ట్‌కు రూ.269 కోట్లు కేటాయించటం హర్షనీయం. నియోజకవర్గంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న కూచిపూడిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వంటి మహనీయులు జన్మించింది ఇక్కడే.. కూచిపూడి సంస్కృతితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించటం హర్షణీయం.

కాలువ పనులు నీటి సంఘాలకు అప్పగించండి : వెనిగండ్ల



గుడివాడ : నియోజకవర్గంలో కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నీటి సంఘాలకు అప్పగించాలి. 2019-24 నీటి సంఘాలను రద్దు చేయడంతో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యమై విధ్వంసం జరిగింది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 60వేల మంది రైతులు భాగస్వామ్యంతో తిరిగి నీటి సంఘాలకు పునరుద్ధరించినట్టు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రూ.10లక్షల వరకు పనులను నామినేటెడ్ పద్ధతిలో స్థానిక నీటి సంఘాలకు అప్పగించేలా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్టు తెలిపారు.

పోర్టు అనుసంధాన రోడ్లకు ప్రతిపాదనలు

» మోర్త్, నేషనల్ హైవే అధికారులతో ఎంపీ బాలశౌరి భేటీ

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టుకు అవసరమైన అనుబంధ రోడ్ల అభివృద్ధికి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మోర్త్ అండ్ నేషనల్ హైవే అధికారులతో బుధవారం ఎంపీ బాలశౌరి సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఇటీవల ఢిల్లీలో కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి పోర్టు అనుసంధానించ వలసిన రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోరగా, మంత్రి వెంటనే నివేదికలు సమర్పించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రధానంగా పోర్టు నుంచి బందరులోని మాచవరం రైస్‌మిల్ సెంటర్ వరకు 3.7 కి.మీ వరకు 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి, మాచవరం రైస్‌మిల్ సెంటర్ నుంచి నేషనల్ హైవే 65 వద్ద వున్న అండర్‌పాస్ వరకు 4 కి.మీ వరకు ప్రస్తుతం వున్న 2 వరుసల రహదారిని 4 వరుసల రహదారిగా అభివృద్ధి పరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు. ఈ విషయమై మోర్త్ అధికారులు డీపీఆర్ తయారుచేయడం జరిగిందని, మొత్తం 12.6 కి.మీకి రూ.583 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతుందని, ఇందులో ఒకచోట రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఒకచోట ఫ్లైఓవర్, ఒకచోట వెహికల్ ఓవర్‌పాస్, ఆరుచోట్ల వెహికల్ అండర్‌పాస్‌లు, నిర్మించడం జరుగుతుందని ఎంపీకి తెలియజేశారు.

జటిలం!

» మండలాలకు పొంచి ఉన్న నీటి ఎద్దడి ముప్పు
» ఇప్పటికే గొంతెండుతోన్న గ్రామాలు
» ఆర్‌డబ్ల్యూఎస్‌లో అధికారుల కొరత!
» ఎస్ఈ లేకుండానే ఎన్టీఆర్ జిల్లాలో పాలన
» కృష్ణాజిల్లాలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పోస్టు ఖాళీ
» ఉమ్మడి జిల్లాలో సగం మండలాలకు ఏఈఈలు లేరు
» క్షేత్రస్థాయిలో పనులు సాగక ఇన్‌చార్జిల ఇబ్బందులు
» ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు సీఈ పోస్టులు ఖాళీ
» డిప్యూటీ సీఎం చెప్పినా ఖాళీలు భర్తీ చేయని పరిస్థితి



మండేకాలం వచ్చేసింది. ప్రారంభంలోనే భానుడు భగ భగలాడుతున్నాడు. ఇప్పటికే పలుచోట్ల ప్రజల గొంతెండిపోతోంది! అక్కడక్కడ నీటి ఎద్దడి ఉత్పన్నం కానుంది. గ్రామీణ నీటిసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏ పని ముందుకు కదలని పరిస్థితి. స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పలుమార్లు ఖాళీలను భర్తీ చేయాలని చెప్పినా ఉన్నతాధికారులకు పట్టడం లేదు. దీంతో ఈ వేసవిలో నీటి ఎద్దడి పరిస్థితులను ఎలా చక్కదిద్దుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)స్థాయి అధికారులు లేరు. ఎన్టీఆర్ జిల్లాలో ఈఈకి ఎఫ్ఏసీగా ఎస్ఈ బాధ్యతలు అప్పగించగా.. కృష్ణాజిల్లాలో డీఈఈకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి (డీఆర్ఈ)గా అదనపు బాధ్యతలను అప్పగించారు. క్షేత్రస్థాయిలో ఏఈఈలు లేక విధులను నిర్వహించటమే కష్టమైపోతుంటే.. అదనపు బాధ్యతలను అప్పగించటం వల్ల పర్యవేక్షణ కరువైంది.

ఎన్టీఆర్ జిల్లాలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఉంది. జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ సబ్ డివిజన్ల పరిధిలో డీఈఈలు ఉన్నా సగం మండలాల పరిధిలో ఖాళీలు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ (డీఆర్ఈ) కార్యాలయంతో పాటు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంతో పాటు బందరు, అవనిగడ్డ, గుడివాడ, పామర్రు, పెనమలూరు, గన్నవరం సబ్‌డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో సగం మండలాలలో ఏఈలు లేరు. ఈ ప్రభావం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎస్ఈ కార్యాలయాలపైన పడుతోంది. ప్రస్తుతం ఓఅండ్ఎం స్కీమ్‌లను పర్యవేక్షించటం కూడా కష్టమవుతోంది. పనులను పర్యవేక్షించటం, జల్‌జీవన్ మిషన్ కింద చేపడుతున్న ఆన్‌గోయింగ్, టెండరింగ్, డీపీఆర్ స్టేజీలో ఉన్న పనులు, ప్రతిపాదనలను పర్యవేక్షించటం, పరిశీలించటం చేయాల్సి ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జిలుగా ఉన్నవారు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఎస్ఈ పోస్టులు ఉండగా కేవలం ముగ్గురే పనిచేస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులు నూరు శాతం పూర్తయి ఉంటే ఉమ్మడి జిల్లాలో నీటి ఎద్దడి ఉండేది కాదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జేజేఎం పనులను అపహాస్యం చేశారు. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌తోనే పనులు చేసి సగంలో వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవటంతో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అప్పట్లో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవటంతో వదిలేసిన పనులు ఉన్నాయి. ఈ కారణాల వల్ల ఈ వేసవిలో కూడా నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నీటి ఎద్దడి మండలాలు ఇవే..

ఎన్టీఆర్ జిల్లాలో పశ్చిమ ఎన్టీఆర్ ప్రాంతంలో వీరులపాడు, వత్సవాయి మండలాలు నీటి ఎద్దడిని ఎదుర్కొనే జాబితాలో ఉన్నాయి. అలాగే ఉత్తర ఎన్టీఆర్ ఆర్ జిల్లాలో ఏ కొండూరు మండలం, తిరువూరు పట్టణం, గంపలగూడెం ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. అలాగే కృష్ణాజిల్లాలో కృత్తివెన్ను, మచిలీపట్నం రూరల్, బంటుమిల్లి, నందివాడ, గుడివాడ రూరల్ మండలాల ప్రాంతాలలో తీవ్ర నీటి ఎద్దడి కొరత ఉంది. ఇన్‌చార్జిలు జిల్లా స్థాయి పరిపాలనా వ్యవహారాల మీద దృష్టి సారించలేకపోతున్నారు.

గొల్లపూడిలోని ఈఎన్‌సీ కార్యాలయంలో సీఈల కొరత

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం పరిస్థితి ఇలాగే ఉంది. ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టు ఖాళీగా ఉంది. ఒక సీఈకి ఈఎన్‌సీ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. సీఈలుగా సీనియారిటీ ప్రకారం నియమించుకునే అవకాశం ఉన్నా ఉన్నతాధికారులు ఆ పనిచేయటం లేదు. ఖాళీ సీఈ పోస్టులకు సీనియారిటీ లేకుండా వేరొకరి పేరును ఉన్నతాధికారులు తెర మీదకు తెచ్చారు. గతంలోనూ సుప్రీంకోర్టు ఆదేశాలకు భిన్నంగా కొందరు అనధికారికంగా పదోన్నతులు పొందారు. దీనిపై కోర్టు విచారణ నడుస్తోంది. ఈఎన్‌సీ కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఇక జిల్లా స్థాయిలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాల్సిందే.

సాగు నీరందించండి!

» కాలువల్లో నీరు లేక ఎండిపోతున్న వరి పైరు
» ఎన్ఎస్పీ అధికారులకు నీటి సంఘాల నేతలు, రైతుల వినతి





రాజుగూడెంలో ఎండుతున్న వరిసాగు, చల్లగొండిపాలెం ఎన్ఎస్పీ కాలవ వద్ద రైతులు

తిరువూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వాటాల పేరుతో సక్రమంగా నీరు విడుదల కాకపోవడంతో ఎన్ఎస్పీ ఆయకట్టు పరిధిలోని వందలాది ఎకరాల్లో వరి ఎండిపోయే దశకు చేరిందని.. మరో పది రోజులు సాగునీరు విడుదల చేయాలని బుధవారం ముష్టికుంట్ల ఆయకట్టు నీటిసంఘం అధ్యక్షులు, రైతులు తెలంగాణ ఎన్ఎస్పీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంతం ఎర్రబోయినపల్లి 13వ లాక్ నుంచి ముష్టికుంట్ల వరకు ఎన్ఎస్పీ ముష్టికుంట్ల మేజర్ కాలువ ప్రారంభమై.. 1ఆర్, 2ఆర్ కాలువల ద్వారా వావిలాల, రాజుగూడెం ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. ఆంధ్రకు నీటి వాటా పూర్తయిందని, ఎర్రబోయినపల్లివద్ద తెలంగాణ ఎన్ఎస్పీ అధికారులు లాక్ దింపడంతో, ముష్టికుంట్ల మేజర్‌కు నీరు అందక ఆయకట్టు పరిధిలోని వావిలాల, రాజుగూడెం ప్రాంతాల్లో వరిసాగు ఎండిపోయే దశకు చెరింది. దీనిపై తెలంగాణ ఎన్ఎస్పీ అధికారులను కలిసిన నీటిసంఘాల అధ్యక్షులు హనుమంతరావు, గండ్ర ప్రసాద్ తదితరులు ముష్టికుంట్ల మేజర్‌కు నీటిని విడుదల చేయాలని కోరారు. మరో పదిరోజులు ముష్టికుంట్ల బ్రాంచికి సాగునీరు విడుదల చేయాలని పంటలు ఎండిపోయే దశకు చెరుకుంటున్నాయని నీటిసంఘాల అధ్యక్షులు అధికారులకు వివరించారు. దీనికి స్పందించిన అధికారులు చల్లగొండివారి పాలెం వద్ద పగలు, ఒక ప్రాంతం, రాత్రి ఒక ప్రాంతం వారు సాగునీటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ముష్టికుంట్ల మేజర్‌కు నీటిని విడుదల చేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

వన్‌టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయవాడ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.శివకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, 6, 7, 8వ తరగతుల్లో (బ్యాక్‌లాగ్) మిగిలిఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముస్లిం (బీసీ-ఈ, బీసీ-బీ), బీసీ-సి (కన్వెర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థినులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మార్చి1 నుంచి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. వివరాలకు 8712625036 నెంబరులో సంప్రదించాలని తెలిపారు. శ్రీకాకుళం నుంచి తిరుపతి జిల్లా వరకు ఆసక్తి కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోచ్చన్నారు.

రాజధాని నిర్మాణానికి ప్రజలపై భారం వేయం

» పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి పెడుతున్న ఖర్చులో ఒక్క పైసా కూడా ప్రజలపై భారం వేయడం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరులోని కలెక్టర్ తిక్కన భవన్‌లో కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌తో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణానికి సేకరించిన 5వేల ఎకరాల్లో సుమారు 1,200 ఎకరాలను అంతర్జాతీయ, జాతీయ స్థాయి విద్యాసంస్థలు, పాఠశాలలు, పరిశ్రమలు నెలకొల్పేందుకు కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన భూమిలో అన్ని వసతులు కల్పించి మంచి ధరకు విక్రయించి ఆ డబ్బునే రాజధాని నిర్మాణానికి వినియోగించేలా, రాజధానికి చేసిన అప్పులు తీర్చేలా సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.64 వేల కోట్లకు పరిపాలనా ఆమోదం లభించగా, రూ.50వేల కోట్లకు అధికారులు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. హడ్కో, ఏడీబీ బ్యాంకు, ప్రపంచ బ్యాంకు నిధులను సమీకరిస్తూ రాజధాని నిర్మాణానికి ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో రాజధానికి రూ.6వేల కోట్ల కేటాయించామని, ఇంకా అవసరమైతే ఇస్తామని సీఎం చెప్పారని చెప్పారు. రాజధాని విషయంలో ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. రాజధాని ప్రాంతంలో జడ్జీలకు నిర్మిస్తున్న భవనాలకు చదరపు అడుగుకు ఒక పత్రికలో రూ.10వేలు ఖర్చు చేస్తున్నట్లు ప్రచురించారని, అది వాస్తవం కాదని అన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు ఒక సెంటు భూమి ఇస్తే.. తాము రెండు సెంట్లు భూమి ఇస్తున్నామని, తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో పెన్నాబ్రిడ్జి వల్ల ఇళ్లు కోల్పోయిన వారికి కోర్టు నుంచి చట్టపరంగా అభ్యంతరాలు లేకపోతే అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి చెప్పారు.

అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం

తుళ్లూరు, విజయవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిపుణులతో కూడిన ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం పర్యటించింది. రాజధాని అమరావతి నిర్మాణంలో నిర్దేశించిన కార్యక్రమాల అమలు, వాటి నిర్వహణ, గ్రామాల్లో నీటి నిర్వహణ ప్రాజెక్టులు, పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలపై ఏపీ సీఆర్‌డీఏ అధికారులతో ప్రపంచ బ్యాంక్ బృందం చర్చించింది. సీఆర్‌డీఏ అధికారులతో కలిసి రాజధాని గ్రామాల్లో పర్యటించింది. ఈ బృందంలో కో-టాస్క్ టీం లీడర్ గెరాల్డ్ ఒలీవర్, అర్బన్ స్పెషలిస్ట్ కిన్‌గ్విన్ షెన్, ప్రొక్యూర్‌మెంట్ స్పెషలిస్టులు వేదమూర్తి, రాకేశ్, వాటర్ శానిటేషన్ కార్యకలాపాల స్పెషలిస్ట్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పీఎంసీల కోసం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌ల టెండర్లు

అమరావతి రాజధాని ప్రాంతంలో లెజిస్లేటివ్ అసెంబ్లీ భవనం (బీ+జీ+3), హైకోర్టు బిల్డింగ్ (బీ+జీ+7) నిర్మాణాల కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) నియామకం కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్స్ ఏరియాలో టెండర్లు, పనుల పర్యవేక్షణ వ్యవహారాలన్నీ ఎంపిక చేసిన పీఎంసీ పరిధిలోనే జరగనున్నాయి. అలాగే రాజధాని ప్రాంతంలో క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన, అమలు కోసం మరో పీఎంసీ కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. శాశ్వత ప్రాతిపదికన నిర్మించే ఇంటిగ్రేటెడ్ సెక్రటేరియట్, ప్రభుత్వ విభాగాధిపతుల ఆఫీసు బిల్డింగ్స్‌కు సంబంధించి కూడా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించేందుకు సీఆర్‌డీఏ పీఎంసీ కోసం టెండర్లు పిలిచింది. అమరావతి రాజధాని ప్రాంతంలో మేజర్ ఆర్టీరియల్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎలివేటెడ్ కారిడార్ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ, పనుల పర్యవేక్షణకు సంబంధించి పీఎంసీ కోసం అమరావతి రాజధాని అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) టెండర్లు పిలిచింది.

ఐదేళ్ల లీజు ప్రతిపాదన తిరస్కరణ!

(5వ పేజీ తరువాయి)

ఈవో రామారావు హయాంలో లీజు గడువును మరో ఐదేళ్ల పొడిగింపునకు ప్రతిపాదిస్తూ అప్పట్లో ఫైల్‌ను దేవదాయశాఖకు పంపారు. ప్రస్తుతం సదరు సంస్థ లీజు ముగియటానికి మరో మూడు నెలల గడువు మాత్రమే ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్లకు గడువు పెంపుదల ప్రతిపాదన వ్యవహారంలో లీజుల విభాగంలో ఓ ఎన్ఎంఆర్ ఉద్యోగి చక్రం తిప్పారని సమాచారం. అధికారులందరినీ పక్కన పెట్టి ఎన్ఎంఆర్ ఉద్యోగి తానొక్కడే గడువు పెంపునకు ప్రతిపాదన చేసినట్టుగా తెలుస్తోంది. సంబంధిత లీజు సంస్థకు ఎన్ఎంఆర్ ఉద్యోగే ఉచిత సలహా ఇచ్చి దరఖాస్తు పెట్టించాడని సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా రెండేళ్ల లీజును ఏకంగా ఐదేళ్లకు ప్రతిపాదిస్తూ ఫైల్‌ను సిద్ధం చేశారు. ఈ ఫైల్‌ను సిద్ధం చేయటం వెనుక రూ.10 లక్షల డీల్ నడిచిందని సమాచారం.

అనుమానాలెన్నో..

ఈ లీజు పెంపు ప్రతిపాదన వ్యవహారంలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. నెలకు రూ.1.60 లక్షల అద్దె ప్రాతిపదికన ఆ సంస్థకు దేవస్థానంలో స్టాల్ అప్పగించటం జరిగింది. ద్వారకా తిరుమలలో ఇదే సంస్థ రూ.1.80 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయంగా ఉన్న ఇంద్రకీలాద్రిపై తక్కువ అద్దెకు స్టాల్ కేటాయింపుపై తీవ్ర విమర్శలు కూడా వస్తున్నాయి. అగరబత్తి ప్యాకెట్ ధర రూ.100గా నిర్ణయించి విక్రయిస్తున్నారు. అగరబత్తి కొన్న వారికి ఒక కీ చైన్‌ను కూడా బహుమతిగా ఇస్తున్నారు. తక్కువ అద్దెతో ఐదేళ్ల లీజు పొడిగించుకోవటం ద్వారా భారీగా ఆదాయం పొందేందుకు పావులు కదిపింది. అయితే సదరు సంస్థ అమ్మవారి ఆలయంలో వాడిన పూలతోనే అగరబత్తిలను తయారు చేయిస్తుందా అన్నదానిపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయం నుంచి పువ్వులు తీసుకోవటం లేదని, రసాయనాలతో తయారు చేసిన అగరబత్తిలనే విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని దేవదాయ శాఖ కమిషనర్ లీజు గడువు ఐదేళ్లకు పెంపు ప్రతిపాదనను రద్దు చేసినట్టు తెలుస్తోంది.

లీజుల విభాగంపై ఈవో దృష్టి

దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ప్రస్తుతం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా కూడా వ్యవహరిస్తుండటంతో లీజుల విభాగంపై దృష్టి సారించినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై వ్యక్తిగతంగా కూడా విచారణ జరిపినట్టు తెలిసింది. సూపరింటెండెంట్‌కు తెలియకుండానే ప్రతిపాదన సిద్ధమైనట్టు వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో వేళ్లన్నీ ఎన్ఎంఆర్ ఉద్యోగివైపే చూపిస్తున్నాయి. లీజుల విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఎన్ఎంఆర్ ఉద్యోగి కాంట్రాక్టర్లతో అత్యంత సన్నిహితంగా ఉంటాడని సమాచారం. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఏం చేయాలో కూడా ఉచిత సలహాలు ఇస్తాడన్న విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు లబ్ధి కలిగించే సలహాలు ఇవ్వటం ద్వారా భారీగా సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. సదరు ఉద్యోగిపై ప్రస్తుత ఈవో దృష్టికి ఫిర్యాదులు వచ్చినట్టుగా తెలుస్తోంది.

ఆ ఆత్మహత్య వెనుక..

(5వ పేజీ తరువాయి)

ఫొటోతీసి వాట్సాప్‌లో జేఈకి పంపినట్టు సమాచారం. ఆయన ఇదే విషయాన్ని లస్కర్లకు చెప్పినట్టు తెలిసింది. తర్వాత వినోద్ సతీమణితో ఫోన్‌లో మాట్లాడి అతడు చేసిన పని గురించి వివరించారని సమాచారం.

ఇసుక రీచ్ వ్యవహారంతో సంబంధం ఉందా?

తోట్లవల్లూరు మండలంలో ఒకచోట నదిలో పుష్కర ఘాట్‌ను మూసేసి, దానిపై రహదారిని నిర్మించారు. ఇక్కడి నుంచి ఇసుక తవ్వకాలు చేయడానికి ఆ ప్రాంతానికి చెందిన ఓ పెద్దమనిషి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. మరోపక్క నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రొయ్యూరు నుంచి పాపవినాశనం వరకు ఉన్న నది పరివాహక ప్రాంతంలో ఈ తవ్వకాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులకు భారీగానే ముడుపులు అందినట్టు జలవనరుల శాఖలో ప్రచారం నడుస్తోంది. ఈ వ్యవహారాలకు తనను బలి చేయడానికి చూస్తున్నారని వినోద్ తన తోటి ఉద్యోగుల వద్ద చెప్పినట్టు వినికిడి. వినోద్ అధికారుల వేధింపులతో చనిపోయాడా.. తన క్రమశిక్షణారాహిత్యం వల్ల ప్రాణాలు తీసుకునే పరిస్థితిని తెచ్చుకున్నాడా.. అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

కొండవాగులో కబ్జాకోరులు

(5వ పేజీ తరువాయి)

ఈయన వేసిన వెంచర్‌లోని స్థలాల్లో ఇళ్లు నిర్మించడమే కాదు.. చాలావరకు అమ్మేశాడు కూడా. నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను తడిపేందుకు కూడా ఈ వైసీపీ నేత.. పంచాయతీ సిబ్బందినే ఉపయోగించడం గమనార్హం. వాగు పోరంబోకు స్థలంలో నిర్మాణాలు ఏమిటని కొంతమంది అడుగుతుండటంతో 'ఇది నా స్థలమే' అని బుకాయిస్తూ కోర్టు నుంచి స్టేటస్‌కో తెచ్చుకున్నట్లుగా సమాచారం. సదరు స్థలాల్లో సోమవారం ఎర్రమట్టి తోలించి చదును చేయించాడు. కోర్టును తప్పుదోవ పట్టించి ప్రభుత్వ భూమిని సైతం తనదే అని నమ్మిస్తున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు శంకుస్థాపన

వన్‌టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరగనుంది. విజయవాడ టీచర్స్ కాలనీ, సాయిబాబ టెంపుల్ జంక్షన్ రోడ్డులో జీప్లస్5 విధానంలో ఈ నూతన భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించనున్నారు. ఉదయం 9.12 గంటలకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శంకుస్థాపన చేయనున్నారు. ట్రస్ట్ భవనం సిద్ధమైతే ఇక్కడ నుంచే పేద విద్యార్థులకు విద్య, పేదలకు వైద్య సౌకర్యాలు అందించనున్నారు. నిర్మాణం కానున్న భవనంలో తలసేమీయా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ కూడా అందుబాటులోకి రానున్నాయి. తలసేమీయా రోగులకు అవసరమైన వైద్య సేవలను ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందించనున్నారు. కేర్ సెంటర్ నుంచే వైద్య సేవలు, రక్తదానం, ఇతరత్రా సేవా కార్యక్రమాలను అందించేందుకు ట్రస్ట్ సన్నాహాలు చేస్తోంది. చూపరులను ఆకర్షించే విధంగా ఒక ఐకాన్‌గా ఉండేలా నూతన భవన డిజైన్‌ను రూపొందించారు. ఈ భవనం విజయవాడలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ కాగలదని భావిస్తున్నారు.

తిరువూరు వైసీపీలో ముసలం

(5వ పేజీ తరువాయి)

ఆధిపత్య పోరు మొదలైంది. నాలుగేళ్లకు అవిశ్వాసం పెట్టే అవకాశం ఉండటంతో వైసీపీ కౌన్సిలర్లు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన సుమారు 8 మంది కౌన్సిలర్లు అసమ్మతివాదులకు మద్దతు తెలుపుతున్నారు. కొందరు కౌన్సిలర్లు పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటామని, అవిశ్వాసం పెట్టడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందంటున్నారు. కాగా, 17 మంది వైసీపీ కౌన్సిలర్లలో కొందరు జనసేన వైపు చూస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో అసమ్మతివాదులు అవిశ్వాసం పెట్టే ప్రయత్నాలు చేస్తుండటంతో స్థానిక వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి నుంచి ఎలా గట్టెక్కాలనే వ్యూహరచనలు చేస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

రామలింగేశ్వర స్వామి ఆదాయం రూ.13.38 లక్షలు

విజయవాడ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు గ్రామంలో వున్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీ ఆదాయం రూ.13,38,788 వచ్చినట్లు దేవస్థానం సిబ్బంది తెలిపారు. 9 హుండీలు, 1 టెంపరరీ హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ లెక్కింపునకు వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్.సన్యాసిరావు పర్యవేక్షణలో దేవస్థాన అర్చకులు, దుర్గా శివసాయి సంఘం సభ్యులు లెక్కించగా 2024 డిసెంబరు 6నుంచి 2025 మార్చి 4వరకు రూ.13,38,788 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సిబ్బంది తెలిపారు.

సాహితీ విమర్శలకు ప్రాధాన్యం

కేఎల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ స్రాండా సోఫియా



మాట్లాడుతున్న ప్రొఫెసర్ స్రాండా సోఫియా

భారతీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం, భాషా అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి భాషలో సాంకేతికత ముఖ్యపాత్ర పోషిస్తుందని కేఎల్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ స్రాండా సోఫియా తెలిపారు. ఆంధ్రా లయోలా కళాశాలలో ఆంగ్ల భాషా విభాగం, ఏఎల్‌సీ ఈఎల్‌టీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కమ్యూనికేషన్ భాష, సాహిత్య విమర్శలను సమగ్రపరచడం అనే అంశాలపై ఏర్పాటు చేసిన సదస్సు బుధవారంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ స్రాండా సోఫియా మాట్లాడుతూ సాహితీ విమర్శలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఫాదర్ ఎం. సగాయరాజ్, పీజీ వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, డాక్టర్ శుభ, డి.ప్రవీణ్, కన్వీనర్ బి.రాజు, ఎన్ రంగబాబు పాల్గొన్నారు.

87 ప్రాజెక్ట్‌ల ప్రదర్శన

ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐక్యూఏసీ, సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేథాన్ 2025 (ప్రాజెక్ట్ ప్రదర్శన) కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ ప్రదర్శనలో కృత్రిమ మేధస్సు టెక్నాలజీని ఉపయోగించి ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కంట్రోలర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫాదర్ బి. జోజిరెడ్డి, సెక్రటరీ డి.బాలస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్, విభాగాధిపతులు, సిసర్ క్యాండీ, 450మంది విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సూచిక బోర్డులు





తూర్పు నియోజకవర్గంలో 13వ డివిజన్ న్యూ ఆర్టీసీ కాలనీ మూడో రోడ్డు, నాలుగో రోడ్డు పోలవరపు వారి వీధి సూచిక బోర్డులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మూడో రోడ్డును సూచించే బోర్డుపై అక్షరాలు పూర్తిగా చెదిరి పోయాయి. నాలుగో రోడ్డు పోలవరపు వారి వీధిలో సూచిక బోర్డు పూర్తిగా విరిగిపోవడంతో మూలన పడేశారు. పథకాల కోసం ఇంటింటి సర్వే చేసే సమయంలో చిరునామాలు తెలుసుకునేందుకు ఈ బోర్డులు కీలకంగా ఉంటాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులకు మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

-పటమట, ఆంధ్రజ్యోతి

వేగంగా డిప్యూటీ సీఎం సభ ఏర్పాట్లు

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7న స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభం కార్యక్రమానికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏర్పాట్లను కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సభావేదిక, ప్రజలు కూర్చునేందుకు గ్యాలరీలు, వాహనాల పార్కింగ్ పై చర్చించారు. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభానికి వచ్చే అతిథులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తగిన చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. బహిరంగ సభ ఏర్పాటు, రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. 5వేల మందితో సభ నిర్వహించనున్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీడీవో టి.స్వర్ణలత తదితర అధికారులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు నిర్మాణ పనులు

శారద విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల స్కాలర్‌షిప్‌లు

మొగల్రాజపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శారద కళాశాల విద్యార్థులకు అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీలో ప్రవేశాలతో పాటు అత్యధిక మొత్తంలో స్కాలర్‌షిప్‌లు సాధించారని శారదా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదా దేవి చెప్పారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మిల్వాకీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ యూనివర్సిటీలో మిరియాల ఆదిత్య సీటుతో పాటు రూ.2 కోట్ల 40లక్షల స్కాలర్‌షిప్, చెరుకూరి కౌసిక్ కోటి రెండు లక్షల స్కాలర్‌షిప్, పాతూరి కీర్తికా కీల్లాయ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ యూనివర్సిటీలో సీటుతో పాటు పదివేల డాలర్ల స్కాలర్‌షిప్‌ను పొందారని చెప్పారు. ఇంటర్ విద్యను ప్రామాణికంగా తీసుకుని ఇన్విక్టా సంస్థను భాగస్వామిగా చేసుకుని తాము ఏర్పాటు చేసిన శాట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ తీసుకున్న విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో ప్రవే శాలు, స్కాలర్‌షిప్‌లు పొందడటం అభినందనీయం, సంతోషదాయకం అన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సలహాదారులు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదా దేవి తదితరులు

8న అస్మిత యోగా సిటీ ఉమెన్ లీగ్

పటమట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న విజయవాడ పీబీ సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో అస్మిత యోగా సిటీ ఉమెన్ లీగ్ నిర్వహిస్తున్నామని నిర్వాహకురాలు రాజేశ్వరి తెలిపారు. జూనియర్ విభాగంలో 12 నుంచి 18 ఏళ్ల ఉన్న బాలికలు, సీనియర్ విభాగంలో 18 నుంచి 55 ఏళ్ల ఉన్నవారు పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 7675893062 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, బృందావన్ కాలనీ, సందమూరి రోడ్, శ్రీరామ్ అపార్ట్‌మెంట్, డోర్ No. 40-15-2/12, ఫ్లాట్ No. ఫస్ట్ ఫ్లోర్ - F2 , F3 కాపురస్తుడు D. నరసింహా రావు గారి కుమారుడు D.V.N. సతీష్ కుమార్ గారి సంకాయిషీ పొంది యావన్మందికి తెలియజేయుచున్నది ఏమనగా నా క్లయింట్ ఓటి అడ్రస్ కాపురస్తుడు అయిన మోటూరి లేట్ మురళీ కృష్ణ మూర్తి గారి కుమారుడు మోటూరి వెంకట దుర్గ ప్రసాద్ వగైరాలు వద్ద నుండి ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు కొంత సొమ్మును అడ్వాన్స్ గా ఇచ్చి విక్రయ ఖరారు చేసుకొనియున్నారు దరిమిలా విక్రయ దస్తావేజు రిజిస్టర్ చేయించుకొనదలిచారు. కావున ఎవరికయినను ఎట్టి అభ్యంతరములు కానీ కోర్ట్ వారి ఇంజక్షన్స్ కానీ స్టేలు కానీ ఏమన్నా ఆర్డర్స్ ఉన్న యెడల ఈ తేదీ లగాయతు ఒక వారం రోజులలో ఈ క్రింది చిరునామాకు ఆధారాలతో లిఖిత పూర్వకంగా RLAD విత్ Ack. ద్వారా తెలియ జేయగలరు లేని యెడల తదుపరి వచ్చు క్లెయిమ్ములు నా క్లయింట్ ని బైండ్ చేయజాలవు.

A షెడ్యూల్ : ఎన్టీఆర్ జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా లో చేరిన విజయవాడ, లబ్బీపేట, చంద్రమౌళీపురం, మునిసిపల్ వార్డ్ No.24, కొత్త వార్డ్ No. 28 , రెవిన్యూ వార్డ్ No. 11, బ్లాక్ No. 4 , NTS No. 81 , దాఖలా చ. గ. 505 -5 ఝ లేక 422 -74 ఝ , డోర్ No. 40-15-2/12, స్థిరాస్తి కి స్థలమునకు హద్దులు:- తూ: వారణాసి రామ సుబ్బారావు గారి ఆస్తి, ద: అనుమోలు వీరరాఘవరావు గారి ఆస్తి, ప: మునిసిపల్ రోడ్, ఉ: పోతురాజు విజయకుమారి గారి ఆస్తి. B షెడ్యూల్ : సదరు స్థలములో 1 /12 వంతు చ.గ. 42 -125 లేక చ.మీ. 31 - 22 ఝ, దాఖలా మొత్తంలో శ్రీరామ్ టవర్స్ అను పేరుతో నిర్మించబడిన అపార్ట్మెంటులో సెకండ్ ఫ్లోర్ లోని ఫ్లాట్ No . S-1 కట్టడములకు హద్దులు :- తూ : ఓపెన్ టు స్కై, ద: ఓపెన్ టు స్కై, ప : ఫ్లాట్ No.S- 2, ఉ : ఓపెన్ టు స్కై

G. N.V.D.N.SURESH, Advocate
R/o. 2F-302 ,# 76 -8/6 -19/6,
MSN SUNRISE APARTMENT,
Gudivada Ramarao Street, Bhavanipuram,
VIJAYAWADA - 520012. Mobile : 94402 30315.

అంటగడుతున్నారు..!

- గిన్నిస్ బుక్ రికార్డు కోసం జ్యూట్‌బ్యాగ్‌లు కొనండి
- డ్వాక్రా సంఘాలపై యూసీడీ ఒత్తిడి



(కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి) వీఎంసీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(యూసీడీ) పేరుతో ముద్రించిన జ్యూట్ బ్యాగులను డ్వాక్రా గ్రూపు సభ్యులు తప్పక కొనుగోలు చేయాల్సిందేనని డ్వాక్రా గ్రూపులకు రీసోర్స్‌పర్సన్లు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారు. దీని ధర రూ.270లు ఉండటంతో తమకు అవసరం లేకుండా ఏలా కొనుగోలు చేయాలన్న దానిపై వారు మీమాంశలో ఉన్నారు. కానీ రిసోర్స్ పర్సన్లు మాత్రం ఈనెల 8న నిర్వహించే మహిళా దినోత్సవం సందర్భంగా ఈ బ్యాగ్‌ల అమ్మకాల్లో గిన్నిస్ బుక్ రికార్డు సాధించడానికి ఈ లక్ష్యాలను నిర్దేశించినట్టు సమాచారం. గిన్నిస్ బుక్ రికార్డును సాకుగా చూపి తమపై ఆర్థిక భారం మోపడం ఎంత వరకు సమంజసమని కొందరు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అధిక వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న డ్వాక్రా మహిళలకు ఇలాంటి ఒత్తిడి పెనుభారమే అంటున్నారు. డ్వాక్రా మహిళలకు ఆసరాగా ఉండాల్సిన నగరపాలకసంస్థ యూసీడీ విభాగం, వ్యాపార దృక్పథంతో తమపై ఒత్తిడి చేయటం ఏమిటని విమర్శిస్తున్నారు. డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరు చేసేందుకు ప్రాజెక్ట్ ఆఫీసర్‌తో సంతకాలు చేయించాలనే సాకుతో ప్రతి గ్రూపు నుంచి రుణం మొత్తం మీద పదిశాతం మాముళ్ల రూపంలో ఇవ్వాల్సిందేనని ఆర్పీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నారు. వాటి గురించి సభ్యులు ప్రశ్నిస్తే పదేపదే తిప్పు కుంటూ బ్యాంకుల నుంచి రుణాలు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రూప్ సభ్యులు అంటున్నారు. దీనిపై విజయవాడ నగర కమిషనర్ తక్షణమే స్పందించాలని డ్వాక్రా సంఘాలు కోరుతున్నాయి.

వివాహిత అనుమానాస్పద మృతి

గుణదల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గుణదలలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గుణదల బెత్లహామ్ నగర్లో ఉంటున్న వల్లెపు శిరీషా(32)కు వెంకట్రావ్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు. శిరీషా గుణదల్లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్. భర్త ఆటో డ్రైవర్. వీరిద్దరి మధ్య గతకొంత కాలంగా మనస్పర్థలు చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయింది. విషయం గమనించిన చిన్న కుమారుడు చుట్టుపక్కల వారికి తెలియజేశాడు. సమాచారం అందుకున్న మాచవరం ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. భర్త కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

10 నుంచి లేపాక్షిలో డిస్కౌంట్ అమ్మకాలు

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లేపాక్షి వార్షిక క్లియరెన్స్, ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్‌తో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ అమ్మకాలు ప్రారంభించినట్టు లేపాక్షి మేనేజర్ ఎం.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని షోరూమ్‌లో హస్తకళ వస్తువులు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 50 శాతం తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నామన్నారు. ఈ నెల 31 వరకు ఈ తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక, ఉడ్ కార్వింగ్ కళారూపాలు, చేనేత వస్త్రాలు, మంగళగిరి కాటన్, కలంకారి వస్త్రాలు అందుబాటు ఉన్నాయన్నారు.

ఎవరెస్ట్, పటేల్ జట్టు విజయంలో బ్యాటర్లే కీలకం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్ లలో బుధవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. రాయల్ సీసీ, ఎవరెస్ట్ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌లో రాయల్ సీసీ జట్టు 49.1ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 218పరుగులు చేసింది. ఎవరెస్ట్ జట్టు 37.3ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 222పరుగులతో విజయం సాధించింది. జట్టులో టి.హర్ష సాయి సాత్విక్ 114పరుగులు చేశాడు. పటేల్, వీవీకేఆర్ఎం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పటేల్ జట్టు 49.4ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 283పరుగులు చేసింది. జట్టులో వి.లెనిన్ 100పరుగులు, వి.అన్వేష్ 78పరుగులు చేశారు. అనంతరం వీవీకేఆర్ఎం జట్టు 46.1ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 181పరుగులు చేసి ఓటమి చెందింది.



హర్షసాయి సాత్విక్
114 పరుగులు



వి.లెనిన్
100 పరుగులు

మహిళలకు భద్రత, ఆత్మరక్షణ అవసరం

డీసీపీ కేజీవీ సరిత

రైల్వేస్టేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భద్రత, ఆత్మరక్షణ అవసరమని విజయవాడ పోలీస్ డిప్యూటీ కమిషనర్ కె.జి.వి.సరిత అన్నారు. ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ రైల్వే డివిజన్ ఆడిటోరియంలో మహిళల భద్రత, ఆత్మరక్షణలపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూస పద్ధతులకు మహిళలు స్వస్తి చెప్పి సాధికారిత, భద్రత, ఆత్మరక్షణ కోసం శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ మోసగాళ్ల మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏ విధంగా వ్యవహరిస్తున్నారన్న దానిపై వివరించారు. ఈ సందర్భంగా రూఫన్ కుంగ్‌ఫూ బృందం, భారత్ స్కౌట్స్ గైడ్స్ సభ్యులు మహిళలకు ఆత్మరక్షణ పద్ధతులను వివరించారు. సీనియర్ డీపీవో కట్టా ఆనంద్ మాట్లాడుతూ మహిళలు నాయకత్వ లక్షణాలను విరివిగా అలవరచుకోవాలన్నారు. సుమారుగా 300 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ సరిత

వైజ్ఞానిక పరికరాలను రూపొందించాలి

ఏపీఎస్ఎస్‌డీసీ జీఎం కిషోర్ కుమార్

ప్రసాదంపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన వైజ్ఞానిక పరికరాలను రూపొందించాలని, ఆయా పరికరాలు నేటి మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఏపీఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ జీ. కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం ఎనికేపాడులోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే సావిషేకర్-2025ను ఆయన ప్రారంభించారు. తొలిరోజు సాంస్కృతిక ప్రదర్శనలు, టెక్నికల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయా ప్రదర్శనలను పెనమలూరు, నందిగామ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జీ.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, సోలార్ సిటీ, డ్రోన్ టెక్నాలజీ, హైడ్రో రోడ్స్ వంటివి ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. అవేరా కో ఫౌండర్ చాందిని చందన పలు విభాగాల ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులను అభినందించారు. కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, కార్యదర్శి బి. కృష్ణారావు పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి. వెంకటేశ్వరరావు, విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచాలని విద్యార్థుల ఆందోళన

ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ప్రధాన గేటు మూసి నిరసన

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : స్టైఫండ్ పెంచాలని నెల రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వెటర్నరీ కళాశాల విద్యార్థులు తమ ఆందోళనను తీవ్రతరం చేశారు. మండలంలోని కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ప్రధాన గేటును బుధవారం మూసివేసి బోధన, బోధనేతర సిబ్బంది, వర్కర్‌లను లోపలకు రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సమస్యలను పరిష్కరించాలం టూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ బీవి శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కళాశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే గేటు బయట వాహనాలు నిలిచిపోయాయి. సీఐ విద్యార్థులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ తీరును వ్యతిరే కిస్తూ కంచాలను గరిటెలతో మోగిస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు భాను ప్రకాష్, ధర్మతేజ, పునీత్, వర్మ, మాట్లాడుతూ, ఉపకారవేతనాలు పెంచాలని రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవటందారుణమని, న్యాయమైన కోర్కెలను పరిష్కరించమంటే స్పందించక పోవటం బాధాకరమన్నారు. కళాశాల హాస్టల్ ఖాళీ చేయాలని, మెస్ మూసివేయాలని సర్క్యు లర్ జారీ చేయటం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా జరుపుతున్న తమ నిరస నను పోలీసులతో భగ్నం చేయించటం సరికాదన్నారు.

రక్షణ కరువు



- బీమా లేని జీవితాలతో కాలం వెళ్లదీస్తున్న రక్షకభటులు
- సిబ్బంది జీపీఎఫ్‌నూ వాడేసుకొన్న గత ప్రభుత్వం
- జీపీఎఫ్ లోన్లకూ అతీగతీ లేదు
- పెండింగులో 7,8 టీఏలు
- అసెంబ్లీలో హోం మంత్రి ప్రకటించినా ఆయిల్‌కు ఇక్కట్లే..!
- ఇన్‌చార్జిల స్వంత ఖర్చుతోనే వెహికల్ రిపేర్లు

విజయవాడ, ఆంధ్రజ్యోతి: పోలీస్ శాఖలో బీమా లేని జీవితాలతో 'రక్షకభటులు' కాలం వెల్లదీస్తున్నారు. ఏపీజీ ఎల్ఐసీ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్) అనేది ఏఆర్, సివిల్, ఏపీఎస్‌పీ పోలీస్ సిబ్బందికి వర్తిస్తుంది. సర్వీసులో చేరినప్పటి నుంచి జీతంతో పాటు నగదు కట్ అవుతూ బేసిక్ పెరిగినప్పుడల్లా ఆ బీమా నగదు కూడా ఎక్కువగా కట్ అవుతుంటుంది. ఇలా కట్ అయిన నగదు వారికి 58 ఏళ్లు వయస్సు వచ్చేసరికి డ్రా చేసుకొనే అవకాశం ఉంది. కానీ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల సిబ్బంది బీమా నగదు ఇచ్చేందుకు బడ్జెట్ లేదనే సమాధానాలు వస్తున్నాయి. దీంతో వారికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. గత ప్రభుత్వం సిబ్బంది జీపీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) నగదును వాడేసుకొంది. లోన్ల కోసం దరఖాస్తు చేసుకొన్న వందలాది మంది సిబ్బందికి బడ్జెట్ లేదనే సమాధానం వస్తోంది. తమ జీతాల్లోంచి కొంచెం దాచుకొని అవసాన దశలో అవసరాలకు వాడుకొనేందుకు పనికొస్తాయనుకున్న నగదును ప్రభుత్వం వాడుకోవడమేంటని సిబ్బంది ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక రెండు సరెండర్ లీవ్‌ల నగదు కూడా రావాల్సి ఉంది. అలాగే 7, 8 టీఏల నగదు పెండింగ్‌లో ఉంది. రక్షక్ వాహనాలకు నెలకు 180 లీటర్ల అయిల్ ఇస్తుండగా హోం మంత్రి వంగలపూడి అనిత స్వయంగా అసెంబ్లీలో ఆ మొత్తాన్ని 300 లీటర్లకు పెంచి ఇస్తామన్న వాగ్దానం అమలు కాలేదు. 20వ తేదీ వచ్చిందంటే చాటు ఆయిల్ కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. రిపేర్లు కూడా స్వంత ఖర్చులతోనే చేయించాల్సి వస్తోంది. ఎస్ఐ ట్రైనింగ్‌కు, బందోబస్తులకు వెళ్లేవారికి రూపాయి కూడా ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయవాడ నుంచి దాదాపు 15మంది వెళ్లి తమ స్వంత ఖర్చులతోనే టిఫిన్లు, భోజనాలకు ఖర్చుచేయాల్సి వస్తోంది. తర్వాత బిల్లు పెట్టుకోమని అంటున్నా వాటికీ అతీగతీ లేదు. అసెంబ్లీ సమావేశాలకు, బందోబస్తులకు విజయనగరం, శ్రీకాకుళం వంటి దూరప్రాంతాల నుంచి సిబ్బంది వచ్చి 10 నుంచి 15 రోజులు ఉండి తమ స్వంత ఖర్చులతో డ్యూటీ చేసి వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది సంక్షేమంపై గత ప్రభుత్వం చేసిన పాపాలు నేటికీ శాపాలుగానే మారి వేధిస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. 2023 నుంచి కొత్త పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) కోసం సిబ్బంది ఎదురుచూస్తున్నారు. కనీసం ఐఆర్ (ఇంటీరియర్ రిలీఫ్) కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలోని పెద్దలు తమ సమస్యలను ఆలకించి న్యాయం చేయాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

త్వరలోనే రాజధాని నిర్మాణ పనులు

● ఎంపీ కేశినేని శివనాథ్

లబ్బీపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణ విషయంలో సీఎం చంద్రబాబు ఒక విజన్‌తో ముందుకు వెళుతున్నారని, నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఏపీ కన్‌స్ట్రక్షన్ ఎక్స్‌పోను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిల్డర్స్, కాంట్రాక్టర్స్‌కు నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచేలా ఈ ఎక్స్‌పో నిర్వహించటం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నిర్మాణ రంగం అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఎక్స్‌పో నిర్వాహకులు, షైనీ గ్రూప్ అధినేత షేక్ బాజీ, సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి 9 వరకు అంతర్జాతీయ సదస్సు

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అసోషియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపీ), మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నగరంలోని నోవాటెల్ హోటల్‌లో న్యూజెన్ టెక్ ఎయిడ్ ఫర్ సస్టైనబుల్ అనే అంశంపై ఈనెల 7నుంచి 9వరకు మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఏఎల్ఈఏపీ అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని, అతిథులుగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే, ఎంఎస్ఎంఈ అదనపు కార్యదర్శి రజనీష్, ప్రపంచ బ్యాంకు ప్రతినిధి, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరవుతారని తెలిపారు. స్థిరమైన వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు ప్రపంచ వాణిజ్య అవకాశాలు, పరిశ్రమలు వంటి అంశాలపై జరిగే సదస్సుకు అంతర్జాతీయ నిపుణులు హాజరవనున్నట్టు ఆమె తెలిపారు.



పోటీలను పరిశీలిస్తున్న శివారెడ్డి, విద్యాసాగర్

ఆటల పోటీలతో మానసిక ఉల్లాసం

● ఎన్జీవో రాష్ట్ర నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో మహిళా ఉద్యోగులకు రెండో రోజు బుధవారం పలు పోటీలు జరిగాయి. ఈ పోటీలను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కే శివారెడ్డి, ఏ విద్యాసాగర్ తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం కుటుంబ, వృత్తిపరమైన ఒత్తిళ్లతో గడిపే మహిళా ఉద్యోగులకు ఈ ఆటల పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ పోటీల్లో క్యారమ్స్, వ్యాసరచన నిర్వహించారు. నేడు పాటలు, నృత్య పోటీలు జరుగుతాయని సంఘం మహిళా విభాగం ఛైర్మన్ నిర్మల కుమారి తెలిపారు. ఈ నెల 8న ముగింపు సభ ఎన్జీవోహోంలో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నేతలు

కార్మికులను ప్రైవేటుకు కట్టబెట్టొద్దు..!

● ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు తక్షణమే విడనాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, ఎన్ఎంఆర్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జీవోలు జారీ చేసి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ధర్నా చౌక్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్లుగా డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌లు చెల్లించలేదని విమర్శించారు. జీపీఎఫ్ అకౌంట్లు ప్రారంభించకుండా మూడేళ్లుగా ఆర్థికంగా వేదిస్తున్నారని ధ్వజమెత్తారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నూకరాజు, ఏ సామ్రాజ్యం, బి.సోమయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఏపీ రైతుసంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో జరిగిన నిరసన ప్రదర్శన

రైతులకిచ్చిన హామీలు కేంద్రం నెరవేర్చాలి

● ఏపీ రైతు సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో రైతు ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేసిందని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖా మంత్రి, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ మద్దతు ధరలు, రైతుల కు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వమే నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేసేందుకు ఉపక్రమించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఏపీ రైతు సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షు డు గుజ్జుల ఈశ్వరయ్య, సీనియర్ రైతు నేత వై. కేశవరా వు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి, కార్మిక సంఘ నేత కాసాని గణేష్‌బాబు, రైతు నేతలు జీవీ రంగారెడ్డి, వెంకటరెడ్డి, కొప్పుల విజయబాబు ప్రసంగించారు.

పేదరికం లేని సమాజం లక్ష్యంగా పీ 4 సర్వే

● 8వ తేదీ నుంచి 18 వరకు సచివాలయ సిబ్బందితో అమలు: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వేకు రూపకల్పన చేయడం జరిగిందని, ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా పీ4 సర్వేపై కలెక్టర్ లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ నెల 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు మాస్టర్ ట్రైనర్లుగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ లేదా వార్డు సచివాలయ సిబ్బందికి సర్వేపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా పైన వున్నవారు అట్టడుగున వున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పీ4 విధానం లక్ష్యమని వివరించారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. ఈ సమాచారాన్ని కుటుంబాలకు వివరించి, కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరిమితుల ఖచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాల్సి వుంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ఏవైనా అపోహలు వుంటే తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాల్సి వుంటుందన్నారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి...

వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, మజ్జిగ సరఫరా చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. వేసవి కార్యాచరణపై క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులను తమ కార్యాలయ సిబ్బందితో పాటు సందర్శకులకు వేసవి కార్యాచరణలో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక్క మనుషులకే కాదు, పశుపక్ష్యాదులకూ తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. బస్టాండ్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్లు తదితరాల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

వైభవంగా బోడె వెంకట్రామ్, రీతిక రిసెప్షన్

● నూతన దంపతులకు మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీర్వాదాలు
● ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ● సాయంత్రం మంత్రి లోకేష్ హాజరు



బోడె వెంకట్రామ్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి లోకేశ్ తదితరులు

పెనమలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్, రీతిక దంపతుల రిసెప్షన్ బుధవారం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులను ఆశీర్వదించడానికి పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. బుధవారం ఉదయాన్నే సీఎం చంద్రబాబు నూతన దంపతులను ఆశీర్వదించగా, సాయంత్రం మంత్రి లోకేశ్, వంగవీటి రాధా వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం లోకేశ్ బోడె కుటుంబ సభ్యులతో ముచ్చటించి బోడే మనుమరాలితో కాసేపు సరదాగా గడిపారు. అలాగే మంత్రి సవిత, మాజీ మంత్రి పరిటాల సునీత, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, టీడీపీ నేత బుల్లయ్య, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, బొండా ఉమా, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య విచ్చేశారు. రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ నూతన వధూవరులను ఆశీర్వదించారు. తొలుత ఎమ్మెల్యే బోడె ఇంటికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ గంగాధర్ రావులు ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర హాజరై బోడె వెంకట్రాం, రీతిక దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి 'సిద్ధార్థ' స్వర్ణోత్సవాలు

● స్వర్ణోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పాలకమండలి సభ్యులు

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతోనే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు కొనసాగుతున్నామని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలకవర్గం అధ్యక్షుడు మలినేని రాజయ్య స్పష్టం చేశారు. సంస్థ స్వర్ణోత్సవాలు డిసెంబర్ వరకు జరుగుతాయన్నారు. ఈ నెల 7న ప్రారంభ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ మమిడాల జగదీష్‌కుమార్ పాల్గొంటారన్నారు. పోస్టల్ కవర్ ఆవిష్కరణతో పాటు ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తామన్నారు. 1975 ఆగస్టు 12న ఏర్పాటైన సంస్థ తొలుత 300 మంది విద్యార్థులు, 25 మంది అధ్యాపకులతో ప్రారంభమై ప్రస్తుతం 18 సంస్థలుగా విస్తరించి 30వేల మంది విద్యార్థులు, 3,500 మంది అధ్యాపకులతో కొనసాగుతుందన్నారు. సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్ మాట్లాడుతూ ఈ స్వర్ణోత్సవాల ప్రారంభ సభలో లోగో ఆవిష్కరిస్తామన్నారు. సిద్ధార్థ అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ పీవీ రావు, అకాడమీ సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు, సిద్ధార్థ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ వర్శిటీ ప్రొ. చాన్సలర్ ఆచార్య రత్నప్రసాద్, పీబీ సిద్ధార్థ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ పాల్గొన్నారు.

ఆశ్రమాల ఆక్రమణల భూములపై చర్చించాలి

● నార్నె వెంకట సుబ్బయ్య

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దొంగబాబాలు ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆశ్రమాల పేరుతో అటవీ భూములు, చెరువు, పోరంబోకు, దళితులకు చెందిన అసైన్డ్ భూములు, శ్మశానం భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. 20 ఏళ్లకుపైగా దొంగబాబాల ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లాలోని బియ్యెన్ కండ్రిక మండలంలో సర్వే నంబర్ 295లోని రూ.కోట్ల విలువైన అంజూర్ ఫారెస్ట్ భూమిని కల్కి ట్రస్ట్ నిర్వాహకులు 21 ఎకరాలు ఆక్రమించారన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలో రామదూత అనే స్వామి చేవూరులోని సర్వే నంబర్ 879లోని భూమిని ఆక్రమించి ఆశ్రమం పేరుతో యాజ్ఞలు, యాగాలు చేస్తున్నారన్నారు. దీనిపై తమ పోరాటం వల్ల 2021లో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినా నేటికి స్వాధీనం చేసుకోలేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.లక్ష్మీనారాయణ, జీవీ.రంగారెడ్డి, మైత్రేయబాస్కర్ పాల్గొన్నారు.



దుర్గగుడిలో నిర్వహించిన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవంలో మంగళసూత్రాలు చూపిస్తున్న అర్చకులు

వైభవంగా వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఫాల్గుణ శుద్ధ షష్టి తిథిని పురస్కరించుకుని మాసావారీ ఆర్జిత సేవగా బుధవారం వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వేదోక్తంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల ప్రార్థనల మధ్య ఈ కల్యాణ ప్రక్రియను అర్చకులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వరుడు, వధువులుగా భావించి ఈ కల్యాణోత్సవ క్రియలను నిర్వహించారు. ముహూర్త సమయానికి జీలకర్ర, బెల్లం ధారణ ధరింపజేశారు. తొలుత స్వామివారి, అమ్మవార్ల మహా ప్రవర్లను చదివారు. వారి గోత్రాల మేరకు వధువులు, వరుడిని కీర్తిస్తూ వారి వంశ పారంపర్య వైశిష్ట్యాన్ని తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన, పూజ సకల శుభాలను ఇస్తుందని, రాహు, కేతు దోషాలను పరిహరిస్తుందని చెప్పారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ భక్తుల కోలాహలం మధ్యలో మంగళ సూత్ర ధారణ, తలంబ్రాల సమర్పణ చేశారు. చివరిలో మంగళహారతులిచ్చి కల్యాణోత్సవాన్ని ముగించారు. భక్తులు విశేషంగా పాల్గొని వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనుగ్రహం కోరుతూ ప్రార్థనలు చేశారు.

రెండో రోజుకు జాతీయ భద్రతా వారోత్సవాలు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏలోని ఓహెచ్ఎస్ (ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ) విభాగం ఆధ్వర్యంలో జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. రానున్న కాలంలో రాజధానికి అనేక మంది కార్మికులు వలస వచ్చే అవకాశం ఉందని వారి భద్రత క్షేత్రస్థాయిలో ఎంతో కీలకమని భావించిన అధికారులు ఈ వారోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ కార్యాలయంలో జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభు ప్రాథమిక చికిత్స విధానంతో పాటు సీపీఆర్‌పై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తొలి గంటలోనే మనం తీసుకొనే చర్యలే కీలకమన్నారు. సీఆర్‌డీఏ ఓఎం వల్లభనేని శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ అజయ్, ఓహెచ్ఎస్ సీనియర్ స్పెషలిస్టు గోపీకృష్ణ, పాల్ సుధాకర్, ప్రదీప్, అహరన్ పాల్ పాల్గొన్నారు. తుళ్లూరులోనూ భద్రతపై అవగాహన తరగతులు నిర్వహించారు. సీఆర్‌డీఏ యూనిట్ ఆఫీసులో నిర్వహించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి అనే అంశంపై గుంటూరు డీపీఎంవో డాక్టర్ సిహెచ్.రత్నమోహన్ అవగాహన కల్పిస్తే, సీపీఆర్‌పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసన్ విభాగ అధికారి డాక్టర్ రాధికా రాణి చంద్ర అవగాహన కల్పించారు. తుళ్లూరు పీహెచ్‌సీలోని మెడికల్ అధికారులు దాసరి శ్రీనివాస్, ఎన్.వసుంధరతో పాటు ఓహెచ్ఎస్ స్పెషలిస్టు బి.హరికృష్ణ, ఆశా వర్కర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, విలేజ్ లెవల్ వలెంటీర్లు పాల్గొన్నారు.

నేడు అగ్నిప్రమాదాలపై అవగాహన

జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం లెనిన్‌సెంటర్‌లోని సీఆర్‌డీఏ ఆఫీసుతో పాటు తుళ్లూరులోని యూనిట్ ఆఫీసులో ఫైర్ యాక్సిడెంట్‌పై మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి కల్పన, వేతన లక్ష్యాలను చేరుకోవాల్సిందే: కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో వేతనదారులకు పనికల్పించడంలోనూ, దినసరి వేతనం రూ.300 వచ్చేలా చూడటంలోనూ నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి డ్వామా అధికారులతో కలిసి ఎండీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. సగటు వేతనం విషయంలో పరిస్థితి మెరుగుపడిందని, వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించడంలో పురోగతి చూపాలన్నారు. రోజుకు సగటున రూ.300 పొందే హక్కు వేతనదారులకు వుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. వేసవిలో ఉదయాన్నే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సీపీవో వై.శ్రీలత పాల్గొన్నారు.

గిరిజన పెయింటింగ్స్‌కు ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో పదేళ్లకు పైబడి నివసిస్తున్న ఆసక్తి గల గిరిజనుల నుంచి ఒక రోజు రాష్ట్రస్థాయి గిరిజన పెయింటింగ్స్/ఆర్ట్ పోటీలు మరియు ప్రముఖ గిరిజన కళాకారులకు విశాఖపట్నం టీసీఆర్ అండ్ టీఎం వారి అధ్వర్యంలో మార్చి 12న సన్మానం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో పెయింటింగ్ పోటీ - ఈవెంట్ / కార్యకలాపం ఈ క్రింది థీమ్‌లపై దృష్టి పెడుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో నివసిస్తున్న గిరిజనులలో పాల్గొనుటకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను కార్యాలయంలో ఈ నెల 8 లోగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. డోరునెం. 48-9-10/1, గుణదల, విజయవాడ, ఎన్టీఆర్‌జిల్లా, ఫోన్ నెం.9490957017.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 6 మార్చి 2025

స్ఫూర్తి





ఆరేళ్ల పిల్లను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమె... ఆ బాధ నుంచి బయటపడటానికి అల్లికలు మొదలుపెట్టింది. ఆ అభిరుచే ఆమెను పారిశ్రామికవేత్తను చేసింది. కాలక్షేపానికి ఇంట్లో మొదలైన వ్యాపకం... ఇప్పుడు ఎనిమిది కోట్ల ఆదాయం తెచ్చే సంస్థగా మారింది. భర్తతో కలిసి 'మ్యాజిక్ నీడిల్స్' నెలకొల్పి... మూడు వందల మంది అట్టడుగు వర్గాల మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ముంబయికి చెందిన ఇద్దరు పిల్లల తల్లి హీనా పటేల్ విజయ గాథ ఇది.

అభిరుచితో మ్యాజిక్

"అది 2011. నా జీవితంలోనే అత్యంత బాధాకరమైన సంవత్సరం. నా ఆరేళ్ల పాప మూర్ఛ వ్యాధితో మమ్మల్ని వదిలి వెళ్లిపోయింది. నా గుండె ఆగలేదు... కానీ నేను జీవచ్ఛవంలా మారిపోయాను. కళ్లు తెరిచినా మూసినా నా కూతురు కళ్ల ముందు మెదులుతుండేది. నా పరిస్థితి చూసి మావారు కల్పేష్, ఇంట్లోవాళ్లు ఆందోళన చెందేవారు. నావల్ల వాళ్లందరూ బాధపడటం నాకు నచ్చలేదు. ఆ బాధ నుంచి బయటకు రావడానికి ప్రయత్నించాను. అందులో భాగంగానే స్వెటర్లు, టోపీలు అల్లడం మొదలుపెట్టాను. కాలేజీ రోజుల్లో అప్పుడప్పుడూ అల్లుతుండేదాన్ని. క్రమంగా అల్లిక నా అభిరుచిగా మారిపోయింది. అదే సమయంలో ఐవీఎఫ్ ద్వారా పిల్లను కనాలనుకున్నాను. దూరమైన మా అమ్మాయి మళ్లీ మా ఇంట పుడుతుందనే ఆశ నాది. అప్పట్లో నేను ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగం చేసేదాన్ని. గర్భవతిని కావడంతో పనికి బ్రేక్ ఇచ్చాను. కాలక్షేపంగా అల్లికలు కొనసాగించాను.

కవలలు పుట్టాక...

ఈసారి నాకు కవలలు పుట్టారు. వాళ్లను చూసుకోవడం కోసం అన్నీ ఆపేసి ఇంటికే పరిమితమయ్యాను. పిల్లలకు రెండున్నరేళ్లు వచ్చాక వాళ్లను ప్లే స్కూల్‌కు పంపించాను. దాంతో నాకు మళ్లీ కాస్త ఖాళీ సమయం లభించింది. అటకెక్కిన అల్లికలను తిరిగి మొదలుపెట్టాను. ఊలు, సూదులు ఆర్డర్ చేశాను. యూట్యూబ్‌లో చూసి స్వెటర్లు, టోపీల వంటివి ఎలా అల్లాలో నేర్చుకున్నాను. నాకు వచ్చినంతలో రెండు స్వెటర్లు అల్లాను. వాటిని నా పిల్లలకు వేసి ఫొటోలు తీసి, వాటిని నా స్నేహితుల వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశాను. అవి చూసి వాళ్లు ఫిదా అయ్యారు. రోజుకు ఒకటి చొప్పున మరికొన్ని వెరైటీలు రూపొందించాను. వాటిని ఫేస్‌బుక్‌లో పెట్టమని స్నేహితులు చెప్పారు. దాంతో మావారు నా కోసం ఒక ఎఫ్‌బీ పేజీ తెరిచారు. అందులో కొన్ని క్యాప్‌ల ఫొటోలు అప్‌లోడ్ చేస్తే అనూహ్య స్పందన వచ్చింది. 800 మంది బాగున్నాయంటూ కామెంట్లు పెట్టారు.

అలా మొదలైంది...

అదే ఏడాది నా అల్లికలు ప్రముఖ బ్రాండ్ 'ఫస్ట్ క్రై'ను ఆకర్షించాయి. వాళ్లు నన్ను సంప్రతించారు. తమ కంపెనీ ద్వారా నా ఉత్పత్తులు విక్రయించుకోవచ్చని చెప్పారు. అసలు వీటిని విక్రయించాలని గానీ, వ్యాపారం ఒకటి ప్రారంభించాలని కానీ నేను ఎప్పుడూ అనుకోలేదు. కానీ అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోదలుచుకో లేదు. కంపెనీ ప్రతిపాదన నాకు నచ్చింది. వెంటనే పని ప్రారంభించాను. దాని కోసం మాకూ ఒక బ్రాండ్ ఉండాలి కదా. అందుకే మావారి భాగస్వామ్యంతో 'మ్యాజిక్ నీడిల్స్' పేరుతో చిన్న సంస్థను నెలకొల్పాను. మావారు వివిధ కంపెనీలకు మార్కెటిం గ్ చేసేవారు. ఆయన సహకారంతో నాకు మార్కెటింగ్ బాధ తప్పింది.

అదే మా పెట్టుబడి...

మా ఉత్పత్తుల్లో నాణ్యమైన ఊలు మాత్రమే ఉపయోగిస్తాం. అదే మా పెట్టుబడి. మొదట్లో టర్కిష్ ఊలును విదేశాల నుంచి దిగుమతి చేసుకొనేవాళ్లం. నాణ్యమైన ఊలు కోసం ఎంత వెతికినా భారత్‌లో లభ్యంకాలేదు. దాంతో ఈ లోటును మేమే భర్తీ చేయాలని భావించాం. దాని కోసం అత్యంత నాణ్యమైన ఊలు దారాలు సరఫరా చేసేందుకు 'హాబీ స్టోర్' పేరిట ఒక బ్రాండ్‌ను తెచ్చాం. ఊలు సేకరించి, మేమే ప్రపంచ స్థాయి నూలు దారాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. దీంతో మా వ్యాపారం మరింత విస్తరించింది. అమెజాన్, మింత్ర, నైకా తదితర ప్రముఖ ఈకామర్స్ సంస్థల్లో మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. మా వెబ్‌సైట్‌ను నెలకు దాదాపు లక్ష మంది సందర్శిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి గానూ ఎనిమిదిన్న కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇది ఒక మహిళగా, మహిళల సాయంతో నేను సాధించిన విజయం.



మూడొందల మంది మహిళలు...

ఆరంభంలో నేనొక్కదాన్నే అల్లేదాన్ని. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. పని భారం అధికమైంది. దాంతో వేరెవరినైనా సహాయంగా పెట్టుకోవాలనుకున్నాను. పేద మహిళలైతే వారికి ఉపాధి కల్పించినట్టు అవుతుంది కదా. అందుకే మొదట మా ఇంట్లో పని చేసి మానేసిన ప్రియను పిలిచాను. ఈ పని తనవల్ల కాదని వెనకడుగు వేసింది. నేను ధైర్యం చెప్పి, శిక్షణ ఇచ్చాను. కొద్ది రోజుల్లోనే తను మంచి నైపుణ్యం సంపాదించింది. ఇప్పుడు తనే నాకు అత్యంత నమ్మకమైన కళాకారిణి. కొత్తగా చేరేవారికి కూడా శిక్షణ ఇస్తోంది. ముంబయిలోని మా ఇంటికి సమీపంలో బస్తీ ఉంది. అక్కడ ఎన్నో పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రియ సహకారంతో ఆ ప్రాంతంలోని మహిళలను సంప్రతించాను. మొదట్లో వారు ఒప్పుకోలేదు. ముఖ్యంగా ఇల్లు వదిలి పని చేయడానికి వెనుకాడారు. అలాంటివారికి ఇంటి వద్దనుంచే పని చేసుకొనే వెసులుబాటు కల్పించాను. శిక్షణ ఇచ్చాను. ఇప్పుడు ఆ ఒక్క బస్తీ నుంచే 150 మంది మహిళలు మా సంస్థలో పని చేస్తున్నారు. మొత్తం మూడొందల మంది ఆడవారు మా ద్వారా ఉపాధి పొందుతున్నారు. గౌరవప్రదమైన జీవితం గడపగలు గుతున్నారు. వీరిలో హిమాచల్ ప్రదేశ్ నుంచి యాభైమంది, కోల్‌కతా నుంచి యాభైమంది ఉన్నారు. ప్రియ అయితే కంప్యూటర్స్ నేర్చుకొని తనే ఒక కంపెనీ ప్రారంభించాలనే ఆలోచనలో ఉంది. నేను కోరుకున్నది ఇలాంటి పురోభివృద్ధే. తను నా బిడ్డలాంటిది. ఇలా ఎందరో పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు. ఇంతకంటే సంతృప్తి, సంతోషం ఏముంటుంది!

అప్పట్లో మహిళలకు స్వేచ్ఛ మన దేశంలోనే ఉండేది!



భారత ఉపఖండ చరిత్రలో 18వ శతాబ్దానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మొఘల్ సామ్రాజ్యం క్షీణించటంతో అనేక మంది రాజులు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అదే సమయంలో మన దేశంలో బ్రిటిష్‌వారి ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో- అవధ్ రాజ్యం కళలకు కేంద్రబిందువు అయింది. ఆ రోజుల్లోని పరిస్థితుల గురించి, నాటి రాజకీయాలలో మహిళల పాత్ర గురించి ప్రముఖ చరిత్రకారిణి, నవలా రచయిత ఐరా ముఖోటి... 'ది లయన్ అండ్ లిల్లీ- ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ అవధ్' అనే పుస్తకం రాశారు. ఆ విశేషాలను ఆమె 'నవ్య'తో పంచుకున్నారు.

18వ శతాబ్దంలో అనేక రాజ్యాలు ఉండగా... మీరు అవధ్ చరిత్రను ఎంపిక చేసుకోవటం వెనుక ఉన్న కారణం ఏమిటి?

ఆ శతాబ్దంలో... భారత ఉపఖండంలో అవధ్‌కు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. మొఘల్ సామ్రాజ్య పతనం తర్వాత అవధ్ కళలకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారింది. అంతేకాకుండా... ఆ రాజ్య పరిపాలనను రాణులు ప్రభావితం చేశారు. కొన్ని లక్షల మంది కళాకారులు అవధ్ రాజ్యంలో ఉండేవారు. దీనిపై చరిత్రకారులు ఇప్పటివరకూ పెద్దగా దృష్టి సారించలేదు. అలాగే... అవధ్‌పై ఆధిపత్యం కోసం బ్రిటిష్ వారికి ఫ్రెంచ్ వారికి మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధాలు చాలా కీలకమైనవి. వీటి ప్రభావం మన దేశ రాజకీయాలపైనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఉంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని అవధ్ గురించి ఈ పుస్తకం రాశాను.

'ఆనాటి మన దేశంలోని రాజ్యాల మీద ఫ్రెంచ్ పాలకుల ప్రభావం' అనే అంశంపై మీకు ఎందుకు ఆసక్తి కలిగింది?

మన దేశ చరిత్రను విదేశీయులు తమ కోణం నుంచి నమోదు చేస్తూ వచ్చారు. ఇప్పుడు మనం వెనక్కి తిరిగి చూస్తే- 17, 18, 19 శతాబ్దాల చరిత్ర ఎక్కువగా బ్రిటిష్ వారి కోణం నుంచే కనిపిస్తుంది. కానీ ఆ సమయంలో మన దేశంలో ఆధిపత్యం సంపాదించటానికి బ్రిటిష్ వారితో పాటు ఫ్రెంచ్ వారు కూడా పోటీ పడ్డారు. అయితే దీని గురించి ఇప్పటి వరకూ ఎవరూ ఎక్కువగా మాట్లాడలేదు. ఆ కోణం నుంచి చూస్తే ఎలా ఉంటుందనే ఉద్దేశంతో... ఆనాటి రికార్డులను, పత్రాలను పరిశీలించటం ప్రారంభించాను. ఈ పుస్తకానికి అవే ఆధారం.

మొఘల్ కాలంలో రాజ్యాలను పాలించిన రాణులు తక్కువ మంది కనబడతారు. ఆ సమయంలో రాజ్యపాలనలో మహిళలు ఎలాంటి పాత్ర పోషించేవారు?

అవధ్ చరిత్రను తిరగేస్తే మనకు అనేక ఆసక్తికరమైన అంశాలు కనబడతాయి. మొఘల్ పరిపాలనా సమయంలో మహిళలు సాంస్కృతిక అంశాలలోనే ముఖ్య పాత్ర పోషిస్తూ ఉండేవారు. కుటుంబ వ్యవహారాల్లో కానీ, రాజకీయ వ్యవహారాల్లో కానీ వారి పాత్ర తక్కువగా ఉండేది. నూర్జహాన్ లాంటి చాలా కొద్దిమంది రాణులను మనం చూడవచ్చు. కానీ అవధ్ రాజ్యంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉండేవి. మహిళలు రాజకీయాంశాలలో కూడా చురుకైన పాత్ర పోషించేవారు. ఇతర రాజకుటుంబాల వారితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేవారు. పెళ్లిళ్లు కుదిర్చేవారు. విధాన నిర్ణయాలను తీసుకోవటంలో కూడా ముఖ్య పాత్ర పోషించేవారు. అవధ్ రాజు సాదర్‌జంగ్ భార్య నవాబ్ బేగం కావచ్చు, ఆమె కోడలు బహూ బేగం కావచ్చు... రాజ్య వ్యవహారాలలో చురుకుగా ఉండేవారు. తమ భర్తలు యుద్ధాలకు వెళ్లినప్పుడు వారి తరఫున రాజ్యానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేవారు. ఇక్కడ బహూ బేగం గురించి చెప్పుకోవాలి. ఒక రాణిగా ఆమె అనేక ప్రాంతాలను స్వయంగా పరిపాలించేది. ఈ విషయంలో ఆమెకు, అప్పటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్‌కు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అయినా ఆమె తగ్గలేదు. ఇక... అవధ్‌లో కొన్ని వేలమంది కళాకారులు పనిచేస్తూ ఉండేవారు. నర్తకీమణులు, గాయనీమణులు, చిత్రలేఖకులు, చేనేత పనివారు- ఇలా ఎంతో మందికి ఉపాధి లభించేది. ఈ కోణం నుంచి చూస్తే మహిళలకు అవధ్‌లో సముచిత స్థానమే ఉంది.

కొన్నిసార్లు చరిత్ర ఉన్నత వర్గాలకు చెందిన మహిళల గురించి మాత్రమే చెబుతుంది. సామాన్య ప్రజల గురించి చెప్పదు. మీ పరిశోధనలో సామాన్య మహిళలు ఎలా జీవించారో గుర్తించారా?

దురదృష్టమేమిటంటే... ఒకప్పుడు చరిత్రలో ముఖ్యమైన అంశాలను మాత్రమే నమోదు చేసేవారు. దీని వల్ల సామాన్యులకు సంబంధించిన వివరాలు ఎక్కువగా లభించవు. సామాన్య ప్రజలు, మహిళలు ఎలా జీవించేవారో, వారి జీవన ప్రమాణాలు ఎలా ఉండేవో మనకు తెలియదు. అయితే పరోక్షంగా కొన్ని విషయాలు తెలుసుకోగలుగుతాం. 18వ శతాబ్దంలో- బెంగాల్, బిహార్ మాదిరిగానే అవధ్ కూడా చాలా ధనిక ప్రాంతం. నవాబులు, బేగంల దగ్గర ఆర్థిక వనరులు విపరీతంగా ఉండేవి. వారు ఈ వనరులను కళల కోసం, ఇతర సామాజిక ప్రయోజనాల కోసం ఖర్చు పెట్టేవారు. అవధ్ రాజధానిలో చేనేత కార్మికులకు, నేత పనివారికి ప్రత్యేకమైన ప్రాంతం ఉండేది. ఇక్కడ పనిచేసేవారిలో ఎక్కువ మంది మహిళలే ఉండేవారు. వీరందరికీ వేతనాలు లభించేవి. వారు ఆ వేతనాలను తమ కుటుంబాలకోసం ఖర్చు పెట్టేవారు. ఈ కోణం నుంచి చూస్తే అవధ్‌లో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కువ ఉందనే చెప్పవచ్చు.

మన దేశ చరిత్రను జాగ్రత్తగా గమనిస్తే- విదేశీ పాలకులలో మహిళలు ఎవరు కనిపించరు. ఒక మహిళా చరిత్రకారిణిగా దీనిపై మీ అభిప్రాయమేమిటి?

ఇది చాలా ఆసక్తికరమైన అంశం. ఆ రోజుల్లో బ్రిటన్‌లో కానీ, ఫ్రాన్స్‌లో కానీ, పోర్చుగల్‌లో కానీ పురుషాధిక్య సమాజాలే ఉండేవి. అక్కడి మహిళలకు మన దేశంలోని మహిళలకు ఉన్నంత స్వేచ్ఛ కూడా ఉండేది కాదు. వారి సమాజాలలో మహిళలు పెళ్లికాక ముందు తండ్రి ఆధీనంలో ఉండేవారు. పెళ్లిఅయిన తర్వాత భర్త ఆధీనంలో ఉండేవారు. అతి తక్కువమంది మహిళలు చదువుకొనేవారు. అందువల్ల మనకు ఆ సమాజాల్లో అధికార హోదాల్లో మహిళలు కనిపించరు. ఇక్కడో ఆసక్తికరమైన విషయం చెప్పాలి. పెళ్లి సమయంలో పుట్టింటివారు తమ ఆడ పిల్లలకు ఆస్తులు ఇవ్వటం పరిపాటి. బ్రిటిష్ చట్టాల ప్రకారం పెళ్లి సమయంలో పుట్టింటివారు ఇచ్చిన ఆస్తులపై ఆడపిల్లలకు ఎటువంటి అధికారం ఉండేది కాదు. పెళ్లి అయిన వెంటనే ఆ ఆస్తులపై అధికారం భర్తలకు బదలాయింపు జరిగేది. ఇదే సమయంలో మన దేశంలో పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తులపై అధికారం మహిళలకే ఉండేది. నూర్జహాన్, ముంతాజ్ బేగం లాంటివారు కూడా తమ పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తుల మీద అధికారాన్ని చెలాయించేవారు. ఈ పద్ధతిని చూసి బ్రిటిష్‌వారు ఒక విధంగా దిగ్భ్రాంతికి గురయ్యారని చెప్పవచ్చు.

• సివిఎల్ఎన్ ప్రసాద్

పెదవులు తేమగా...

గాలి, ఎండ, వాతావరణ కాలుష్యం వల్ల పెదవులు పొడిబారి నల్లగా మారుతుంటాయి. ఇలా నిర్జీవంగా మారిన పెదవులను కొన్ని చిట్కాలతో అందంగా మార్చుకోవచ్చు.

- ఒక గిన్నెలో ఒక చెంచా తేనె, అర చెంచా దానిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు పట్టించాలి. పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత నీటితో శుభ్రం చేసుకుని లిప్‌బామ్ రాసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే పెదవులు తేమతో నిండి ఆరోగ్యంగా కనిపిస్తాయి.
- పెదవులకు తరచూ పేరిన నెయ్యి, వెన్న, పాల మీగడ రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.
- ఒక చెంచా కాఫీ పొడిలో అర చెంచా కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. ఈ పేస్టుని పెదవులకు పట్టించి అయిదు నిమిషాల తరవాత వేళ్లతో మెల్లగా రుద్దితే మృతకణాలన్నీ తొలగిపోతాయి.
- ఒక గిన్నెలో ఒక చెంచా పంచదార, అరచెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి రెండు నిమిషాలు ఒకే దిశలో మర్దన చేయాలి. తరవాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే పెదవులపై ఉండే చర్మపు పొరల్లో తేమ నిండుతుంది.
- ఒక చెంచా దాల్చినచెక్క పొడిలో అర చెంచా తేనె కలిపి..... ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకునేముందు పెదవులకు రాయాలి. ఉదయాన్నే చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే పెదవులకు రక్తప్రసరణ మెరుగవుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బీట్‌రూట్ పేస్టు, ఒక చెంచా పంచదార, అరచెంచా కొబ్బరినూనె వేసి కలపాలి.
ఈ మిశ్రమాన్ని పెదవులకు పట్టించి రెండు నిమిషాలు సున్నితంగా రుద్దాలి. పొడిబారిన చర్మం పొర తొలగిపోయి పెదవులు మృదువుగా మారతాయి.



- ఒక చెంచా బీట్‌రూట్ రసం, అర చెంచా పాలు, అరచెంచా తేనె కలిపిన మిశ్రమాన్ని పెదవులకు రాయాలి. పావుగంటసేపు ఆరిన తరవాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే ఎండవల్ల నల్లబడిన పెదవులు గులాబీ రంగులోకి మారతాయి.

కౌన్సెలింగ్

ఆ గడ్డలతో గర్భానికి చేటు ఏ మేరకు?

Q A

డాక్టర్! నా వయసు 28 సంవత్సరాలు. గర్భసంచిలో గడ్డలు ఉన్నాయని స్కానింగ్‌లో తెలిసింది. వీటి వల్ల గర్భం వచ్చే అవకాశాలు తగ్గుతాయా? ఒకవేళ గర్భం ధరిస్తే, సమస్యలేవైనా ఎదురవుతాయా?

- ఓ సోదరి, హైదరాబాద్

చిన్నపాటి ఫైబ్రాయిడ్ గడ్డలతో గర్భం దాల్చే అవకాశాలకు ఎలాంటి అవరోధం ఉండదు. సాధారణంగా ఫైబ్రాయిడ్ గడ్డలు చిన్నవిగా ఉంటాయి. పైగా వాటి వల్ల గర్భసంచి పరిమాణం తగ్గడం, ఫెలోపియన్ ట్యూబులకు అడ్డంకులు ఏర్పడడం ఎంతో అరుదు. అయితే ఇవే గడ్డలు పరిమాణంలో పెద్దవిగా ఉన్నా, లోపలి వైపుకు పెరుగుతున్నా, గర్భధారణలో ఇబ్బందులు తలెత్తవచ్చు. కొన్నిసార్లు గడ్డలు గర్భసంచి పైవైపు ఒక మూలలో పెరగవచ్చు. వాటి వల్ల ఫెలోపియన్ ట్యూబులో అవరోధాలు ఏర్పడి గర్భధారణ సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో పెద్ద ఫైబ్రాయిడ్ గడ్డల వల్ల, గర్భస్రావం జరగడం, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం లాంటివి కూడా జరగవచ్చు. ఫైబ్రాయిడ్స్‌తో గర్భం దాల్చినప్పుడు గడ్డలకు రక్తప్రసరణ పెరిగి వాటి పరిమాణం కూడా పెరిగి బాధ, అసౌకర్యం వేధించవచ్చు. అలాంటి సందర్భాల్లో ఆస్పత్రిలో చేరి నొప్పినివారణ చికిత్స తీసుకోవలసి వస్తుంది. ఫైబ్రాయిడ్స్ గర్భసంచి కింది భాగంలో



పెరిగితే, గర్భాశయంలో బిడ్డ అడ్డంగా లేదా తలకిందులుగా పెరిగి, సిజేరియన్ సర్జరీ చేయవలసి వస్తుంది. ఈ గడ్డల వల్ల సర్జరీ సమయంలో అధిక రక్తస్రావం జరిగే సమస్య కూడా ఉంటుంది. మీ విషయంలో థైరాయిడ్ గడ్డలు పెద్దవిగా ఉన్నా, లోపలి వైపు పెరుగుతున్నా లేదా వాటి వల్ల నెలసరిలో తీవ్ర రక్తస్రావం అవుతున్నా, నొప్పి వేధిస్తున్నా, సర్జరీతో ఫైబ్రాయిడ్స్‌ను తొలగించుకోవాలి. సర్జరీ జరిగిన ఆరు నెలల తర్వాత పిల్లల కోసం ప్రయత్నిస్తే, ఫైబ్రాయిడ్స్ తాలూకు ఇబ్బందులు తగ్గుతాయి. త్వరగా కోలుకోవడం కోసం కోత లేని కీహోల్ పద్ధతిలో, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ చేయించుకోవడం ఉత్తమం.

డాక్టర్ ప్రమత శిరీష
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్,
గైనకాలజీ, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ అండ్
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్.

సహజంగా బరువు తగ్గే మార్గాలు ఇవే...

అధిక బరువుతో పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. సహజ మార్గాల్లో సులభంగా బరువు తగ్గే చిట్కాలను ఇలా సూచిస్తున్నారు...

- ప్రతిరోజూ పావు చెంచా నల్ల జీలకర్ర లేదా కలోంజీని ఆహారంలో చేర్చుకుంటే మూడు నెలల్లో బరువు తగ్గవచ్చు.
- ఉదయం నిద్రలేవగానే పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా శొంఠి పొడి కలుపుకుని తాగితే శరీరంలోని కొవ్వులు కరగి బరువు తగ్గుతారు.
- ప్రతిరోజూ ఉదయం అల్పాహారం మానకూడదు. ఇందులో పాలు, గుడ్లు, వెజిటబుల్ సూప్, బ్రౌన్ బ్రెడ్, సలాడ్ ఉండేలా చూసుకోవాలి.
- భోజనం చేసిన గంట తరవాత రెండు వెల్లుల్లి రెబ్బలు నమిలి తిన్నా మంచి ఫలితం ఉంటుంది.
- పాలు, చక్కెర కలిపిన టీ, కాఫీ తాగడానికి బదులు నిమ్మరసం, తేనె కలిపిన గ్రీన్ టీ తాగితే శరీరంలోని వ్యర్థపదార్థాలన్నీ విసర్జితమవుతాయి. జీవక్రియలు వేగవంతమై శరీర బరువు క్రమంగా తగ్గుతుంది.
- దాహం వేసినప్పుడు మాత్రమే కాకుండా రెండు గంటలకు ఒకసారి ఒకగ్లాసు మంచినీరు తాగడం వల్ల జీర్ణాశయం పనితీరు మెరుగవుతుంది. తిన్న ఆహార పదార్థాలన్నీ త్వరగా జీర్ణమవుతాయి. మలబద్ధకం లేకుండా పొట్ట శుభ్రంగా ఉంటే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



- భోజనం వేళలను క్రమం తప్పకుండా పాటించాలి. రాత్రిపూట వీలైనంత త్వరగా భోజనం పూర్తి చేయాలి.
- ప్రోటీన్లు, పీచుపదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. నూనెలు, తీపి పదార్థాలు తినడం తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు తింటూ ఉంటే పోషకాలు అంది శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఊబకాయం తగ్గుతుంది.
- నిద్రలేమి కూడా అధిక బరువుకి కారణమవుతుంది. ప్రతిరోజూ కనీసం ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి.

పిల్లలకు క్రమశిక్షణ నేర్పిద్దాం!

తల్లిదండ్రులు ఓపికగా వ్యవహరిస్తేనే పిల్లలు చెప్పినమాట విని క్రమశిక్షణ నేర్చుకుంటారు. ఆడుతూ పాడుతూ పిల్లలను దారిలోకి తెచ్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు...

- పిల్లలను చీటికీ మాటికీ కోప్పడకుండా వాళ్లు చేసే పనులను గమనిస్తూ ఉండాలి. మొదట పిల్లలు చేసిన పనిని పొగిడి చిన్న బహుమతి ఇస్తే చాలు. తరవాత తల్లిదండ్రులు ఏమి చెప్పినా పిల్లలు వినడానికి సిద్ధంగా ఉంటారు.
- తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వాళ్లతో మాట్లాడుతూ ఆటలు ఆడించాలి. దీంతో పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే పిల్లలకు మంచి చెడూ వివరించి చెప్పాలి.
- పిల్లలు ఏ విషయమైనా చెబుతున్నప్పుడు శ్రద్ధగా వినాలి. తరవాత వాళ్లు అడిగే ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు చెప్పాలి. పిల్లలవైపు చూస్తూ మృదు స్వరంతో లాలనగా సంభాషించాలి. అప్పుడే తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని గుర్తుపెట్టుకోవాలనే భావన పిల్లల్లో కలుగుతుంది.
- పిల్లలతో ప్రేమగా, ప్రశాంతంగా, సహనంగా వ్యవహరించాలి. ఇదే క్రమంలో నైతిక విలువలు, మర్యాద, ఇచ్చి పుచ్చుకునే ధోరణి, స్నేహం, దయ, సహాయం లాంటి వాటి గురించి వివరించి చెప్పాలి. దీంతో పిల్లలు పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకోగల్గుతారు.
- సమయానికి పడుకోవడం, నిద్ర లేవడం, హోంవర్క్, పుస్తకాలు సర్దుకోవడం, వ్యక్తిగత శుభ్రతల గురించి పిల్లలకు తెలియజెప్పాలి. దీనివల్ల పిల్లలకు స్వీయ క్రమశిక్షణ అలవడుతుంది.
- ఇంటి పనుల్లో పిల్లలను భాగస్వాములను చేయాలి. స్నేహితులు, బంధువులతో మాట్లాడే విధానాన్ని వివరించి చెప్పాలి.
- స్కూల్ బ్యాగ్ సర్దుకోవడం, డైనింగ్ టేబుల్ క్లీన్ చేయడం, బట్టలు-బొమ్మలను నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచడం లాంటి పనులను పిల్లలకే వదిలివేస్తే వాళ్లలో బాధ్యత, స్వతంత్ర భావాలు పెరుగుతాయి. ముందుజాగ్రత్త అలవడుతుంది.



బిజినెస్

విజయవాడ ● గురువారం 6 మార్చి 2025

సిరిమంతుల భారతం!



6 శాతం వృద్ధితో దేశంలో 85,698 మంది బడా శ్రీమంతులు

- 191కి చేరిన కుబేరుల సంఖ్య
- వారి మొత్తం సంపద రూ.82.65 లక్షల కోట్లు
- నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో కోటి డాలర్లకు (రూ.87 కోట్లు) పైగా ఆస్తులు కలిగిన హై నెట్‌వర్త్ ఇండివిజువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) సంఖ్య గత ఏడాదిలో మరో 6 శాతం పెరిగి 85,698కి చేరుకుందని ప్రాపర్టీ కన్సల్టింగ్ కంపెనీ నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. 2023లో వీరి సంఖ్య 80,686గా నమోదైంది. బుధవారం సంస్థ విడుదల చేసిన 'ది వెల్త్ రిపోర్ట్ 2025' ప్రకారం.. గత ఏడాది చివరి నాటికి దేశంలోని బిలియనీర్ల (కనీసం 100 కోట్ల డాలర్లు లేదా రూ.8,700 కోట్ల సంపద కలిగిన వారు) సంఖ్య 191కి పెరిగింది. అంతక్రితం సంవత్సరంతో పోలిస్తే కొత్తగా 26 మంది బిలియనీర్లుగా ఎదిగారు. ఆ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- దేశంలో శ్రీమంతులు వేగంగా పెరుగుతున్నారు. 2028 నాటికి హెచ్‌ఎన్‌ఐల సంఖ్య 93,753కు చేరుకోవచ్చని అంచనా. దీర్ఘకాలంలో బలమైన వృద్ధి, పెరుగుతున్న పెట్టుబడి అవకాశాలతో పాటు లగ్జరీ ఉత్పత్తులు, సేవల మార్కెట్ పుంజుకోనుందని ఈ ట్రెండ్ నొక్కి చెబుతోంది. ప్రపంచ సంపద సృష్టిలో భారత్ కీలక దేశంగా మారనుంది.
- ప్రపంచంలోని మొత్తం హెచ్‌ఎన్‌ఐలలో 3.7 శాతం మంది భారతీయులే. హెచ్‌ఎన్‌ఐల విషయంలో అమెరికా (9.05 లక్షల మంది), చైనా (4.71 లక్షలు), జపాన్ (1.22 లక్షలు) తర్వాత నాలుగో స్థానం భారత్‌దే.
- దేశంలోని బిలియనీర్ల మొత్తం సంపద విలువ 95,000 కోట్ల డాలర్ల (రూ.82.65 లక్షల కోట్లు) స్థాయిలో ఉండవచ్చని అంచనా. బిలియనీర్ల మొత్తం సంపద విషయంలో అమెరికా (5.7 లక్షల కోట్ల డాలర్లు), చైనా (1.34 లక్షల కోట్ల డాలర్లు) తర్వాత మూడో స్థానం భారత్‌దే.

విలాస గృహాల ధరల పెరుగుదలలో ఢిల్లీకి 18వ స్థానం

గత ఏడాదికిగాను ప్రపంచంలోని 100 నగరాల్లో విలాస గృహాల ధరల వార్షిక పెరుగుదల విషయంలో ఢిల్లీ 18వ స్థానంలో నిలిచింది. ముంబై 21, బెంగళూరు 40వ స్థానంలో ఉన్నాయని నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. గత ఏడాది ఢిల్లీలో లగ్జరీ హౌసింగ్ ధరలు సగటున 6.7 శాతం పెరిగాయని తెలిపింది. 2023లో 37వ స్థానంలో ఉన్న ఢిల్లీ 2024లో 18వ స్థానానికి ఎగబాకగా.. బెంగళూరు 59 నుంచి 40వ స్థానానికి పుంజుకుంది. ముంబై మాత్రం 13వ స్థానం నుంచి 21వ స్థానానికి జారుకుంది.

లగ్జరీ వస్తువుల ధరలు తగ్గాయ్..

కొందరు శ్రీమంతులు కేవలం ప్రాపర్టీ, షేర్లు, బంగారంలోనే కాదు వ్యక్తిగత అభిరుచి మేరకు ప్రముఖ కళాకారులు గీసిన చిత్రపటాలు, అరుదుగా లభించే కళాకృతులు, వైన్, విస్కీ, వజ్రాలు, ఫర్నీచర్‌పైనా పెట్టుబడి పెడుతుంటారు. గత ఏడాది మాత్రం వీటి ధరలు తగ్గాయని నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. పెయింటింగ్స్ రేట్లు 18.3 శాతం, ఫైన్ వైన్, అరుదుగా లభించే విస్కీ ధరలు 9 శాతం చొప్పున తగ్గాయని తెలిపింది. అయితే లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్‌ల ధరలు మాత్రం 2.8 శాతం పెరిగాయని, జువెలరీ 2.3 శాతం, కాయిన్స్ 2.1 శాతం, లగ్జరీ వాచ్‌లు 1.7 శాతం, క్లాసిక్ కార్ల రేటు 1.2 శాతం వృద్ధి చెందాయని నైట్‌ఫ్రాంక్ నివేదికలో పేర్కొంది.

భారత్‌లో హెచ్‌ఎన్‌ఐల సంఖ్య అసాధారణ స్థాయిలో పెరుగుతోంది. భారతీయుల వ్యాపార సామర్థ్యం, ప్రపంచ అనుసంధానత, ఆధునిక పారిశ్రామిక రంగాలు ఇందుకు దోహదపడుతున్నాయి. సంపద పెరుగుదలతోపాటు సిరిమంతుల పెట్టుబడుల ప్రాధాన్యాలూ విస్తరించాయి. రియల్ ఎస్టేట్ నుంచి ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల వరకు తమ పెట్టుబడులను వివిధీకరిస్తున్నారు. వచ్చే దశాబ్ద కాలంలో ప్రపంచ సంపద సృష్టిలో భారత్ మరింత కీలకం కానుంది.

– శిశిర్ బైజాల్, చైర్మన్/ఎండీ నైట్‌ఫ్రాంక్ ఇండియా

సింగపూర్ కంపెనీతో అరబిందో కటీఫ్

న్యూఢిల్లీ: పెంటావలెంట్ వ్యాక్సీన్ల అభివృద్ధి, ఉత్పత్తి కోసం సింగపూర్ కంపెనీ హిల్లేమాన్ ల్యాబ్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అరో వ్యాక్సీన్స్ రద్దు చేసుకుంది. అరో వ్యాక్సీన్స్ మాతృ సంస్థ అరబిందో ఫార్మా బుధవారం రెగ్యులేటరీ సంస్థలకు ఈ విషయం తెలిపింది. పిల్లల్లో ధనుర్వాతం, కోరింత దగ్గు వంటి ఐదు కీలక ప్రాణాంతక వ్యాధుల నివారణ కోసం ఈ వ్యాక్సీన్లను ఉపయోగిస్తారు. ఈ వ్యాక్సీన్ల అభివృద్ధి, ఉత్పత్తి కోసం 2023 సెప్టెంబరు 27న రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే ఏ కారణంతో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నదీ అరబిందో ఫార్మా వెల్లడించలేదు. ఈ ఒప్పందం రద్దు తమ పైనా, అనుబంధ కంపెనీల పైనా ఎలాంటి ప్రభావం చూపబోదని మాత్రం తెలిపింది.

ఫిబ్రవరిలో సేవల రంగం జోరు

న్యూఢిల్లీ: దేశీయ, అంతర్జాతీయ డిమాండు పెరిగిన కారణంగా సేవల రంగం ఫిబ్రవరిలో అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. హెచ్‌ఎస్‌బీసీ సేవల రంగం పీఎంఐ 26 నెలల కనిష్ఠ స్థాయి 56.5 పాయింట్ల నుంచి 59 పాయింట్లకు దూసుకుపోయింది. కొత్త వ్యాపారాల రాకతో సేవల రంగంలోని కంపెనీలు కొత్త నియామకాలు చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నాయని సర్వేలో తేలింది.

ఎట్టకేలకు నష్టాలకు తెర

రిలీఫ్ ర్యాలీతో రూ.7.97 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: రిలీఫ్ ర్యాలీతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ మంచి లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 740.30 పాయింట్ల లాభంతో 73,730.23 వద్ద, నిఫ్టీ 254.65 పాయింట్ల లాభంతో 22,337.30 వద్ద ముగిశాయి. దీంతో గత పది రోజుల నిఫ్టీ నష్టాలకు బ్రేక్ పడింది. ఈ రిలీఫ్ ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ బుధవారం రూ.7.97 లక్షల కోట్లు పెరిగి రూ.393.04 లక్షల కోట్లకు చేరింది. యుటిలిటీస్, పవర్, సర్వీసెస్, మెటల్, టెలికాం, కమోడిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లకు పెద్ద ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మంచి లాభాలతో ట్రేడవడం; మెక్సికో, కెనడాలపై విధించిన సుంకాలపై అమెరికా పునరాలోచిస్తోందన్న వార్తలు ఇందుకు తోడయ్యాయి. ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ మారకం రేటు బలహీనపడడం కూడా ఇందుకు కలిసొచ్చింది. అయితే ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం దీర్ఘకాలిక ప్రభావంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. దీంతో ఈ రిలీఫ్ ర్యాలీ ఎన్నాళ్లు కొనసాగుతుందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్సెల్‌సాఫ్ట్ నుంచి రూ.700 కోట్ల ఐపీఓ!

మైసూరు కేంద్రంగా పనిచేసే ఎక్సెల్ సాఫ్ట్ టెక్నాలజీస్ కంపెనీ రూ.700 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఇందు కోసం ఇప్పటికే సెబీకి దరఖాస్తు చేసింది. కొత్త షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.490 కోట్లు సమీకరించనున్నట్టు తెలిపింది. కొత్త షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్టు తెలిపింది.

హైదరాబాద్‌లో మరో నాలుగు ప్రాజెక్టులు

వైజాగ్, అమరావతికీ కాసాగ్రాండ్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చెన్నై కేంద్రంగా పనిచేసే ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ 'కాసాగ్రాండ్' హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కొంపల్లి, అత్తాపూర్, గౌడవల్లి, మంఖల్ వద్ద రూ.2,500 కోట్ల పెట్టుబడితో నాలుగు ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ప్రారంభించింది. ఇందులో రెండు విల్లా ప్రాజెక్టులు, రెండు హైరైజ్ కమ్యూనిటీ టవర్లని కంపెనీ ఎండీ అరుణ్ చెప్పారు. మూడు, నాలుగు బెడ్ రూమ్స్‌తో నిర్మించే ఈ నాలుగు ప్రాజెక్టులను ఏడాదిన్నర నుంచి మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. 2,000 నుంచి 2,800 ఎస్ఎఫ్‌టీ ఉండే ట్రిపుల్, ఫోర్ బెడ్‌రూమ్స్ ఫ్లాట్ల కనీస ధర రూ.1.4 కోట్లు, 450 గజాల్లో 4000 ఎస్ఎఫ్‌టీలో నిర్మించే విల్లాల ధర రూ.4.2 కోట్లు ఉంటుందని చెప్పారు.

ఏపీ పైనా దృష్టి: కాసాగ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌కి విస్తరించేందుకు కూడా సిద్ధమవుతోంది. ఇందుకోసం వైజాగ్, అమరావతిలో కొన్ని ప్రాంతాలను పరిశీలిస్తున్నట్టు అరుణ్ చెప్పారు. ఆరు నుంచి ఎనిమిది నెలల్లో ఈ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుత నాలుగు ప్రాజెక్టులకు తోడు హైదరాబాద్‌లో త్వరలో మరో నాలుగు ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ప్రారంభించే యోచన ఉందన్నారు. అత్యాధునిక సదుపాయాలతో నిర్మించే తమ ప్రాజెక్టులన్నీ ప్రీమియం మిడ్ సెగ్మెంట్‌లోకి వస్తాయన్నారు.

'డిస్‌ప్లే చిప్'ల తయారీలోకి టాటా

గుజరాత్‌లో ప్లాంట్ ఏర్పాటు

గాంధీనగర్: టాటా గ్రూప్‌నకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ డిస్‌ప్లే చిప్‌ల తయారీలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం తైవాన్‌కు చెందిన పీఎస్ఎంసీ, హైమాక్స్ టెక్నాలజీస్‌తో కలిసి గుజరాత్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు టాటా ఎలక్ట్రానిక్స్ సీఈఓ రణధీర్ ఠాకూర్ బుధవారం తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు కోసం గుజరాత్ ప్రభుత్వంతో అగ్రిమెంట్ కూడా కుదుర్చుకున్నట్లు ఐఈఎస్ఏ విజన్ సదస్సులో వెల్లడించారు. డిస్‌ప్లే చిప్‌లను టీవీలు, మొబైల్ ఫోన్ స్క్రీన్లు, కెమెరా ఇమేజ్ సెన్సర్లు, ఎల్ఈడీలు, ఓఎల్ఈడీ ఉత్పత్తుల్లో విరివిగా వాడతారు. అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్ సైతం గుజరాత్‌లో డిస్‌ప్లే చిప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ, ఆ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ఇంకా అనుమతులు మంజూరు చేయలేదు.

ప్లాంట్‌కు ఆర్థిక మద్దతు కోసం ఒప్పందం: రూ.91,000 కోట్ల పెట్టుబడులతో గుజరాత్‌లో ఏర్పాటు చేయబోతున్న సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్‌కు ఆర్థిక మద్దతు కోసం టాటా ఎలక్ట్రానిక్స్, టాటా సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు బుధవారం ఇండియా సెమీకండక్టర్ మిషన్‌తో (ఐఎస్ఎం) ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఐఎస్ఎం ద్వారా కేంద్రం అర్హత కలిగిన ప్రాజెక్టులకు వ్యయాల్లో 50 శాతం ఆర్థిక మద్దతు కల్పించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	430
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	443	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	101
వరంగల్	85	గుంటూరు	95
కరీంనగర్	85	ఒంగోలు	95
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	89
కర్నూలు	85	నెల్లూరు	94
విశాఖపట్నం	100	అనంతపురం	94
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,980 ▲	80,650 ▲	1,07,000 ▲
విజయవాడ	89,000 ▼	84,250 ▲	98,500 ▲
విశాఖపట్నం	86,340 ▼	79,150 ▼	97,490 ▲
రాజమండ్రి	87,820 ▲	80,500 ▲	98,200 ▲
ప్రొద్దుటూరు	88,400 ▲	81,360 ▲	98,000 ▲
ముంబై	86,300 ▼	79,050 ▼	95,990 ▲

స్పోర్ట్స్

కివీస్ వచ్చేసింది

భారత్‌తో ఫైనల్‌కు సై

- రచిన్, కేన్ శతక హోరు
- సెమీస్‌లో దక్షిణాఫ్రికా చిత్తు
- మిల్లర్ సెంచరీ వృథా

చాంపియన్స్ ట్రోఫీ



మిల్లర్ (100 నాటౌట్)



రచిన్ రవీంద్ర (108)

కేన్ విలియమ్సన్ (102)

లాహోర్: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో అదరగొట్టిన న్యూజిలాండ్ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఫైనల్‌కు దూసుకెళ్లగా.. దక్షిణాఫ్రికా మరోసారి నాకౌట్ మ్యాచ్‌లో ఒత్తిడికి చిత్తయింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో భారత్‌తో అమీతుమీకి కివీస్ సిద్ధమైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (101 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 108), కేన్ విలియమ్సన్ (94 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102) సెంచరీల మోతతో.. బుధవారం జరిగిన రెండో సెమీస్‌లో కివీస్ 50 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ టోర్నీ చరిత్రలోనే అత్యధికంగా 362/6 స్కోరు సాధించింది. ఎన్‌గిడి 3, రబాడ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో డేవిడ్ మిల్లర్ (67 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100 నాటౌట్) శతకంతో పోరాడినా.. దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 312 పరుగులు మాత్రమే చేయగలిగింది. శాంట్నర్ 3, హెన్రీ, ఫిలిప్స్ చెరో 2 వికెట్లు తీశారు.

రచిన్, కేన్ విజృంభణ: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కివీస్.. పవర్‌ప్లేలోనే ఓపెనర్ యంగ్ (21) వికెట్‌ను కోల్పోయింది. అయితే, మరో ఓపెనర్ రచిన్, విలియమ్సన్ సఫారీ బౌలర్లను ఆటాడుకొన్నారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 164 రన్స్ జోడించడంతో.. కివీస్ కొండంత స్కోరు చేసింది. శతకం సాధించిన రచిన్‌ను అవుట్ చేసిన రబాడ.. జట్టుకు ఊరటనిచ్చాడు. డెత్ ఓవర్లలో డారెల్ మిచెల్ (49), గ్లెన్ ఫిలిప్స్ (49 నాటౌట్) బ్యాట్లను ఝుళిపించడంతో జట్టు స్కోరు 360 దాటింది.

దెబ్బకొట్టిన శాంట్నర్: భారీ ఛేదనను దక్షిణాఫ్రికా ఆశావహంగా ఆరంభించినా.. కెప్టెన్ శాంట్నర్ (3/43) కీలక సమయంలో మూడు వికెట్లతో దెబ్బ కొట్టడంతో సఫారీల ఆట ఒక్కసారిగా గతి తప్పింది. ఓపెనర్ రికెల్టన్ (17)ను హెన్రీ స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. కానీ, బవుమా (56), డుస్సెన్ (69) రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, అర్ధ శతకం సాధించిన బవుమాను శాంట్నర్ అవుట్ చేశాడు. అప్పటికి జట్టు స్కోరు 23 ఓవర్లలో 128/2. మిడిలార్డర్‌లో హిట్టర్లు ఉండడంతో మ్యాచ్ ఆసక్తిగా మారుతుందనుకున్నా.. డుస్సెన్‌తోపాటు క్లాసెన్ (3)ను శాంట్నర్ పెవిలియన్ చేర్చడంతో సౌతాఫ్రికా 167/4తో కష్టాల్లో పడింది. ఈదశలో కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తూ.. బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. నిలకడగా ఆడుతున్న మార్‌క్రమ్ (31)ను రచిన్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో.. మ్యాచ్ కివీస్‌వైపు మొగ్గింది. మల్డర్ (8), జెన్సన్ (3), కేశవ్ మహరాజ్ (1) సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. చివరి బంతికి సెంచరీ చేసిన మిల్లర్.. ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాడు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: యంగ్ (సి) మార్‌క్రమ్ (బి) ఎన్‌గిడి 21, రచిన్ (సి) క్లాసెన్ (బి) రబాడ 108, విలియమ్సన్ (సి) ఎన్‌గిడి (బి) మల్డర్ 102, మిచెల్ (సి) రబాడ (బి) ఎన్‌గిడి 49, లాథమ్ (బి) రబాడ 4, ఫిలిప్స్ (నాటౌట్) 49, బ్రేస్‌వెల్ (సి) రికెల్టన్ (బి) ఎన్‌గిడి 16, శాంట్నర్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 50 ఓవర్లలో 362/6; వికెట్ల పతనం:** 1-48, 2-212, 3-251, 4-257, 5-314, 6-360; **బౌలింగ్:** జెన్సన్ 10-0-79-0, ఎన్‌గిడి 10-0-72-3, రబాడ 10-1-70-2, ముల్డర్ 6-0-48-1, కేశవ్ 10-0-65-0, మార్‌క్రమ్ 4-0-23-0.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (సి) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 17, బవుమా (సి) విలియమ్సన్ (బి) శాంట్నర్ 56, డుస్సెన్ (బి) శాంట్నర్ 69, మార్‌క్రమ్ (సి అండ్ బి) రచిన్ 31, క్లాసెన్ (సి) హెన్రీ (బి) శాంట్నర్ 3, మిల్లర్ (నాటౌట్) 100, మల్డర్ (సి) రచిన్ (బి) బ్రేస్‌వెల్ 8, జెన్సన్ (ఎల్బీ) ఫిలిప్స్ 3, కేశవ్ (సి) లాథమ్ (బి) ఫిలిప్స్ 1, రబాడ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 16, ఎన్‌గిడి (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 50 ఓవర్లలో 312/9; వికెట్ల పతనం:** 1-20, 2-125, 3-161, 4-167, 5-189, 6-200, 7-212, 8-218, 9-256; **బౌలింగ్:** హెన్రీ 7-0-43-2, జేమిసన్ 7-1-57-0, విల్ ఓరోర్క్ 8-0-69-0, బ్రేస్‌వెల్ 10-0-53-1, శాంట్నర్ 10-0-43-3, రచిన్ 5-0-20-1, ఫిలిప్స్ 3-0-27-2.

1 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా న్యూజిలాండ్ **(362/6)**. ఇదే టోర్నీలో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా **(356/5)** చేసిన రికార్డును కివీస్ బద్దలుకొట్టింది.

5 వన్డేల్లో రచిన్ రవీంద్ర సెంచరీలు. ఇవన్నీ ఐసీసీ టోర్నీల్లో సాధించినవే. 2023 వరల్డ్ కప్‌లో 3 శతకాలు బాదిన రచిన్.. ప్రస్తుత చాంపియన్స్ ట్రోఫీలో 2 సెంచరీలు కొట్టాడు. ఇలా ఐసీసీ టోర్నీలో ఐదు శతకాలు సాధించిన ఏకైక ఆటగాడిగా రచిన్ రికార్డులకెక్కాడు. బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మదుల్లా (4 సెంచరీలు)ను దాటాడు.

శరత్.. టీటీకి గుడ్‌బై



నెలాఖరులో జరిగే డబ్ల్యూటీటీ చివరిదని ప్రకటన

చెన్నై: భారత టీటీకి అంతర్జాతీయ సొబగులద్దిన ఆటగాడు. చైనా, కొరియా, జపాన్ దేశాల మేటి ప్లేయర్లకు ముచ్చెమటలు పట్టించిన వీరుడు. యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన తెలుగు అథ్లెట్. రెండు దశాబ్దాలకుపైగా కెరీర్‌లో ఎన్నో సంచలనాలు సృష్టించి దేశ టేబుల్ టెన్నిస్‌కు పర్యాయంగా నిలిచిన 42 ఏళ్ల ఆచంట శరత్ కమల్ ఆటకు వీడ్కోలు పలకనున్నాడు. 22 ఏళ్ల సుదీర్ఘ టీటీ కెరీర్ నుంచి ఈ నెలాఖరున రిటైర్ కానున్నట్టు బుధవారం వెల్లడించాడు. ఈనెల 25 నుంచి 30 వరకు ఇక్కడ జరిగే వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెడర్ టోర్నమెంట్ (డబ్ల్యూటీటీ) తనకు కెరీర్‌లో చివరిదని తెలిపాడు. ఆ టోర్నీ సందర్భంగా సొంతూళ్లో, కుటుంబ సభ్యులు, స్నేహితుల నడుమ ఆటకు గుడ్ బై చెప్పాలని తమిళనాడుకు చెందిన శరత్ నిర్ణయించుకున్నాడు.

అసామాన్య ఆటగాడు: కమల్ కెరీర్‌లో సాధించిన ఘనతలు లెక్కకు మిక్కిలి. అతడు అందుకున్న విజయాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో ఏకంగా 7 కామన్వెల్త్ స్వర్ణ పతకాలున్నాయి. ఆసియా క్రీడల్లో రెండు కాంస్యాలు దక్కించుకున్నాడు. ఒలింపిక్స్‌లో ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో శరత్ కమల్‌కు అరుదైన గౌరవం దక్కింది. క్రీడల ప్రారంభోత్సవంలో దేశ పతాకను చేబూని భారత బృందాన్ని నడిపించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఉత్సాహంతో మరో కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పాల్గొనాలని కమల్ భావించాడు. కానీ ఆ నిర్ణయాన్ని మార్చుకున్నాడు. 'భారీగా అభిమానులు హాజరయ్యే టోర్నీ సందర్భంగా నా ర్యాకెట్‌కు, బందన (మ్యాచ్‌ల సమయంలో కమల్ తలకు ధరించే కర్చీఫ్)కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించుకున్నా' అని శరత్ చెప్పాడు.


కమల్ కెరీర్ ఇలా..

- కామన్వెల్త్ స్వర్ణాలు-7, రజతాలు-3, కాంస్యాలు-3
- ఆసియా క్రీడలు- 2 కాంస్యాలు
- ఆసియా చాంపియన్‌షిప్- 4 కాంస్యాలు
- జాతీయ చాంపియన్‌షిప్- 10 సార్లు

అవార్డులు

పద్మశ్రీ, ఖేల్‌రత్న, అర్జున

వన్డేలకు స్మిత్ వీడ్కోలు



దుబాయ్: ఆస్ట్రేలియా తాత్కాలిక సారథి స్టీవెన్ స్మిత్ వన్డే క్రికెట్‌కు బుధవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఆసీస్ నాలుగు వికెట్లతో ఓడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 50 ఓవర్ల ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని స్మిత్ నిర్ణయించుకున్నాడు. అయితే 35 ఏళ్ల స్టీవ్.. టెస్టులు, టీ20లలో కొనసాగనున్నట్టు తెలిపాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ గాయంతో వైదొలగడంతో చాంపియన్స్ ట్రోఫీలో స్మిత్ సారథ్యం వహించాడు. మంగళవారం టీమిండియాతో మ్యాచ్ ముగియగానే..తన రిటైర్మెంట్ విషయాన్ని సహచరులకు స్మిత్ తెలిపాడు. 2015, 2023లో ఆస్ట్రేలియా జట్టు వన్డే వరల్డ్ కప్‌లు సాధించడంలో స్మిత్‌ది కీలక భూమిక. 2015, 2021లో 'ఆస్ట్రేలియా పురుషుల వన్డే ఆటగాడు' అవార్డులు అందుకున్నాడు. 2015లో 'ఐసీసీ వన్డే పురుషుల జట్టు'లో స్టీవ్‌కు చోటు దక్కింది. 2015లో ఆసీస్ వన్డే జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. మొత్తం 64 వన్డేల్లో స్మిత్ సారథ్యం వహించాడు. '2027 వన్డే ప్రపంచ కప్‌నకు సన్నాహకాలు ప్రారంభించాల్సిన తరుణం ఆసన్నమైంది. అందువల్ల నేను వైదొలగేందుకు ఇదే సరైన సమయమని భావించా' అని స్మిత్ చెప్పాడు. జూన్‌లో జరిగే వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో ఆడేందుకు ఎదురు చూస్తున్నట్టు తెలిపాడు. 2010లో లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్‌గా వెస్టిండీస్‌పై స్మిత్ వన్డే అరంగేట్రం చేశాడు. ఏళ్లుగా ఆస్ట్రేలియా బ్యాటింగ్‌కు స్మిత్ వెన్నుముకగా నిలిచాడు.

వన్డే కెరీర్ ఇలా..

మ్యాచ్‌లు	170
ఇన్నింగ్స్	154
పరుగులు	5800
అత్యధికస్కోరు	164
సగటు	43.28
శతకాలు	12
అర్ధ శతకాలు	35
వికెట్లు	28

డబ్ల్యూపీఎల్‌లో నేడు — యూపీ x ముంబై — రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

బరిలో పారాలింపిక్స్ పతక విజేతలు

20 నుంచి ఖేలో ఇండియా పారా క్రీడలు

న్యూఢిల్లీ: ఖేలో ఇండియా పారా క్రీడలకు దేశ రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఈనెల 20 నుంచి 27 వరకు ఈ గేమ్స్ జరగనున్నాయి. 2024 పారిస్ పారాలింపిక్స్, 2022 ఆసియా పారా క్రీడల్లో పతకాలు గెలిచిన హర్విందర్ సింగ్, ధరమ్‌వీర్, ప్రవీణ్ కుమార్‌లాంటి అంతర్జాతీయస్థాయి అథ్లెట్లు ఈ మెగా టోర్నీలో పోటీపడనున్నారు. ఆరు క్రీడాంశాలు.. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

వరల్డ్ పారా గ్రాండ్ ప్రీకి ఆంధ్ర అథ్లెట్లు



లలిత, రాము, రవి


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ పారా గ్రాండ్ ప్రీ పోటీలకు ముగ్గురు ఆంధ్ర అథ్లెట్లు ఎంపికయ్యారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆర్.రవి (అనకాపల్లి) షాట్‌పుట్, టి.రాము (శ్రీకాకుళం) షాట్‌పుట్, కె.లలిత (పార్వతీపురం మన్యం) 400, 1500 మీటర్ల పరుగులో పోటీపడనున్నారు.

కోహ్లీ ఓ స్థానం పైకి..

నాలుగో ర్యాంక్‌లో భారత స్టార్ — ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో క్లాస్ ఇన్నింగ్స్ ఆకట్టుకున్న విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఓ అడుగు ముందుకేశాడు. తాజా ర్యాంకింగ్స్‌లో విరాట్ ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. రోహిత్ శర్మ రెండు స్థానాలు కోల్పోయి ఐదో ర్యాంకులో ఉన్నాడు. శుభ్‌మన్ గిల్ నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, బాబర్ ఆజమ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శ్రేయాస్ అయ్యర్ ఓ స్థానం మెరుగై 8వ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల జాబితాలో షమి మూడు ర్యాంక్‌లు ఎగబాకి 11వ స్థానంలో, కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు చేజార్చుకొని 6వ ర్యాంక్‌లో ఉన్నారు. తీక్షణ టాప్ ర్యాంక్‌లో మార్పు లేదు. ఆల్‌రౌండర్లలో జడేజా 9వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్-10లో ఉన్నాడు. అఫ్ఘానిస్థాన్ స్టార్ అజ్మతుల్లా ఒమర్జాయ్ రెండు స్థానాలు ఎగబాకి నెంబర్‌వన్ స్థానాన్ని ఆక్రమించాడు.










ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● గురువారం 6 మార్చి 2025

కొత్త షెడ్యూల్‌లో...




రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్). చిత్రీకరణ ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. ఒడిస్సాలోని కోరపుట్‌లో రెండో షెడ్యూల్ మొదలైంది. ఈ నెలాఖరు వరకూ ఈ షెడ్యూల్ సాగనుంది. సినిమాలోని కీలక సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించనున్నారు. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా గురువారం ఒడిస్సాకు చేరుకుంటారట. కాగా, దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. మొదటి భాగాన్ని 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.



సూపర్ స్టార్ వద్దు... నయనతార చాలు

తమిళ నటి నయనతారను అభిమానులంతా 'లేడీ సూపర్‌స్టార్' అని పిలిచే విషయం తెలిసిందే. అయితే, తనను ఇకపై ఇలా పిలవొద్దని అభిమానులకు ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు నయనతార. "మీరంతా నన్ను లేడీ సూపర్‌స్టార్ అంటూ నాపై ఆదరాభిమానాలు చూపిస్తున్నారు. మీ ప్రేమకు జీవితాంతం రుణపడి ఉంటాను. కానీ దయచేసి నన్ను లేడీ సూపర్‌స్టార్ అని పిలవకండి. నన్ను 'నయనతార' అని పిలవండి. ఎందుకంటే ఆ పేరు నా హృదయానికి చేరువైనది. నటిగా, వ్యక్తిగా నన్ను ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం సెందిల్ నల్లసామి తెరకెక్కిస్తున్న 'రక్కయీ', యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'టాక్సిక్' చిత్రాల్లో నటిస్తున్నారు నయనతార.

మరోసారి కిస్సిక్



వెండితెరపైన హుషారైన స్టెప్పులతో అలరిస్తున్న కథానాయిక శ్రీలీల ఓ పార్టీలోనూ తన డ్యాన్స్‌తో సందడి చేశారు. బాలీవుడ్ కథానాయకుడు కార్తీక్ ఆర్యన్‌తో ఆమె 'ఆషికీ 3' చిత్రం చేస్తున్నారు. ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న షూటింగ్‌లో శ్రీలీల పాల్గొంటున్నారు. ఇటీవలే కార్తీక్ ఆర్యన్ తన సోదరి కృతిక తివారికి పార్టీ ఇచ్చారట. ఈ వేడుకకు హాజరైన శ్రీలీల 'పుష్ప 2' చిత్రంలోని 'కిస్సిక్' పాటతో పాటు మరికొన్ని హిందీ గీతాలకు స్టెప్పులేసి ఎంటర్‌టైన్ చేశారు. ఆమెతో పాటు కార్తీక్ ఆర్యన్ సైతం కాలు కదిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నితిన్‌తో శ్రీలీల నటించిన 'రాబిన్‌హుడ్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

సందేశంతో వినోదం



యువతను ఆకట్టుకునే చక్కని ప్రేమకథతో తెరకెక్కుతోన్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్నారు. సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారు. తరుణ్ భాస్కర్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషించారు. చిత్ర బృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈతరం యువత ఎదుర్కొంటున్న సంతాన లేమి సమస్యను ఇతివృత్తంగా చేసుకొని రూపొందించిన సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. మంచి సందేశంతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఉన్న చిత్రమిదని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, సినిమాటోగ్రఫీ: మహిరెడ్డి పండుగుల

మహిళలకు అంకితం



'ఇంతవరకూ ఎనిమిది సినిమాలకు సంగీత దర్శకత్వం వహించా. నిర్మాత అశోక్ సహకారంతో ఇప్పుడు దర్శకుడిగా మారాను. మహిళా దినోత్సవం సందర్భంగా విడుదలవుతున్న ఈ చిత్రాన్ని మహిళలకు అంకితం ఇస్తున్నాం' అన్నారు షెరాజ్ మెహ్దీ. ఆయన రూపొందించిన 'పౌరుషం' చిత్రం ఈ నెల 7న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నిర్మాత అశోక్ ఖుల్లార్ మాట్లాడుతూ 'ఇందులో రొమాన్స్, యాక్షన్, ఫ్యామిలీ డ్రామా అన్నీ ఉన్నాయి. ప్రపంచంలో ఆడవాళ్లు లేకుండా మగవాళ్లు లేరు. వాళ్ల సపోర్ట్‌తో మనం ముందుకు వెళ్లాలి అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమా బాగా వచ్చింది. మంచి కంటెంట్ కలిగిన ఈ చిత్రాన్ని ఆదరించమని కోరుతున్నాం' అన్నారు. సుమన్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, కుష్బూ జైన్, జ్యోతిరెడ్డి తదితరులు ఈ చిత్రంలో నటించారు.



సరికొత్త సైకో థ్రిల్లర్

సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటించిన 'ఆర్టిస్ట్' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. రతన్ రిషి దర్శకత్వంలో జేమ్స్ వాట్ కొమ్ము ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ 'అమెరికా నుంచి ఈ మూవీ కోసం ఎన్నో సార్లు ఇక్కడకు వచ్చాను. కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని నా కోరిక. మా సంస్థలో ఇది రెండో సినిమా. భవిష్యత్‌లో కూడా సినిమాలు తీస్తాను. సొసైటీకి కావాల్సిన మంచి కంటెంట్‌తో ఈ సినిమా తీశాం. మా చిత్రం నచ్చి మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ నెల 21న విడుదల చేస్తున్నారు' అని చెప్పారు. దర్శకుడు రతన్ రిషి మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త సైకో థ్రిల్లర్. సాధారణంగా ఓ హత్య జరిగిన తర్వాత కిల్లర్ ఎవరనేది పరిశోధన జరుగుతుంది. కానీ మా సినిమాలో విలన్ ఎవరో మొదటే చెప్పేసి భయపెట్టే ప్రయత్నం చేశాం. నాకు మంచి టీమ్ దొరికింది' అన్నారు.

సాయి తేజ్ సాహసాలు!



సాయి దుర్గతేజ్ కంప్లీట్ యాక్షన్ ప్యాక్డ్ పాత్రలో నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇటీవలే రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ కంపోజ్ చేసిన యాక్షన్ ఎపిసోడ్‌ను ఓ భారీ సెట్‌లో చిత్రీకరించారు. చాలా రిస్క్‌తో కూడుకున్న ఈ ఫైట్‌లో సాయి దుర్గ తేజ్ పాల్గొని అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ప్రస్తుతం దినేశ్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటను భారీ ఎత్తున చిత్రీకరిస్తున్నారు. వెయ్యి మంది డ్యాన్సర్లు ఇందులో పాల్గొనడం ఓ విశేషం. ఇటీవలి కాలంలో భారీ స్థాయిలో చిత్రీకరించిన పాటల్లో ఇదొకటి. రూ.125 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. 'హను-మాన్' చిత్రం తర్వాత కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రోహిత్ దర్శకుడు. ఐశ్వర్య లక్ష్మీ, జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర ముఖ్య తారాగణం.

మంచి కంటెంట్ ఉంటేనే సినిమా చూస్తున్నారు



- దిల్ రాజు

'పవన్‌కల్యాణ్ నటించిన 'తొలి ప్రేమ' చిత్రాన్ని డిస్ట్రిబ్యూషన్ చేసినప్పుడు ఐదేళ్ల సినిమా హక్కులు మా దగ్గర ఉండేవి. ఎప్పుడు డబ్బు అవసరమైతే అప్పుడు రీ రిలీజ్ చేస్తే మంచి అమౌంట్ వచ్చేది. నిజంగా అవన్నీ మిరాకిల్ డేస్. అలాగే ఇప్పుడు కూడా రీ రిలీజ్‌కు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు' అన్నారు దిల్ రాజు. వెంకటేశ్, మహేశ్ నటించిన 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రం ఈ నెల 7న మళ్లీ విడుదల చేస్తున్న సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ఈ సినిమా ఓటీటీలో ఉంది. చాలా మంది చూసేశారు. అయినా ఇప్పుడు మళ్లీ థియేటర్లకు చూడడానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారంటే కారణం .. మంచి కంటెంట్. ఇప్పటికే పది థియేటర్లు ఫుల్ అయ్యాయి. మంచి సినిమాలు తీస్తే జనం మళ్లీ మళ్లీ థియేటర్‌కు వస్తారని రీ రిలీజులు నిరూపిస్తున్నాయి. పన్నెండేళ్ల తర్వాత ఈ సినిమాను మళ్లీ జనంతో పాటు థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని ఉంది. అందుకే ఆ రోజు సుదర్శన్ లో మార్నింగ్ షో చూస్తా' అని చెప్పారు.

లుక్ లాకయ్యింది




రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో ఆయన పోషిస్తున్న లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. ఈ విషయాన్ని అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకున్నారు మేకర్స్. లుక్ టెస్ట్ పూర్తయ్యింది. అద్భుతమైన లుక్‌ను లాక్ చేశాం అని తెలిపారు. త్వరలోనే ఆయన తన పాత్ర కోసం చిత్రీకరణలో జాయిన్ అవుతారని.. రెగ్యులర్ షూట్‌లో పాల్గొంటారని చెప్పారు. ఈ సినిమాలో జాన్వీకపూర్ కథానాయిక. జగపతిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు.

దేవుడు మమ్మల్ని కాపాడతాడు



- కంగనా రనౌత్

కర్ణాటక డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ కన్నడ నటీనటులపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పరోక్షంగా స్పందించారు. 'ఎవరైనా సినిమా వాళ్ల నట్లు, బోల్టులు టైట్ చేయాలనుకుంటే, దేవుడు మమ్మల్ని కాపాడతాడు. భగవంతుడు కళాకారులందరికీ అండగా నిలబడతాడు" అని హీరోయిన్ రష్మికకు మద్దతుగా మాట్లాడారు. కర్ణాటకలోని శ్రీహోస మారిగుడి దేవస్థానానికి వచ్చిన సందర్భంగా కంగన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఇటీవలె శాండల్‌వుడ్ నటీ నటులపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నడ భూమి, భాష గురించి నటీనటులు పట్టించుకోవడం లేదని, అలాంటి వాళ్ల నట్లు, బోల్టులు టైట్ చేస్తానని హెచ్చరించారు. ఈ వేడుకకు నటి రష్మిక మందన్నను ఆహ్వానించినా ఆమె రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గౌడ గణిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



'ఆడుదాం ఆంధ్రా'లో అక్రమాలపై విచారణ: రాంప్రసాద్‌రెడ్డి



అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయని, మాజీ మంత్రి, అధికారులు అవినీతికి పాల్పడ్డారని దీనిపై సీఐడీ విచారణ జరపాలని బుధవారం టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు కోరారు. వైసీపీ ప్రభుత్వం రూ.119 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క క్రీడాకారుడినీ గుర్తించి, ప్రోత్సహించలేదని టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. దీనిపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రలో నిధుల దుర్వినియోగంపై స్వతంత్ర కమిటీతో విచారణ జరిపిస్తామని, 45 రోజుల్లో విచారణ పూర్తిచేసి నివేదికను సభకు ఇస్తామని చెప్పారు.

అనంతలో తాగునీటి సమస్య తీవ్రం

- అధ్వానంగా తయారైన విశాఖ-రాయగఢ్ రోడ్డు
- జీరో అవర్‌లో నియోజకవర్గ సమస్యల ప్రస్తావన

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల ప్రధాన సమస్యలను పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రస్తావించారు. ప్రాధాన్యతా ప్రాతిపదికన వాటిని పరిష్కరించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే సెరీ కల్చర్ ప్రోత్సాహకాలను పునరుద్ధరించాలని కోరారు. 'అనంతపురంలో తాగునీటి సమస్య పెరిగింది. రాప్తాడు నియోజకవర్గంలో 36 గ్రామ పంచాయతీల్లో సమస్య తీవ్రంగా ఉంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి' అని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన(ఆర్‌వీఎస్‌కేకే రంగారావు) మాట్లాడుతూ, 'విశాఖపట్నం- రాయగఢ్ రహదారి మధ్యలో రెండు చోట్ల అధ్వానంగా మారింది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి' అని కోరారు. గౌతు శిరీష రహదారుల దుస్థితిని ప్రస్తావించారు. రోడ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేసే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు జిల్లా కేంద్రంలో మాత్రమే ఏర్పాటు చేయడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని బెందాళం అశోక్ కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని శ్రీరామ్ రాజగోపాల్ కోరారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఆటోవాలాలను ఇబ్బంది పెడుతున్న జీవో 8 రద్దు చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమ కోరారు. గాజువాకలో స్టీల్ ప్లాంట్ కేటాయించినప్పుడు ఇచ్చిన ప్లాట్లపై తిరిగి సర్వే చేసి, సమగ్ర డేటా ఆన్‌లైన్‌లో ఉంచాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. గృహ నిర్మాణ పథకంలో గతంలో ఇళ్ల కేటాయించినా కట్టుకోని లబ్ధిదారులకు కొత్త పథకం వర్తింపజేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కోరారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు.

జీరో అవర్ ప్రస్తావనలకు సమాధానాలేవి?

సీనియర్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, 'జీరో అవర్‌లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలకు సమాధానాలు రావట్లేదు. సభ్యుల విన్నపాలు అరణ్య రోదనగా మారాయి. వాటిని సంబంధిత శాఖల మంత్రులకు పంపి సమాధానాలు వచ్చేలా చూడాలి' అని కోరారు. దీనిపై ఉపసభాపతి రఘురామకృష్ణరాజు స్పందిస్తూ... 'అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. సమాధానాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం' అని సభకు హామీ ఇచ్చారు.

సంధి ప్రేలాపనలు!



అన్నీ తెలిసీ జగన్ అవాకులు

- జగన్‌కు విపక్షనేత హోదా దక్కదు
- ఆయనది సభా హక్కుల ఉల్లంఘనే: స్పీకర్

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా గుర్తించాలన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి విన్నపాన్ని పరిశీలించడం సాధ్యపడదని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. ప్రజలు నిరాకరించిన హోదాను స్పీకర్‌గా నేను ఎలా ఇవ్వలను? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదా కోసం హైకోర్టులో జగన్ వేసిన పిటిషన్‌తోపాటు గత ఏడాది తనకు రాసిన లేఖలోని అంశాలపై పూర్తి వివరణ ఇస్తూ బుధవారం అసెంబ్లీలో ఆయన ఒక రూలింగ్ ఇచ్చారు. నిబంధనలు, సంప్రదాయాల గురించి తెలిసినప్పటికీ జగన్, ఆయన పార్టీ నేతలు నిరాధారమైన ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకరుకు దురుద్దేశాలు ఆపాదించడం సభా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని హెచ్చరించారు. "జగన్ సాగించిన దుష్ప్రచారాన్ని సంధి ప్రేలాపనలుగా పరిగణించి క్షమిస్తున్నాను. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ఈ సభలోని సభ్యుల సమష్టి విజ్ఞతకు వదిలేస్తున్నాను" అని తెలిపారు. ఇదే సందర్భంలో... సభకు హాజరు కావాలంటూ వైసీపీ ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. స్పీకర్ రూలింగ్‌లోని కీలకాంశాలు... ఆయన మాటల్లోనే!

రూలింగ్ ఎందుకంటే...

జగన్ గత ఏడాది జూన్ 24న నాకు ఒక లేఖ రాశారు. అందులో అభియోగాలు, సంధి ప్రేలాపనలు, బెదిరింపులే ఉన్నాయి. అభ్యర్థన మాత్రం లేదు. దానికి తోడు తనకు విపక్ష నేత హోదాకు అర్హత ఉందంటూ అసంబద్ధ వాదనలు చేస్తున్నారు. ఈ లేఖ రాసిన కొద్ది రోజుల తర్వాత జగన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ న్యాయ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చేవరకు వేచి చూద్దామనుకున్నాను. కానీ... స్పీకర్‌కు హైకోర్టు సమన్లు జారీ చేసిందని, ఉత్తర్వులు జారీ చేయాలని స్పీకరును ఆదేశించిందని జగన్ చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. నిజానికి... ఆ పిటిషన్ విచారణార్హతే ఇప్పటిదాకా నిర్ధారణ కాలేదు. జగన్ తన కల్పిత వాదనలను, ఆకాంక్షలను న్యాయస్థానానికి ఆపాదించడానికీ వెనకాడలేదు. ఇదే ఆయన సహజ శైలి. అందుకే ఈ రూలింగ్‌తో తప్పుడు ప్రచారానికి తెరదించాలని నిర్ణయించుకున్నాను.

సంప్రదాయం ప్రకారమే...: గత ఏడాది జూన్ 21న శాసనసభలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చిరకాల సంప్రదాయాలను అనుసరించే నిర్వహించారు. జగన్‌ను మాజీ ముఖ్యమంత్రి హోదాలో ప్రస్తుత మంత్రుల తర్వాత శాసన సభ్యునిగా ప్రమాణం చేయడానికి ఆహ్వానించారు. 'జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా నిరాకరించడానికి ఇది సూచిక' అని ఆయన చెప్పడంలో అర్థం లేదు. జూన్ 22న స్పీకర్ ఎన్నిక జరిగింది. ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపు ఇచ్చే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుంది. నిజానికి జగన్ తమ పార్టీ శాసన సభాపక్ష నాయకుడిగా ఎన్నికైనట్లు జూన్ 26వ తేదీ వరకు మా కార్యాలయానికి తెలుపనే లేదు. అలాంటప్పుడు... జూన్ 26కు ముందే ముందే ప్రతిపక్ష నాయకుడి హోదా గురించి నిర్ణయం తీసుకోవడం సాధ్యమా?

ప్రతిపక్ష హోదా దక్కేది ఇలా...

ప్రతిపక్ష నాయకుని హోదాకు ఎవరైనా అర్హులా? కాదా? అనేది కేవలం రాజ్యాంగ సూత్రాలు, కోర్టు తీర్పులు, చిరకాల సంప్రదాయాలు మాత్రమే నిర్ణయిస్తాయి. ఆంధ్రప్రదేశ్ వేతనాలు, పింఛన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు చట్టం-1953లో ప్రతిపక్ష నాయకుడి హోదా ప్రస్తావన ఉంది. ఆ చట్టంలో సెక్షన్-12బి ప్రకారం ఎవరికైనా ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలంటే... ఆ వ్యక్తిని ప్రతిపక్ష నాయకుడిగా సభాపతి గుర్తించాలి. ఒకవేళ అత్యధిక సంఖ్యాబలం ఉన్న ప్రతిపక్షాలు ఒకటి కన్నా ఎక్కువ ఉంటే... ఆయా పార్టీల హోదాను దృష్టిలో ఉంచుకుని, వాటిలో ఏదో ఒక పార్టీ నాయకుడికి సభాపతి ప్రతిపక్ష నాయకుడి హోదా కల్పించవచ్చు. ఈ విషయంలో సభాపతి నిర్ణయానికి తిరుగుండదని సెక్షన్-12బి చెబుతోంది. అయినప్పటికీ పార్లమెంటులోనూ, రాష్ట్రాల చట్టసభల్లోనూ సభాపతులు ఈ అధికారాల వాడకంలో, లోక్‌సభ మొదటి స్పీకర్ జి.వి.మావలాంకర్ ఇచ్చిన డైరెక్షన్ ప్రకారం నడుచుకుంటున్నారు. సభ సమావేశం కావడానికి అవసరమైన కోరంతో సమానంగా, అంటే మొత్తం సభ్యుల్లో పదింట ఒక వంతు సంఖ్యాబలం కలిగిన పార్టీనే స్పీకర్ గుర్తించాలని లోక్‌సభ డైరెక్షన్ 121 చెబుతోంది. దీనినే పార్లమెంటుతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల్లో పాటిస్తున్నారు. గతంలో ఏపీ స్పీకర్ కూడా ఇదే తరహాలో డైరెక్షన్ నంబరు 56ను జారీ చేశారు. డైరెక్షన్‌కు మూలాలు రాజ్యాంగంలో 100 (3), 189 (3) అధికరణాల్లో నిర్దేశించారు. ఉమ్మడి ఏపీకి సంబంధించి 1972-77, 1994-99 మధ్య కాలంలో ఏ ప్రతిపక్ష పార్టీకీ కనీసం 10 శాతం సీట్లు రాలేదు. అప్పుడు ఎవరికీ ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపు దక్కలేదు.

సత్యదూరంగా జగన్ లేఖ

జగన్ తన లేఖలో ఉదహరించిన అనేక అంశాలు సత్యదూరాలే! ఆయన చెప్పినట్లుగా 1994లో పి.జనార్దన రెడ్డికి విపక్ష నేత గుర్తింపు దక్కలేదు. ఆయనను కాంగ్రెస్ శాసనసభా పక్షానికి నేతగా మాత్రమే గుర్తించారు. 8వ లోక్‌సభలో టీడీపీకి 10 శాతం సంఖ్యాబలం లేకపోయినా పి.ఉపేంద్రకు ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపు లభించిందని జగన్ అంటున్నారు. అది కూడా అవాస్తవం. ఉపేంద్రను ఆనాటి సభాపతి టీడీపీ గ్రూపు నాయకుడిగా మాత్రమే గుర్తించారు. ఈ వాస్తవాలను, సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుంటే... 175 మంది సభ్యులున్న నేటి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీకి కనీసం 18 మంది సభ్యులుంటే తప్ప ప్రతిపక్ష నేత హోదా రాదని అందరికీ అర్థమవుతుంది. "చంద్రబాబుకు 23 మంది శాసనసభ్యులున్నారు. ఒక ఐదుగురిని లాగేస్తే ఆయనకు 18 మంది కూడా ఉండరు. అప్పుడు ఆయనకు ప్రతిపక్ష నాయకుడి స్టేటస్ కూడా ఉండదు" అని ఇదే జగన్ 2019 జూన్ 13న ముఖ్యమంత్రి హోదాలో సభలోనే చెప్పారు. అంటే... ప్రతిపక్ష నాయకుడి గుర్తింపు పొందాలంటే సభలో కనీసం 10 శాతం సంఖ్యాబలం ఉండాలన్న నిబంధన గురించి ఆయనకు స్పష్టంగా తెలుసునని దీని ద్వారా స్పష్టమవుతోంది.

ఆ లేఖను బహిర్గతం చేయాలి: ఫరూక్

ప్రతిపక్ష హోదా కోసం బెదిరింపులకు పాల్పడుతూ జగన్ స్పీకర్‌కు రాసిన లేఖను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ప్రతిపక్ష హోదా కోసం జగన్ చేస్తున్న తప్పుడు ప్రచారంపై సభలో సీరియస్‌గా చర్చించాలని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి అన్నారు.

సభకు రాకుండా రాద్ధాంతమా: పార్థసారథి

తన స్వలాభం కోసం 10 మంది ఎమ్మెల్యేలను సభకు దూరం చేయడం జగన్‌కు తగదని మంత్రి పార్థసారథి అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ గుర్తిస్తేనే ప్రతిపక్ష హోదా ఇస్తారన్న విషయం మాజీ సీఎంకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు.

ఎవరెక్కడ ఉండాలో నిర్ణయించేది ప్రజలే: లోకేశ్

జగన్ తనకు ప్రతిపక్ష హోదా కోసం స్పీకరుపైనే వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని, ఇది శాసనసభ పరువు ప్రతిష్ఠలకు సంబంధించిన అంశమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా రాదని చట్టం చెబుతుంటే... దానిని ఉల్లంఘించి తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సరికాదన్నారు. జగన్ చేస్తున్న దుష్ప్రచారంపై స్పీకరు ఇచ్చిన రూలింగ్‌పై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఇక, అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేని జగన్ ఇంట్లో ప్రెస్ మీట్ పెట్టి... అడ్డగోలుగా మాట్లాడటం సరికాదని, గతంలో లోక్‌సభలో ప్రతిపక్ష హోదాపై రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు... ఏపీలో జగన్‌కూ వర్తిస్తుందని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

సభా హక్కుల సంఘానికి పంపాలి: నాదెండ్ల

వైసీపీ ఎమ్మెల్యేలు, వారి నాయకుడు తమ బాధ్యతలను విస్మరించి శాసనసభను, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా దుష్ప్రచారం చేయడం సరికాదని మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. "వైసీపీ సభ్యులు చేస్తున్న దుష్ప్రచారం అంశాన్ని సభా హక్కుల సంఘానికి రిఫర్ చేయాలి" అని కోరారు. కాగా, ఓట్ల శాతం ప్రకారం ప్రతిపక్ష హోదా కావాలంటే జర్మనీ వెళ్లమని పవన్‌కల్యాణ్ అనడంలో తప్పేముందని, సభ్యత్వం లేని పార్టీకి జీవిత కాలం అధ్యక్షుడిగా ప్రకటించుకున్న జగన్... జనసేన పార్టీని, పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తారా అని మనోహర్ ధ్వజమెత్తారు.

వైసీపీ క్యాన్సర్ వంటిది: సత్యకుమార్

'ఓల్డ్ హ్యాబిట్స్ డై హార్డ్... అబద్ధాలు చెప్పడం అలవాటైన జీవితాంతం అబద్ధాలు చెబుతూనే ఉంటాడు... ఈ నానుడి జగన్‌కు 100 శాతం వర్తిస్తుంది' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. 'ఐదేళ్లపాటు సీఎంగా పనిచేసి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించిన జగన్... మీడియా సమావేశంలో ఎప్పటిలానే అబద్ధాల్ని నిర్లజ్జగా వండి వార్చారు. రాష్ట్రంలో యుద్ధప్రాతిపదికన వైద్య కళాశాలలను చేపట్టామని జగన్ అనడం అతి పెద్ద అబద్ధం. వైసీపీ, క్యాన్సర్ వంటిది. ఇటీవల ఎన్నికల ఫలితాల ద్వారా జరిగిన తాత్కాలిక వైద్యంతో ఆ క్యాన్సర్ నయం కాలేదు. ఈ క్యాన్సర్‌కు ప్రజలు శాశ్వత బహిష్కరణ విధించాలి' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. ఇక, వైసీపీకి 11 సీట్లే వచ్చాయన్న సంగతిని పక్కనబెట్టి... కావాలనే తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదనే భావనను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని బీజేఎల్పీనేత విష్ణుకుమార్ రాజు విమర్శించారు.

అయోమయం... జగన్‌'వాదం'!

(మొదటి పేజీ తరువాయి)

పరిమితం కాగానే... సంఖ్యతో సంబంధంలేదు, విపక్ష నేత హోదా ఇవ్వాల్సిందే అని చెబుతున్నారు. బుధవారం ఇదే అంశంపై సుదీర్ఘ ప్రెస్‌మీట్ పెట్టారు. అదే ప్రెస్‌మీట్‌లో 'చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చింది నేనే. అప్పుడు ఐదుగురు ఎమ్మెల్యేలను లాక్కోవాలని చెప్పినా, నేను వద్దన్నాను' అని చెప్పడం గమనార్హం. అంటే... ఆయన ప్రతిపక్షనేత హోదాకు, సంఖ్యకు సంబంధం ఉన్నట్లే కదా!

'సమయం'... సందర్భం!

ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశం ముగియగానే... 'ఎంతసేపు మాట్లాడానబ్బా!' అంటూ జగన్ ఒక వింత ప్రశ్న వేశారు. 'చూశారా... ఇంత సమయం ఇస్తేకానీ అసెంబ్లీలో బడ్జెట్ గురించి మాట్లాడలేం" అంటూ వింత లాజిక్ బయటికి తీశారు. సొంత ఆఫీసులో, తాను సొంతంగా పెట్టుకున్న ప్రెస్‌మీట్‌కు, అసెంబ్లీలో ప్రసంగానికీ ముడిపెట్టడమే ఓ విచిత్రం! సభలో స్పీకర్ ఇచ్చే సమయానికీ, ప్రతిపక్ష నేత హోదాకూ సంబంధమే లేదు. ఆయా పార్టీలకు ఉన్న బలాన్నిబట్టి స్పీకర్ సమయాన్ని కేటాయిస్తారు. ఎవరికి ఎంత సమయమిచ్చేదీ సభలోనే ప్రకటిస్తారు. 'ప్రతిపక్ష నేత హోదా' ఉన్నప్పటికీ ఇదే వర్తిస్తుంది. కాకపోతే... ఈ హోదాతోపాటు 'కేబినెట్ ర్యాంక్' వస్తుంది. అంతేతప్ప, సభలో సీఎంతో సమానంగా మాట్లాడే అవకాశం మాత్రం రాదు. తమకు కేటాయించిన సమయం సరిపోలేదని భావిస్తే... స్పీకర్‌ను మరింత టైమ్ కోరవచ్చు. లేదా... సభలో చెప్పాల్సింది చెప్పి, మిగిలిన విషయం మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయవచ్చు. ఇన్ని మాటలు చెబుతున్న జగన్... చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉండగా తనతో సమానంగా మాట్లాడే అవకాశమిచ్చారా? అన్నది అసలు ప్రశ్న. నిబంధనల ప్రకారం... బడ్జెట్‌పై చర్చను విపక్షాలు ప్రారంభించాలి. కానీ, 2022లో అధికారపక్షమైన వైసీపీకి స్పీకర్ అవకాశమిచ్చారు. అప్పటికి... కల్తీమద్యం మృతులపై టీడీపీ సభ్యులు ఆందోళన చేస్తుండగా, 'బడ్జెట్‌పై మీరెవరైనా మాట్లాడతారా?' అని పైకి ఒక మాట అని, ఆ వెంటనే స్పీకర్ వైసీపీకి అవకాశమిచ్చారు.

సహచర సభ్యుల మాటేమిటి...

"ప్రతిపక్షనేత హోదా ఇవ్వకపోతే 175 మంది శాసనసభ్యులలో నేనూ ఒకడిగా మిగిలిపోతా' అని జగన్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిగిలిన పదిమంది వైసీపీ ఎమ్మెల్యేలు ఏమైపోయినా ఫర్వాలేదు, వాళ్లు మాట్లాడలేకపోయినా సరే, తనకు మాత్రం 'హోదా' కావాలి అన్నట్లుగా ఉందని అంటున్నారు. ఆయా అంశాలను సభలో లేవనెత్తి, వాటికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేయడం సహజం. కానీ... తన తాడేపల్లి నివాసంలో ప్రెస్‌మీట్ పెట్టి, 'దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అని అడగడం చూసి విస్తుపోతున్నారు. జగన్‌కు అసెంబ్లీలో ముందువరుసలోనే సీటు కేటాయించారు. స్పీకర్‌కు కనిపించేంత, వినిపించేంత దూరంలో ఉన్నందున... ఎప్పుడైనా తన చేతిని ఎత్తి, మైక్ కోరవచ్చు. ఇవ్వకపోతే... 'నాకు అవకాశం ఇవ్వలేదు చూశారా' అని ఆక్రోశించవచ్చు. దీనిని కూడా విస్మరించి... 'నేను సభకు పోను. విఎమ్మెల్ని పోనివ్వను' అంటూ పార్టీ ఎమ్మెల్యేలకూ అన్యాయం చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

అన్నింటా అదే గజిబిజి...

అసెంబ్లీ జరుగుతున్నా వైఎస్ జగన్ అటువైపు వెళ్లడం లేదు. జిల్లాల పర్యటనలు చేసి ప్రజలను కలుస్తానని మూడునెలలుగా చెబుతున్నా... అటుగా ఇప్పటివరకు మూడు అడుగులు కూడా పడలేదు. దీంతో వైసీపీ అధినేత తీరుపై ఆయన పార్టీ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. సంక్రాంతి పోగానే లోక్‌సభ నియోజకర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశమవుతానని... రాత్రి బస చేస్తానని చెప్పారు. సంక్రాంతితోపాటు శివరాత్రి కూడా పోయింది. అయినా... జగన్ కాలు బయటపెట్టడంలేదు. జగన్ దంపతులు దాదాపు ప్రతి శుక్రవారం బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లి .. మళ్లీ మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకుంటున్నారు. మధ్య మధ్యలో సొంత నియోజకవర్గం పులివెందులకు వెళ్తున్నారు. అప్పటి బిల్లుల బకాయిలపై కాంట్రాక్టర్ల నిలదీత బెడదతో... ఇటీవల పులివెందుల టూరూ తగ్గించేశారు.

బాబుకు జగనే విపక్ష హోదా ఇచ్చారట!

- పదిమందిని లాగేస్తే ఆనాడు ఆ హోదా పోయేదట!
- అయితే.. విపక్ష హోదాకు సంఖ్య ప్రధానం కాదట!
- 'హోదా'పై జగన్ పొంతన లేని మాటలు




అమరావతి, మార్చి5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాపై మాజీ సీఎం జగన్ పొంతనలేని మాటలు మాట్లాడారు. ఇంతమంది ఉంటేనే ప్రతిపక్ష నేతగా గుర్తించాలనే రూల్ ఎక్కడా లేదన్న ఆయన... పది మంది ఎమ్మెల్యేలను లాక్కోకుండా చంద్రబాబుకు 2019లో తానే ప్రతిపక్షనేత హోదా ఇచ్చానంటూ విరుద్ధ వ్యాఖ్యలు చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో జగన్ మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా కోసం చాలాకాలంగా ఆయన పట్టుబడుతుండగా, ఆ హోదా తాము ఇచ్చేది కాదనీ, ప్రజలు మాత్రమే ఇవ్వాలని అధికార పక్షం చెబుతూవస్తోంది. అయినా... అదే అంశంపై జగన్ 2 గంటలకుపైగా మాట్లాడారు. "అందరూ గుర్తు పెట్టుకోవాల్సిందేమిటంటే, టీడీపీ నుంచి పదిమంది ఎమ్మెల్యేలను లాక్కోకుండా ఆనాడు చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా నేనే ఇచ్చాను. టీడీపీ సభ్యుల్లో ఐదుగురు అధికార పక్షంలో చేరేందుకు ముందుకొచ్చారు. మా వాళ్లయితే లాగేద్దాం అన్నారు. కానీ, నేను ఒప్పుకోలేదు. చంద్రబాబుకూ, నాకూ తేడా ఇదీ" అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికీ, ఇవ్వకపోడానికీ నిర్దిష్టంగా ఎలాంటి నిబంధనలూ లేవన్నారు. గతంలో 77సీట్లు గెలిచిన ఆప్, మూడు సీట్లు గెలుచుకున్న బీజేపీకి ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇచ్చిందన్నారు. "ప్రతిపక్ష హోదా లేకపోతే సభలో ఐదు నిమిషాలు మాట్లాడిచ్చి మైక్ కట్ చేస్తారు. సభా వేదికగా ప్రజాసమస్యలపై గళమెత్తడం సాధ్యం కాదు. అందుకే మీడియాలో స్పందిస్తున్నాను. నా మాటలకు అధికార పక్షం వచ్చి సమాధానం చెప్పాలి" అని జగన్ పేర్కొన్నారు. జగన్‌కు ప్రతిపక్షనేత హోదా కావాలంటే ఓటింగ్ శాతాన్ని బట్టి ప్రతిపక్షనేత హోదాను ఇచ్చే జర్మనీకి వెళ్లాలన్న ఉపముఖ్యమంత్రి పవన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ..."ఆయన తొలిసారి ఎమ్మెల్యే. కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకు తక్కువ" అని జగన్ ఎద్దేవాచేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను కూడా అధికారపక్షమే పోషిస్తుందన్న పవన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ "ఇదేమైనా డబుల్ యాక్షనా పవన్?" అన్నారు.

'ఎంత సేపు పట్టిందబ్బా!'

మీడియా సమావేశం తర్వాత విలేకరులను 'ఎంతసేపు పట్టిందబ్బా' అని జగన్ అడిగారు. దాదాపు 2గంటలని విలేకరులు చెప్పగా... ఈ మాత్రం మాట్లాడకపోతే ప్రజలకు విషయాలు ఎలా తెలుస్తాయని జగన్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్, గవర్నర్ ప్రసంగం మీద ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో మాట్లాడలేని పరిస్థితుల్లోనే మీడియా ద్వారా స్పందించానన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో రిగ్గింగు చేసేవాడిని చరిత్రలో ఒక్క చంద్రబాబునే చూశామన్నారు.

నాగబాబుకు ఎమ్మెల్సీ

- ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా ఖరారు: పవన్



అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు పదవి విషయంలో ఆ పార్టీ స్పష్టత ఇచ్చింది. పవన్ స్వయంగా రంగంలోకి దిగి... శాసనసభ్యుల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి భాగస్వామి జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును ఖరారు చేసినట్లు ప్రకటించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు జనసేన కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకు పార్టీ కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ ఆదేశించారు. త్వరలోనే నాగబాబు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయనకు కేబినెట్‌లో చోటివ్వనున్నట్లు సీఎం చంద్రబాబు గతంలోనే ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చాక మంత్రి పదవి కట్టబెడతారని జనసేన వర్గాలు అప్పట్లో తెలిపాయి. ఆ దిశగానే నాగబాబు ఎమ్మెల్సీ కానున్నారని తాజాగా పేర్కొన్నాయి. కాగా... ఆయన్ను రాజ్యసభకు పంపిస్తారా... ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తారా... అన్న అంశంపై మూడు రోజులపాటు పెద్దఎత్తున చర్చ జరిగింది. పైగా సోమవారం పవన్ కల్యాణ్ అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం నాగబాబును రాజ్యసభకు పంపాలని నిర్ణయించారన్న ప్రచారం జోరందుకుంది. ఆ ప్రచారాన్ని తోసిపుచ్చుతూ... ఆయన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారుచేసినట్లు పవన్ వెల్లడించారు.



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రులు సవిత, స్వామి, కొల్లు, ఫరూక్

అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే.. జగన్

- ప్రతిపక్ష హోదా ఇవ్వరాదని ప్రజలే నిర్ణయించారు
- డిప్యూటీ సీఎంపై నోరుజారితే ఊరుకునేది లేదు
- జగన్ కన్నా పవన్‌కు వచ్చిన మెజారిటీ ఎక్కువ
- వైసీపీ కన్నా జనసేనకు వచ్చిన సీట్లు ఎక్కువ
- అమరావతిపై జగన్ వైఖరి ఏమిటో చెప్పాలి
- మద్యంలో అవినీతి చేయలేదని తన పిల్లలపై ప్రమాణం చేయగలరా: లోకేశ్

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్‌రెడ్డిలా ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. జగన్ బాగా ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని, అధికారంలో ఉన్నప్పుడు దౌర్జన్యాలు, అవినీతితో అడ్డగోలుగా వ్యవహరించి, ప్రతిపక్షంలోకి రాగానే నీతులు, విలువల గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. బుధవారం వెలగపూడి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. 'ఎన్నికలకు ముందు వైనాట్ 175 అని పదే పదే చెప్పిన వ్యక్తికి ప్రజలు 11 స్థానాలు కట్టబెట్టారు. ప్రజలే మీకు ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారు. అది ఇప్పటికీ తెలుసుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎలా ఇవ్వమంటారు? ఆయనకు చట్టాన్ని ఉల్లంఘించడం బాగా అలవాటు. అందుకే ఆయనపై అన్ని కేసులు ఉన్నాయి. పార్లమెంటు, అసెంబ్లీ రూల్ బుక్‌లో చాలా స్పష్టంగా 10 శాతం సభ్యులు ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఉంది. దాని ప్రకారం వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదు. అసెంబ్లీలో వైసీపీకి 11వ రో(వరుస) కేటాయించాం. ఆ వరుసలో 11 మంది కూర్చోవచ్చు' అని లోకేశ్ అన్నారు.

జగన్‌కు విలువల్లేవు

'ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి హుందాగా మాట్లాడతారని అందరం భావించాం. కానీ గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వ్యక్తిని కించపరిచే విధంగా మాట్లాడటం దారుణం. జగన్ వ్యాఖ్యలు విన్న తర్వాత ఆయనకు విలువలు లేవని అర్థమైంది. మేం ఎవరిపైనా వ్యక్తిగత దాడులు చేయడం లేదు. వైసీపీ నాయకులు చేసిన తప్పులే వారి మెడకు చుట్టుకుంటున్నాయి. జగన్‌కు చట్టాలపై గౌరవం లేదు. చాన్స్ ఇస్తే అవినీతి నిరోధక చట్టాన్ని, సీబీఐని, ఈడీని అన్నిటినీ రద్దు చేసేస్తారు. మద్యంలో అవినీతి చేయలేదని జగన్ తన పిల్లలపై ప్రమాణం చేసి చెప్పగలరా? సీఎం పదవి కోసం తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించిన వ్యక్తి జగన్. 2019 ఎన్నికల్లో సొంత బాబాయిని లేపేసి, మాపై నిందమోపారు' అని విమర్శించారు.

ఎక్కడా పరదాల్లేవు..

'పరదాలు కట్టే ప్రభుత్వం పోయింది. బూతులు తిట్టే శాసనసభ్యులు కూడా పోయారు. అసెంబ్లీ పరిసరాల్లో పోలీసుల సంఖ్య తగ్గింది. ఎక్కడా పరదాలు లేవు. ఎవరైనా స్వేచ్ఛగా రావొచ్చు. ప్రజాసమస్యలను ప్రస్తావించవచ్చు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి గెలిచిన తర్వాత జగన్‌కు భయం పట్టుకుంది. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో హడావిడిగా వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి మళ్లీ బెంగళూరు వెళ్లిపోతారు' అని లోకేశ్ అన్నారు.

అమరావతిపై మీ విధానమేంటి?

'ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్‌కు డీఎస్సీపై మాట్లాడే అర్హత లేదు. వైసీపీ విధ్వంసం వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోయింది. దాన్ని మేం గాడిలో పెడుతున్నాం. అమరావతిపై జగన్ రెడ్డి విధానమేంటో ఇప్పటికైనా చెప్పాలి. ఒక రాజధానికి కట్టుబడి ఉన్నారా లేక మూడుముక్కలాటకే సిద్ధంగా ఉన్నారా? చెప్పాలి. వైసీపీ పాలనలో 40 లక్షల మందికి ఎక్కడ ఉద్యోగాలు కల్పించారో వివరాలు ఇవ్వాలి. అన్ని ఉద్యోగాలు ఇస్తే ఇప్పుడు నిరుద్యోగులు ఒక్కరూ ఉండకూడదు కదా' అని లోకేశ్ అన్నారు.

జగన్.. పవన్ ఎవరి మెజారిటీ ఎంత?

'డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కించపరిచే విధంగా జగన్ మాట్లాడితే సహించేది లేదు. మొన్నటి ఎన్నికల్లో జగన్ కన్నా పవన్‌కు ఎక్కువ మెజారిటీ వచ్చింది. వైసీపీ కన్నా జనసేనకు ఎక్కువ సీట్లు వచ్చాయి. ఇదంతా ఆలోచించకుండా... నోరుంది కదా అని అధికారంలో ఉన్న వారిని కించపరిచే విధంగా ఏదిబడితే అది ఇష్టానుసారం మాట్లాడితే కుదరదు. ఇప్పటికైనా జగన్ రెడ్డి సీఎం, డిప్యూటీ సీఎం గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలి. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి. లేదంటే ఊరుకునేది లేదు' అని లోకేశ్ హెచ్చరించారు.

మొదటిసారి ఎమ్మెల్యేలకు నిధులెక్కువ ఇవ్వండి

రాజధాని అమరావతి రోడ్డు అత్యంత దారుణంగా ఉందని, మొదటి సారి ఎమ్మెల్యేలైన తమకు ఎక్కువ నిధులు కేటాయించి నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చెప్పడం సభలో కాసేపు సరదా చర్చకు దారి తీసింది. సభలో మొదటిసారి ఎన్నికైన సభ్యులు 84 మంది ఉన్నారని, అందరూ రోడ్ల గురించే అడుగుతున్నారని, మంత్రి గారూ వీళ్ల కోర్కెలు తీర్చగలరేమో చూడండి అంటూ డిప్యూటీ స్పీకర్ రఘురామ అన్నారు. బడ్జెట్ 8,800 కోట్లు కేటాయిస్తే అందులో 4,300 కోట్లు ఆర్డీసీకి, 4,500 కోట్లు ఆర్ అండ్ బీకి ఇచ్చామని మంత్రి బీసీ జనార్దనరెడ్డి సమాధానమిచ్చారు. అలాగే ఇప్పటి వరకూ ఎమ్మెల్యేలందరూ ఇచ్చిన వినతులు తీర్చాలంటే 37వేల కోట్లు కావాలంటూ వివరించారు.


పండుల రవీంద్ర


కొల్లు రవీంద్ర


పార్థసారథి


అచ్చెన్నాయుడు

మే నుంచి అన్నదాత సుఖీభవ

అమరావతి.. దెయ్యాల నగరం!

- మండలిలో వైసీపీ సభ్యుడు పండుల రవీంద్ర వ్యాఖ్యలు
- దీటుగా బదులిచ్చిన మంత్రులు

అమరావతి, మార్చి 5(అమరావతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిపై వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు శాసనమండలిలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పండుల చేసిన వ్యాఖ్యలపై మండలిలో ఉన్న మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు నిప్పులు చెరిగారు. రాజధానిపై మాట్లాడే అర్హత వైసీపీ సభ్యులకు లేదని మండిపడ్డారు. గత ఐదేళ్లు ఇదే విషం చిమ్మారని, మళ్లీ మొదలుపెట్టారని మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా పండుల మాట్లాడుతూ.. "అమరావతిని కట్టలేరు. ఇది దెయ్యాల నగరం(ఘోస్ట్ సిటీ). అమరావతి రాష్ట్రానికి మధ్యలో ఉంటుందని అంటున్నారు. ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. అమరావతిని పదేళ్లలో కట్టేస్తామంటే కట్టలేరు. కొత్తగా నగరాలు నిర్మించడం సాధ్యంకాదని మయన్మార్(బర్మా) నిరూపించింది. ఆ దేశంలో కొత్తగా రాజధాని కట్టారు. అక్కడ భవనాలే తప్ప మనుషులు లేరు. అందుకే ఆ రాజధానిని ఘోస్ట్ సిటీ అంటారు. అమరావతి కూడా అంతే." అని తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో అధికార పక్షం కూడా దీటుగా బదులిచ్చింది.

మూడు రాజధానులు అన్నవారికి..

అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కట్టి తీరుతామని మంత్రి కొల్లు ఉద్ఘాటించారు. మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్న వారికి ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారో.. ఒకే రాజధాని అన్న మాటపై నిలబడిన వారికి ఇచ్చిన తీర్పు ఏంటో గమనించాలని హితవు పలికారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'ఈ ప్రాంతంలో మనుషులేలేరా? మనుషుల మధ్యలో నుంచి కాదా మీరు వచ్చేది?" అని నిలదీశారు. మూడు రాజధానుల నిర్ణయం తప్పని వైసీపీ నేతలు గ్రహించారన్నారు. "మా(వైసీపీ) నిర్ణయం తప్పు. ప్రజలు అంగీకరించలేదని బొత్స చెప్పారు. అమరావతిపై పునరాలోచిస్తామన్నారు. ఆ వీడియోను సభలో ప్రదర్శించమంటే ప్రదర్శిస్తాం." అని అన్నారు.

తీరు మార్చుకోండి: కొలుసు

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. వైసీపీ నేతలు గత ఐదేళ్లలో అమరావతిపై విషం చిమ్మారని ఇప్పటికైనా వారు తమ తీరు మార్చుకోవాలని హితవుపలికారు. అమరావతిలో మనుషులు కాకుండా ఎవరుంటారని ప్రశ్నించారు. కాగా, అమరావతిపై తాము తీసుకున్న నిర్ణయం తప్పని తాను ఎక్కడా చెప్పలేదని వైసీపీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ అన్నారు. "ఆరోజు మా విధానం అది. ఆ విధానం ప్రకారం ముందుకు వెళ్లాం. ఈ రోజు మా విధానం ఏంటనేది పార్టీలో చర్చించి చెబుతామని చెప్పా. రాజధానిపై ఏం జరగబోతోందన్నది కాలమే చెబుతుంది." అని తెలిపారు.

- గత ప్రభుత్వం వ్యవసాయానికి తాళాలు వేసింది
- రైతుల ఉసురు తీశారు: అచ్చెన్నాయుడు
- రైతులకు ఏమిచ్చామో చర్చకు సిద్ధం: బొత్స



అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం కింద ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మే నెలలోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఏడాదికి 6వేలు ఆర్థిక సాయం చేస్తోందని, మరో 14 వేలు కలిపి రూ.20 వేల చొప్పున రైతులకు అందిస్తామన్నారు. 43 లక్షల మంది రైతులకు కేంద్రం పీఎం కిసాన్ సాయం ఇస్తోందని, రాష్ట్రంలో మరో 9నుంచి 10 లక్షల మంది వరకు అర్హులైన రైతులు ఉంటారని వారందరికీ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ఇంకా అర్హులైనవారు ఉంటే అందరికీ ఏటా 20 వేలు ఇస్తామన్నారు. కౌలు రైతులకు పథకం అమలుపై విధి విధానాలు ఖరారు చేస్తున్నామన్నారు. కేంద్రంతో కూడా సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. రాష్ట్రంలోని 90శాతం మంది కౌలు రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. రైతు భరోసా అందించే విషయంలో వైసీపీ ప్రభుత్వం రైతులను మోసగించిందని, కేంద్రం ఇచ్చే సాయంతో సంబంధం లేకుండా రాష్ట్రమే ఏటా రూ.12,500 ఇస్తామని చెప్పి, మాట తప్పిందని అచ్చెన్నాయుడు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యంత్రాలు లేవు, భూసార పరీక్షలు లేవు, పంటల బీమా చెల్లింపులు లేవని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వ్యవసాయానికి తాళం వేసిందని మంత్రి విమర్శించారు. ఊరు చివర్లో దిష్టిబొమ్మల్లా రైతు భరోసా కేంద్రాలు కట్టారని, వాటిని రైతు సేవా కేంద్రాలుగా మార్చి సేవలందిస్తున్నామని చెప్పారు. కంపెనీలకు 1,120 కోట్లు బకాయిలు పెడితే తామే చెల్లించామన్నారు. ఈ సమాధానంపై వైసీపీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేసి, వాకౌట్ చేశారు. గత ప్రభుత్వంపై బురద జల్లేలా మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపణలు చేస్తున్నారని బొత్స అన్నారు. టీడీపీ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ఇస్తామని చెప్పి మోసం చేయలేదా? అని ప్రశ్నించారు. రైతుల కోసం గత ప్రభుత్వం ఏం చేసిందో, ఈ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు తాము సిద్ధమన్నారు.

18 వేల కిలోమీటర్ల రోడ్లపై గుంతలు పూడ్చాం: మంత్రి జనార్దనరెడ్డి

గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గుంతలమయం చేసిందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి మండిపడ్డారు. గత పాలకులు చేసిన పాపాల వల్ల ప్రస్తుతం రోడ్లకు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో 22వేల కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు పడితే ఇప్పటివరకు 18 వేల కిలోమీటర్ల గుంతలు పూడ్చామన్నారు. 85శాతం రహదారులను బాగు చేశామన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు డబ్బులు ఎగ్గొడితే తమ ప్రభుత్వం చెల్లించిందని సభ్యుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

భోగాపురానికి కొత్త రోడ్లు: మంత్రి నారాయణ

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పూర్తవుతున్నందున విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కొత్త రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. విమానాశ్రయం ప్రారంభించడానికి ముందే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు లోకం నాగ మాధవి, గంటా శ్రీనివాసరావు, పూసపాటి అతిథి, విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మెట్రో రైలుతో పాటు కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయని, అవి కార్యరూపం దాల్చేలా విశాఖ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటుచేసి తగు నిర్ణయాలు తీసుకోవాలని స్పీకరు అయ్యన్నపాత్రుడు మంత్రికి సూచించారు. వచ్చే వారమే సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

చేనేత వస్త్రాలు ధరించాలి: మంత్రి సవిత

ప్రజాప్రతినిధులంతా వారానికొక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సూచించారు. క్లస్టర్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం కింద చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని చెప్పారు.

మే నెలలో 'తల్లికి వందనం'

- ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు
- త్వరలోనే మార్గదర్శకాలు: మంత్రి లోకేశ్



కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'తల్లికి వందనం' పథకానికి బడ్జెట్‌లో రూ.9,407కోట్లు కేటాయించామని, గత వైసీపీ ప్రభుత్వం కేటాయించిన రూ.5,540 కోట్లతో పోలిస్తే ఇది 50 శాతం అధికమని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు పంపిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ వచ్చే మే నెలలోనే ప్రతి విద్యార్థికీ రూ.15వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఒక ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికీ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ఈ పథకం అమలుకు త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు. కలికిరిలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీని యూనివర్సిటీ స్థాయికి పెంచేందుకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు చాలా తక్కువగా ఉన్నాయని, వీటిని బలోపేతం చేసి పరిశ్రమలతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల విద్యతోపాటు ఉన్నతవిద్యలో పెద్దఎత్తున సంస్కరణలు తీసుకురావాలని భావిస్తున్నామన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలకు ప్రత్యేక పాలసీని తీసుకువచ్చి శాశ్వత పరిష్కారం చూపించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎయిడెడ్ పోస్టులను అమ్మకానికి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల కోరారు.

పీపీపీ మోడల్‌తో నష్టం లేదు

- వైద్య కాలేజీల్లో మెరుగైన సౌకర్యాలు
- ఫీజులు కూడా పెరగవు: సత్యకుమార్, అచ్చెన్న

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలపై బుధవారం శాసనమండలిలో వాడివేడిగా చర్చ జరిగింది. కొత్త వైద్య కళాశాలలను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేస్తామని, ప్రైవేటీకరణ కాదని మంత్రులు స్పష్టం చేశారు. దీనివల్ల ఫీజులు పెరగబోవని, యాజమాన్య హక్కులు కూడా ప్రభుత్వం వద్దే ఉంటాయని చెప్పారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ.. కేంద్రం రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు మంజూరు చేస్తే.. గత ఐదేళ్లలో 4 కాలేజీలు కూడా పూర్తిచేయలేదని విమర్శించారు. మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం తెచ్చింది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. వారు తెచ్చిన విధానాన్ని ఎప్పుడు రద్దు చేస్తారని వారే అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే తాము 10 మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్‌లో నిర్మించాల్సి వస్తోందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం లేదని.. ప్రైవేటీకరణకు, పీపీపీ మోడల్‌కు మధ్య తేడా ఉందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. పీపీపీ మోడల్ వల్ల సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు పెరుగుతాయని, నిపుణులైన అధ్యాపకులు వస్తారన్నారు. ఫీజులు కూడా పెరగవన్నారు.

సుప్రీం తీర్పునకు లోబడే...: సత్యకుమార్

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఒప్పంద ప్రాతిపదికపై నియమితులైన ఎంపీహెచ్ఏ పారామెడికల్ సిబ్బంది తొలగింపు వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పునకు లోబడే ప్రభుత్వం వ్యవహరిస్తుందని మంత్రి సత్యకుమార్ చెప్పారు. వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. కొన్ని దశాబ్దాలుగా వైద్యారోగ్యశాఖలో ఎంపీహెచ్ఏ పారామెడికల్ సిబ్బంది సేవలందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్నారని, వీరి విషయంలో ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. న్యాయ పరిమితులకు లోబడి వారి సమస్యలు పరిష్కరించాలని సీఎం సూచించారన్నారు.

ఇంటింటికీ రేషన్‌తో ప్రజాధనం వృథా

- వైసీపీ హయాంలో 1,600 కోట్లతో 9,260 వాహనాలు కొన్నారు
- గత రేషన్ డీలర్ వ్యవస్థే నయం: మనోహర్



అమరావతి, మార్చి5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శలు గుప్పించారు. ఆ పథకం వల్ల రూ.1,600 కోట్లు ప్రజాధనం వృథా అయ్యిందని చెప్పారు. కొనుగోలు చేసిన 9,260 వాహనాల్లో ఒక్కటి కూడా లబ్ధిదారుల ఇంటికెళ్లి బియ్యం ఇవ్వలేదని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం సభలో మంత్రి మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాకముందున్న రేషన్ డీలర్ల వ్యవస్థ బాగుండేదని, ప్రజలు సైతం డీలర్ల వద్దకు వెళ్లి తీసుకోవడమే అనుకూలంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ అంశాన్ని లేవనెత్తారు. మంత్రి స్పందిస్తూ.. వైసీపీ హయాంలో రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు. సిట్ నివేదిక రాగానే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు మాట్లాడుతూ తెల్లకార్డును మల్టీ పర్పస్‌గా కాకుండా కేవలం ఉచిత బియ్యానికే పరిమితం చేస్తే ఎక్కువ మంది స్వచ్ఛందంగా వదులుకుంటారని సూచించారు. దీనికి మంత్రి బదులిస్తూ.. ఆ దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. జగన్ పాలనలో నాశనమైన పర్యాటక రంగాన్ని ప్రైవేటు భాగస్వామ్యంతో పాటు స్వదేశీ దర్శన్ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ వేధింపుల వల్ల పారిశ్రామికవేత్తలు భయపడి పారిపోయారని, విదేశాలకు వెళ్లి పెట్టుబడుల గురించి అడిగితే 'ఇండియాలో ఎక్కడైనా ఓకే.. ఏపీ తప్ప' అంటున్నారని మంత్రి టీజీ భరత్ ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరంపై మాట్లాడే నైతికత వైసీపీకి లేదు

- ప్రాజెక్టు నిర్వీర్యానికి కర్త, కర్మ, క్రియ జగనే: షర్మిల

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'పోలవరంపై మాట్లాడే నైతికత వైసీపీకి లేదు. పోలవరం పేరు వింటే వైఎస్ఆర్ గుర్తుకు వచ్చే వారికి... ఐదేళ్లు అధికారం ఇస్తే గాడిదలు కాశారా? ఆయన జీవిత ఆశయం పోలవరం అని వారికి తెలియదా?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. బుధవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'జగన్... అధికారంలో ఉండగా తట్టెడు మట్టి అయినా తీశారా? ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించే ప్రతిపాదనకు ఒప్పుకున్నది మీరు కాదా? నాడు ప్రధానికి రాసిన లేఖలోనూ 41.15 మీటర్ల మేరకు నిధులు విడుదల చేయాలని అడగలేదా? పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసే కుట్రలో చంద్రబాబు భాగస్వామి అయితే, కర్త, కర్మ, క్రియ జగన్మోహన్‌రెడ్డే' అని షర్మిల మండిపడ్డారు.


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి అరకు కాఫీని అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రులు రామ్మోహన్, పెమ్మసాని, శ్రీనివాస వర్మ, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు

కబ్జాలకు కళ్లెం!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన భూ ఆక్రమణలు, అక్రమాలు, దందాను కేంద్రం దృష్టికి తీసుకెళ్లానని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని పది కేసులు నమోదైతే అందులో 6 కేసులు భూ వివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయని చెప్పారు. భూ వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియలో సరైన తనిఖీ, నియంత్రణ లేకపోవడం వల్ల పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, ప్రైవేటు భూములను కూడా 22ఏ కింద చేర్చారని అన్నారు. రాష్ట్రంలో గంజాయి రవాణాపై చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్ షా దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. గంజాయి సాగును సమర్థంగా నియంత్రించేందుకు ఈగల్ దళాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించగా, అమిత్ షా ప్రశంసించారని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై ఆయనతో చర్చించానని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్డీఏ ఎలా ముందుకెళ్లాలనే అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిందన్నారు. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు అంశంపై చర్చ జరిగిందన్నారు. గుజరాత్‌లో ఇదే తరహా బిల్లును విజయవంతంగా అమలు చేశారని, ఏపీ బిల్లును కూడా త్వరగా ఆమోదించాలని కోరినట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు మరో బిల్లు తీసుకొస్తున్నామన్నారు. రెండు బిల్లుల గురించి చర్చించానని, అమిత్ షా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆర్థిక పునరుజ్జీవనానికి చేయూతనివ్వండి...

అభివృద్ధి, సంపద సృష్టి, ఆదాయం పెంపొందించడం, సంక్షేమం అనేది తమ ప్రభుత్వ విధానమని సీఎం పునరుద్ఘాటించారు. 'సంపద సృష్టించలేని వాడికి సంక్షేమం పేరుతో పంపకం చేసే హక్కు లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించా. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల రుణాలు, బకాయిల భారం తమపై మోపిన విషయాన్ని వివరించా. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, అయినప్పటికీ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధి రేటు ఎలా పుంజుకుందో తెలియజెప్పా. మొత్తమ్మీద వృద్ధి రేటు 12.94 శాతం ఉంటే అందులో ఒక్క వ్యవసాయ రంగంలోనే 15.86 శాతం వృద్ధిని నమోదు చేశాం. సేవా రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రుణాలపై ఆధారపడకుండా సంపదను సృష్టించడానికి స్థిరంగా 15 శాతం వృద్ధి రేటు సాధించాలి' అని స్పష్టం చేశారు.

నదుల అనుసంధానంతో నీటి భద్రత...: జలవనరుల నిర్వహణ తమ చర్చల్లో మరో ముఖ్యమైన అంశమని ముఖ్యమంత్రి తెలిపారు. 'వంశధార-నాగావళి, గోదావరి-కృష్ణా-పెన్నా నదులతోపాటు పోలవరం నుంచి గోదావరి జలాలను బనకచర్లకు అనుసంధానించాలని కేంద్రానికి ప్రతిపాదించాను. రాజమండ్రి దాటిన తర్వాత గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. ప్రస్తుతం వృథాగా పోతున్న 200 టీఎంసీల నీటిని వ్యవసాయం, తాగునీటి అవసరాలకు మళ్లించవచ్చు. దీనివల్ల అనేక ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయి. ఈ నదుల అనుసంధానంలో వేరే రాష్ట్రాల పాత్ర, ప్రమేయం ఏదీ లేదు' అని తేల్చిచెప్పారు.

జాతీయ రహదారులకు సహకారం..

189 కి.మీ. విస్తీర్ణంలో ఉన్న అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరినట్లు సీఎం తెలిపారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ తన ఆలోచనేనన్నారు. అదిప్పుడు ఎంతగా ఉపయోగపడుతుందో అందరికీ తెలుసన్నారు. 'హైదరాబాద్ ఓఆర్ఆర్ తరహాలోనే అమరావతికీ ఎనిమిది వరుసల ఓఆర్ఆర్ అవసరమని కేంద్ర మంత్రిని కోరా. జాతీయ రహదారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పా. తమ వైపు నుంచి కూడా వేగంగా చర్యలుంటాయని గడ్కరీ హామీ ఇచ్చారు. విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డుపైనా చర్చించాం. శ్రీశైలం వద్ద ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడానికి ఎలివేటెడ్ రోడ్ల నిర్మాణం సహా వివిధ పరిష్కార మార్గాలను ప్రతిపాదించాను. అమరావతి నుంచి వినుకొండ రోడ్డుతో పాటు కోస్టల్ హైవేపై చర్చించా. వైజాగ్ నుంచి మూలపేటకు తీరప్రాంత రహదారి ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం పోర్టుకు నేరుగా రహదారి నిర్మించే అంశాన్ని పరిశీలించాలి. ఇది ఏపీతోపాటు తెలంగాణకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అన్నింటికీ డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం. ఆ తర్వాత టెండర్లు పిలుస్తాం. కొన్నిటికి టన్నెళ్ల నిర్మాణం, అటవీ అనుమతులు వంటివి అవసరం ఉన్నాయి. వాటిపై కేంద్ర మంత్రితో చర్చించా' అని వివరించారు. ఆయన వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రులు శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఎం రమేశ్, దగ్గుమళ్ల ప్రసాదరావు ఉన్నారు. నిర్మలా సీతారామన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ఉన్నారు.

'ఢిల్లీ' స్కామ్‌ను మించి జగన్ అవినీతి


నిర్మలకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్


- పాతికేళ్ల వరకు మద్యం ఆదాయం తాకట్టు
- జగన్ అవినీతితో పోల్చితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ చిన్నదే
- జగన్, కేజ్రీ ప్రయోగాలు విఫలం
- ఏపీ ప్రజలు పూర్తిగా మా వైపే
- పట్టభద్రుల ఫలితాలే నిదర్శనం
- ఢిల్లీలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

> "మద్యనిషేధం పేరిట నిరంతరం మద్యం ధరలను అప్పట్లో పెంచుతూ పోయారు. ధరలు పెంచితే తాగడం తగ్గుతుందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను కాకుండా జే బ్రాండ్ల పేరిట లోకల్ సరుకును అమ్మారు. ఎక్సైజ్ ఆదాయాన్ని 25 సంవత్సరాల వరకు జగన్ తాకట్టు పెట్టారు. ప్రతి రోజూ బటన్ నొక్కడం తప్ప ఏనాడూ సంపద సృష్టించిన పాపాన పోలేదు"
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

న్యూఢిల్లీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో మద్యం అమ్మకాల పేరిట జరిగిన భారీ కుంభకోణం ముందు ఢిల్లీ స్కామ్ చాలా చిన్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భూఆక్రమణలు, గంజాయి, మాదక ద్రవ్యాలు, అమ్మాయిల అక్రమ సరఫరా వంటి హేయమైన నేరాలకు గత ప్రభుత్వంలో పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం రూపొందించిన రెండు బిల్లులకు ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కోరినట్టు చంద్రబాబు తెలిపారు. ఆయన బుధవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రజలు పూర్తిగా కూటమి వైపే ఉన్నారని చెప్పారు. 'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు బ్యాంకు 60 నుంచి 67.5 శాతానికి పెరిగింది. సంపదను సృష్టించడం, అభివృద్ధి చేయడం, సంక్షేమం, సాధికారికత అనేవి నిరంతర ప్రక్రియ. సంపద పెంచకపోతే ఎలా పంచగలం? అప్పులతో ఆర్థిక సుస్థిరత సాధించలేం. ఏపీలో నాడు జగన్ ప్రభుత్వం, ఢిల్లీలో నిన్నటి దాకా కేజ్రీవాల్ ప్రభుత్వం చేసిన ప్రయోగాలు విఫలమయ్యాయి. దీనినుంచి నేతలు గుణపాఠాలు నేర్చుకోవాలి. గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు భారీ అవకాశాలు ఉన్నాయి. ఎగుమతులు చేసేందుకు అద్భుతమైన పోర్టులు ఉన్నాయి. పరిశ్రమలకు, పెట్టుబడులకు మా రాష్ట్రం స్థావరంగా మారుతోంది. దాదాపు రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పటివరకు ఏపీకి వచ్చాయి' అని తెలిపారు.

పరిజ్ఞానం వేరు...భాష వేరు

జనాభా తగ్గినంతమాత్రాన రాష్ట్రాలకు నష్టం వస్తుందనేది ఊహాగానం మాత్రమేనని సీఎం అన్నారు. 'డీలిమిటేషన్ నిరంతర ప్రక్రియ. మహిళలకు రిజర్వేషన్ కల్పించాల్సి ఉంది. ఈవిషయంపై సమయం వచ్చినప్పుడు మాట్లాడతాను. ప్రస్తుతం జనాభా నియంత్రణ కన్నా జనాభా నిర్వహణపై దృష్టి కేంద్రీకరించడం అవసరం. జనాభా రాజకీయ సమస్య కానే కాదు. మాతృభాషను ప్రోత్సహించాల్సిందే. ఇంగ్లీష్ జీవనోపాధికి మాత్రమే ఉపయోగపడే భాష. గత ప్రభుత్వం అనాలోచితంగా ఇంగ్లీష్ విద్యను ప్రోత్సహించింది. నిజానికి పరిజ్ఞానం వేరు...భాష వేరు. భాష కమ్యూనికేషన్‌కు సాధనం మాత్రమే. నేను ప్రతి యూనివర్సిటీలో 5 నుంచి 10 భాషలను నేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నాను. అంతర్జాతీయ భాషలు నేర్చుకుని ఉపాధి కోసం ఉపయోగించుకోవచ్చు. హిందీ ప్రజల మధ్య సంబంధాలు పెరిగేందుకు దోహదం చేస్తుంది' అని తెలిపారు.



కూటమి అభ్యర్థిగానే పోటీచేశా

- ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ గాదె స్పష్టీకరణ

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర సంఘాల తరఫున కూటమి అభ్యర్థిగానే తాను పోటీ చేశానని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు స్పష్టం చేశారు. బుధవారం ఉండవల్లిలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తన విజయానికి అన్ని విధాలా సహకరించినందుకు సీఎంకు, కూటమికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా పనిచేస్తానని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

కులాంతర ప్రేమలపై కత్తి!

- గుంతకల్లులో పరువు హత్య
- కూతురిని ఉరేసి చంపి.. పెట్రోలు పోసి నిప్పు
- మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న వైనం
- కుప్పంలో కూతురిపై కత్తితో దాడి
- ప్రేమికులతోపాటు మధ్యవర్తులకూ గాయాలు



గుంతకల్లు టౌన్, కుప్పం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు వేరే కులం అబ్బాయిలను ప్రేమించడమే నేరమైపోయింది! కులాంతర ప్రేమలను తండ్రులు జీర్ణించుకోలేక కన్నపేగులపైనే కత్తులు దూశారు. గుంతకల్లులో ఓ తండ్రి ఏకంగా కూతురిని ఉరేసి చంపేసి, ఆపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. కుప్పంలో జరిగిన మరో ఘటనలో.. కూతురిపై తండ్రి కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ప్రేమికులతోపాటు మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివీ.. అనంతపురం జిల్లా గుంతకల్లు తిలక్‌నగర్‌కు చెందిన రామాంజినేయులు టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు వివాహం జరిపించారు. చిన్న కూతురు భారతి(21) కర్నూలులో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఓ యువకుడిని ప్రేమించింది. అతడిది వేరే కులం కావడంతో తల్లిదండ్రులు భారతిని మందలించారు. కానీ అతడినే పెళ్లి చేసుకుంటానని భారతి తేగేసి చెప్పింది. అదే జరిగితే తమ పరువు పోతుందని భావించిన రామాంజినేయులు, మార్చి ఒకటో తేదీన కూతురిని బైక్‌పై ఎక్కించుకుని గుంతకల్లు మండలం కసాపురానికి తీసుకువెళ్లాడు. గ్రామ శివారులోని తిక్కస్వామి దర్గా వద్ద పొలంలోకి తీసుకువెళ్లి చివరి ప్రయత్నంగా ఆ యువకుడిని మరచిపోవాలని నచ్చజెప్పినా, వినకపోవడంతో బలవంతంగా పట్టుకుని, చెట్టుకు ఉరి వేసి వెళ్లిపోయాడు. కొంత దూరం వెళ్లాక మళ్లీ తిరిగొచ్చి భారతి మృతిచెందినట్టు గుర్తించి, తన బైక్‌లో నుంచి పెట్రోల్ తీసి, కూతురి మృతదేహంపై చల్లి నిప్పంటించాడు. మంగళవారం రామాంజినేయులు గుంతకల్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కూతురిని హత్య చేసిన విషయం చెప్పాడు. కసాపురం పోలీసులు బుధవారం రామాంజినేయులుతో కలిసి వెళ్లి దహనమైన మృతదేహాన్ని చూశారు. కుక్కలు పీక్కుతినడంతో మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం చేయించారు.

మధ్యవర్తుల సమక్షంలోనే..

చిత్తూరు జిల్లా కుప్పంలో కులాంతర వివాహం చేసుకున్న కూతురిపై బుధవారం ఆమె తండ్రే కత్తి దూశాడు. గుడుపల్లె మండలం అగరం కొత్తపల్లెకు చెందిన శివమూర్తి కూతురు కౌసల్య (21), అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (25) ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో పెద్దలు వీరి ప్రేమను అంగీకరించలేదు. దీంతో వారిద్దరూ తమిళనాడు వెళ్లిపోయి ఈనెల 3న పెళ్లి చేసుకుని, గ్రామానికి తిరిగొచ్చారు. ఇరు కుటుంబాల మధ్య మధ్యవర్తిత్వం నెరపడానికి టీడీపీ నాయకుడు ఒకరు బాధ్యత తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ప్రేమ జంట కౌసల్య, చంద్రశేఖర్, వారి తండ్రులు శివమూర్తి, కోదండప్పలతోపాటు మధ్యవర్తులైన సీతారామప్ప, రమేశ్ కుప్పం చేరుకున్నారు. అక్కడ కూతురు కౌసల్యకు, తండ్రి శివమూర్తికి మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహం పట్టలేకపోయిన శివమూర్తి కూతురిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో కౌసల్య, అడ్డొచ్చిన చంద్రశేఖర్, మధ్యవర్తులు రమేశ్, సీతారామప్ప కూడా గాయపడ్డారు. అనంతరం శివమూర్తి పారిపోయాడు. గాయపడిన వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు కుప్పం అర్బన్ సీఐ చెప్పారు.





తీవ్రంగా గాయపడ్డ కౌసల్య, ప్రేమికుడు చంద్రశేఖర్

అధికారుల వేధింపులతో ఉద్యోగి ఆత్మహత్య!

- లేఖలో కృష్ణా జిల్లా జలవనరుల శాఖలోని ముగ్గురి పేర్లు



విజయవాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా జలవనరుల శాఖలో అధికారుల వేధింపులు తట్టుకోలేక ఓ చిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబం, సహచర ఉద్యోగుల సమాచారం మేరకు.. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు రామ్‌నగర్‌కు చెందిన కన్నేటి వినోద్(46) జలవనరుల శాఖలోని నదీ పరిరక్షణ విభాగంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. పది రోజుల కిందట అతడిని తోట్లవల్లూరు నుంచి శ్రీకాకుళం సెక్షన్‌కు బదిలీ చేశారు. అయితే, జేఈ శ్రీరామ జనార్దన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.కిరణ్, సీనియర్ అసిస్టెంట్ పి.సుజాత ఆ బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించినట్టు సమాచారం. కాగా, మండుటెండలో నదీ పరీవాహక ప్రాంతంలో విధులు నిర్వహించాలని జనార్దన్ వేధిస్తున్నాడని వినోద్ ఆవేదన వ్యక్తం చేసినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. వినోద్ బ్యాంకు రుణం కోసం చేసుకున్న దరఖాస్తును ఈ ముగ్గురూ పక్కనపెట్టి రుణం మంజూరు కాకుండా చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో ఉండే మరో ఉన్నతాధికారితోపాటు జనార్దన్, కిరణ్ ఉద్యోగులందరి సమక్షంలో వినోద్‌ను దూషించేవారు. ఈ నేపథ్యంలో జేఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, సుజాత పేర్లు లేఖలో రాసి, వారి వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు పేర్కొన్నారు. బుధవారం పురుగుల మందు తాగడానికి ముందు ఒక లాక్ సూపరింటెండెంట్‌కు వినోద్ ఫోన్‌చేసి చనిపోతున్నట్టు చెప్పాడు. తాను లేఖలో రాసిన అధికారులకు శిక్ష పడేలా చూడాలని ఆయన్ను కోరినట్టు సమాచారం. వినోద్‌ను తొలుత కానూరు ఆస్పత్రికి, అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.



అత్త భవానీకి రూ.50లక్షల 50 రూపాయలు 50 పైసల నగదును అందజేస్తున్న కోడలు శ్రీరంగనాయకి

అత్తకు ప్రేమతో రూ.కోటి!

కోనసీమ కోడలు.. రూ.కోటి విలువైన బహుమతులు

అత్తాకోడళ్లంటే ఎప్పుడూ.. కట్నం తేలేదనో.. తనను సరిగ్గా చూడ్డం లేదనో తగవులాడుకోవడం చూసేఉంటాం.. వినే ఉంటాం! కానీ.. కోనసీమలో ఓ కోడలు.. తన అత్త 50వ పుట్టిన రోజు సందర్భంగా రూ.కోటి విలువజేసే బహుమతులను అందజేసి ప్రేమాభిమానాలను చాటుకుంది. కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి కాను శ్రీనివాస్, భవానీ దంపతుల కుమారుడు సుఖేష్‌కు రెండేళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన శ్రీరంగనాయకితో వివాహం జరిగింది. అప్పటినుంచి అత్తామామలు తనను కన్న తల్లిదండ్రుల్లా చూసుకుంటున్నారన్న అభిమానంతో.. అత్త భవానీ 50వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోడలు నిర్ణయించుకుంది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి ఘనంగా వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అత్తకు పట్టుచీర, పసుపుకుంకుమ, గాజులు, మంగళసూత్రంతోపాటు వంద గ్రాముల బంగారు బిస్కెట్, రూ.28లక్షల విలువ చేసే డైమండ్ నెక్లెస్, 50లక్షల 50రూపాయల 50పైసల నగదు కలిపి మొత్తం రూ.కోటి విలువ చేసే బహుమతులను అందించి.. గోదారోళ్లు ఏం చేసినా ప్రత్యేకమేనన్నట్లుగా కోడలు తన ప్రేమను చాటుకుంది.

-రాజోలు, ఆంధ్రజ్యోతి



రాజోలులో పుట్టినరోజు వేడుకల్లో అత్త భవానీకి డైమండ్ నెక్లెస్ బహుమతిగా ఇస్తున్న కోడలు శ్రీరంగనాయకి

వివేకా ఇంటి వాచ్‌మన్ రంగయ్య మృతి

అనారోగ్యంతో కడప రిమ్స్‌లో కన్నుమూత.. వివేకా హత్య కేసులో ఇతడు ప్రత్యక్ష సాక్షి

కడప, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఆయన ఇంటి వాచ్‌మన్ రంగయ్య (70) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆయన చాలాకాలంగా వివేకా ఇంటి వాచ్‌మన్‌గా ఉంటున్నాడు. వివేకా 2019 మార్చి 15న హత్యకు గురయ్యారు. ఆరోజు ఎర్రగంగిరెడ్డి వివేకా ఇంటి వెనుక వైపు ఉన్న వాకిలి నుంచి దస్తగిరిని, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్‌కుమార్ యాదవ్‌ను లోపలకు పిలుచుకెళ్లాడు. వివేకా హత్య అనంతరం వీరంతా బయటకు వచ్చారు. ఆ సమయంలో వీరిని రంగయ్య చూశాడు. ఈ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తానని ఎర్ర గంగిరెడ్డి బెదిరించాడు. సీబీఐ విచారణలో రంగయ్య ఈ విషయాలను వెల్లడించాడు. హత్య రోజు ఏం జరిగిందో జమ్మలమడుగు కోర్టులో పూసగుచ్చినట్లు రంగయ్య చెప్పాడు. హత్య కేసులో విచారణాధికారులకు చిక్కిన మొట్టమొదటి ఆధారం ఇతడే. కీలక సాక్షి కావడంతో సీబీఐ అతడి రక్షణకు ఇద్దరు పోలీసులను నియమించింది.

ఆగస్టు నుంచి ఆస్తమా

రంగయ్య గత ఆగస్టు నుంచి ఆస్తమాతో బాధపడుతున్నాడు. అతడికి కడప రిమ్స్‌లో చికిత్స చేయిస్తున్నారు. బుధవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పోలీసులు కడప రిమ్స్‌కు తీసుకొచ్చారు. వచ్చిన కాసేపటికే ఆయన చనిపోయాడు. రంగయ్య భార్య సుశీల మీడియాతో మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు పోలీసులు తమను బాగా చూసుకున్నారని తెలిపింది. 'రంగన్నకు నాకన్నా ఎక్కువగా సేవలు చేశారు. అయితే మూడు నెలల నుంచి పట్టించుకోవడం లేదు. నేను అంగన్వాడీలో ఆయాగా పని చేస్తున్నాను. ఈరోజు కూడా అంగన్వాడీకి వెళ్లాను. పోలీసులు ఫోన్‌చేసి మీ ఆయనకు ఆరోగ్యం బాగలేదంటూ త్వరగా రమ్మన్నారు. నేను వచ్చేసరికి అంబులెన్స్‌లో కడప తీసుకెళ్లారు. ఆయన కడపలో చనిపోయారు. మూడు నెలలుగా పట్టించుకోని పోలీసులు ఈ రోజే పట్టించుకున్నారు' అని చెప్పింది. రంగయ్య మృతిపై సెక్యూరిటీ సిబ్బంది.. సీబీఐ అధికారులకు, పులివెందుల డీఎస్పీకి సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



వాచ్‌మన్ రంగయ్య

ఒకరి తర్వాత మరొకరు..

వివేకా హత్య ఓ సంచలనమైతే.. ఆ కేసులో సాక్షులు, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ఒక్కరొక్కరుగా మృతిచెందడం మరింత సంచలనంగా మారుతోంది. ఆరోపణలు ఎదుర్కొన్న కసనూరుకు చెందిన శ్రీనివాసులరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసులో సాక్షిగా ఉన్న దేవిరెడ్డి అనుచరుడు.. కల్లూరు గంగాధర్‌రెడ్డి తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో 2022లో మృతిచెందారు.

- వివేకా హత్యకు గురయ్యాక బ్యాండేజీ, వైద్యపరీక్షలు ఇతరత్రా అన్నీ జగన్ మామ ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రి సిబ్బంది చేశారు. గంగిరెడ్డి 2020లో మృతిచెందారు.
- వివేకా హత్య జరిగిన రోజు ఆయన తలకు డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి బ్యాండేజీ వేశారు. ఆయనా ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఇప్పుడు రంగయ్య చనిపోయాడు.

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతోంది. దీంతో ఆ భూములు తిరిగి ప్రభుత్వ పరిధిలోకి వస్తాయి. దీనిపై ప్రభుత్వం గురువారం అధికారికంగా ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రభుత్వ భూములను వివిధ మార్గాల్లో గుర్తిస్తారు. ప్రజలు తమకు తెలిసి రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రభుత్వ భూముల వివరాలతో కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి కలెక్టర్ రిజిస్ట్రేషన్ల రద్దుపై తుది నిర్ణయం తీసుకుంటారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని రూల్ 26(కె)(ఐ) ప్రకారం కలెక్టర్లు అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల దొంగ రిజిస్ట్రేషన్లు రద్దు చేయవచ్చు. ప్రభుత్వ భూమేనని కలెక్టర్ నిర్ధారించుకున్న తర్వాత తహశీల్దార్ సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ భూమి రిజిస్ట్రేషన్ రద్దు పత్రాలు సమర్పించి, రద్దు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఒకవేళ ఆ భూమిలో నిర్మాణాలున్నప్పటికీ కూడా రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ప్రభుత్వ భూముల జాబితాలో చేర్చుతారు. అంతకుముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్తే, ప్రభుత్వం ముందుగా రిజిస్ట్రేషన్లు రద్దు చేసి తర్వాత కోర్టులో కౌంటర్ వేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 26 జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఒక ఫార్మాట్ పంపిస్తుంది. కలెక్టర్లు తమ జిల్లాల్లో గుర్తించిన అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల వివరాలను ఆ ఫార్మాట్‌లో ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది.

మండిన రాయలసీమ

విశాఖపట్నం, అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపైకి వాయవ్య భారతం నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. బుధవారం రాయలసీమలోని అనేక ప్రాంతాల్లో ఎండ మండిపోయింది. కోస్తాలో కూడా ఉక్కపోతతో కూడిన వేడి వాతావరణం నెలకొంది. బుధవారం దేశంలోనే నంద్యాల జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా ఆత్మకూరులో 40.9, ప్రకాశం జిల్లా కొనకనమిట్లలో 40, కృష్ణా జిల్లా కంకిపాడులో 39.9 డిగ్రీలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, సీమల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

బెజవాడ పోలీసుల విచారణకు గోరంట్ల మాధవ్ డుమ్మా

- నేడు వస్తానని ఫోన్‌చేసి వెల్లడి
- వైసీపీ నేతలు, కార్యకర్తలతో అనంతలో భారీ బలప్రదర్శన
- 50కి పైగా వాహనాలతో ర్యాలీ
- విజయవాడ బయల్దేరగానే అడ్డుకున్న పోలీసులు
- 3 వాహనాలు ఉంచి మిగతావి వెనక్కి



అనంతపురం/విజయవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు బాధితుల వివరాలను బయట పెట్టినందుకు నమోదైన కేసులో విజయవాడ సైబర్ క్రైం పోలీసుల ఎదుట బుధవారం హాజరు కావలసిన హిందూపురం మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ డుమ్మాకొట్టారు. పైగా అనంతపురంలో హైడ్రామాకు తెరలేపారు. మందీమార్బలంతో బలప్రదర్శన చేపట్టారు. విజయవాడ వెళ్తున్నానని, పోలీసుల ప్రతి ప్రశ్నకు జవాబిస్తానని ప్రకటించి.. చివరకు విచారణకు గైర్హాజరయ్యారు. గురువారం వస్తానని వారికి సమాచారం ఇచ్చారు. బుధవారం విచారణ నిమిత్తం విజయవాడ రావాలని కొద్దిరోజుల కిందట విజయవాడ పోలీసులు ఆయనకు 41ఏ నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. బెజవాడ వెళ్తున్నట్లు బుధవారం ఆయన భారీ బిల్డప్ ఇచ్చారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అనంతపురంలోని మాధవ్ ఇంటికి చేరుకున్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా వారిలో ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 50కిపైగా వాహనాల భారీ కాన్వాయ్‌తో మాధవ్ నగరంలో బలప్రదర్శన చేశారు. వైఎస్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాన్వాయ్‌తో నగరశివారులోని జాతీయ రహదారిపైకి చేరుకోగానే.. పోలీసులు అడ్డుకున్నారు. 3 వాహనాలు తప్ప.. మిగిలినవన్నీ వెనక్కిపంపారు. తర్వాత మాధవ్ విజయవాడ దిశగా బయల్దేరారు. అయితే కొద్దిసేపటికి బెజవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫోన్ చేశారు. తాను వేరే ఊరి నుంచి అనంతపురం వచ్చానని.. ఈ రోజు రావాలంటారా అని అడిగారు. వస్తే విచారణ పూర్తవుతుంది కదా అని పోలీసులు బదులిచ్చారు. ఇవాళ రాలేనని.. గురువారం ఉదయం హాజరవుతానని ఆయన చెప్పారు. వారు అందుకు అంగీకరించారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీసు విచారణకు హాజరవుతానని.. తనకు వేరే కార్యక్రమాలు ఉన్న నేపథ్యంలో.. గురువారం వస్తానని చెప్పానని తెలిపారు. 'బలప్రదర్శనతో వెళ్తున్నారా..? విజయవాడకు వెళ్లేందుకు ఒకట్రెండు రోజులు పడుతుందా..' అని మీడియా ప్రశ్నించగా... తాను విచారణకు వెళ్తున్నాననే సమాచారంతో సంఘీభావం తెలుపడానికే వైసీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చారని బదులిచ్చారు. విజయవాడ పోలీసులు తనకు నోటీసులు అందజేసిన రోజు 'అంతర్యుద్ధం వస్తుంది' అని తాను అన్న మాటలకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

సర్కారీ భూములు స్వాహా

(మొదటి పేజీ తరువాయి)

విలువైన ప్రభుత్వ భూములను తమ పేరిట మార్చుకున్నారు. కంచే చేను మేసిన చందంగా కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ అక్రమార్కులతో అంటకాగారు. వారు కోరుకున్న భూములను వారి పేరిట రికార్డుల్లోకి ఎక్కించారు. ఇందుకు ప్రతిఫలంగా నేతలు ఇచ్చిన సొమ్మును జేబులో వేసుకున్నారు. నాడు జగన్ సర్కారులో జరిగిన చీకటి దందా ఇప్పుడు ప్రజల ఫిర్యాదులతో బయటపడుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవలం ఒక్క పీలేరు మండలంలోనే ఐదారుగురు వైసీపీ నేతలు కలిసి రూ.175 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను చెరపట్టిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. వారంతా నాటి ప్రభుత్వంలో కీలక మంత్రి పెద్దిరెడ్డికి ప్రధాన అనుచరులే కావడం విశేషం.

ఫిర్యాదుల వెల్లువ

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వైసీపీ నేతల భూదందాలపై ఫిర్యాదులు చేశారు. వాటిపై రెవెన్యూ శాఖ విచారణ చేయించింది. వైసీపీ నేతలు రెవెన్యూ ఇంటి దొంగలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్, ప్రభుత్వ భూములను చెరపట్టారు. విశాఖ లాంటి జిల్లాల్లో వైసీపీ నేతల అక్రమాలు బయటకు రాకుండా అధికార యంత్రాంగం అహర్నిశలు అడ్డుపడుతుండగా.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాత్రం వరుసగా బయటపడుతున్నాయి. మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసుకు ఎందుకు నిప్పు పెట్టాలనుకున్నారో, భౌతిక రికార్డులను ఎందుకు తగలబెట్టాలనుకున్నారో మరింత స్పష్టత వస్తోంది. పీలేరు మండలంలో వైసీపీ నేతల కబ్జాపై సమగ్ర విచారణ జరిపించాలని రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. వాటిని పెద్దాయన కోసం రాయించుకున్నారా? లేక నేతలే హస్తగతం చేసుకున్నారా? అన్నది తేలాల్సి ఉంది. ఒక్క పీలేరు మండలంలోనే కేవలం 7 కేసుల్లో రూ.175 కోట్ల విలువైన భూములను కబ్జా చేస్తే... మిగిలిన 678 మండలాల్లో పరిస్థితి ఏమిటో? రెవెన్యూ విచారణలో పీలేరులో వెలుగు చూసిన అంశాలు..

అక్రమాలకు సాక్ష్యాలివే...


- పీలేరులో సర్వే నంబర్ 72-2లో ప్రభుత్వ భూమి ఉంది. వైసీపీ నేత ఒకరు భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేశారు. ఈ భూమి మార్కెట్ విలువ రూ.రెండు కోట్లపై మాటే.
- సర్వే నంబర్ 564లో ప్రభుత్వ భూమి ఉంది. ఓ ప్రముఖ వైసీపీ నేత ఆ భూమిని చేజిక్కించుకొని అక్రమ నిర్మాణం చేశారు. ఈ భూమి విలువ రూ.3 కోట్లకు పైగా ఉంటుంది.
- పీలేరు మండలం ఎర్రగుంటపల్లిలో సర్వే నంబర్ 741-1లో ప్రభుత్వ అనాధీన భూమి ఉంది. ఈ భూమి ఎన్‌హెచ్-71 పక్కనే ఉంది. సమీపంలో హెరిటేజ్ మిల్క్ డెయిరీ కూడా ఉంది. మండల సర్వేయర్, ఇతర అధికారులు వైసీపీ నేతతో కుమ్మక్కయ్యారు. అంతే... ఆ భూమిని వైసీపీ నేత పేరిట 1బీ రిజిస్టర్‌లో నమోదు చేశారు. రీ సర్వే మొదలైన తర్వాత వైసీపీ నేత ఈ భూమిని తన ఖాతాలో వేసుకున్నారు. దీని విలువ రూ.10 కోట్ల పైమాటే.
- పీలేరు మండలం గూడరేవుపల్లిలో సర్వే నంబర్ 761-2లో 2 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రికార్డుల్లో ప్రభుత్వ అనాధీనం అని ఉంది. తహశీల్దార్ కార్యాలయంలోని డీకేటీ రిజిస్టర్‌ను తారుమారు చేసి ఆ భూమిని ఓ వైసీపీ నేత పేరిట రాశారు. ఇది జాతీయ రహదారి ఎన్‌హెచ్-71 పక్కనే, పీలేరు టౌన్‌కు సమీపంలో ఉంది. అసైన్డ్ భూములకు ఫ్రీ హోల్డ్ హక్కులు ఇచ్చే సమయంలో వైసీపీ నేత ఈ భూమిని తన ఖాతాలో వేసుకున్నట్లుగా గుర్తించారు. ఆరు వరసల జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఇక్కడ ఎకరం ధర దాదాపు రూ.10 కోట్లు. రెండు ఎకరాల భూమి విలువ రూ.20 కోట్లపైనే ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.
- పీలేరు మండలం గూడరేవుపల్లెలో సర్వే నంబర్ 780లో రెండు ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇద్దరు వైసీపీ నేతలు ఈ రెండు ఎకరాలతోపాటు సర్వే నంబర్ 198లోని మరో రెండు ఎకరాల భూమిని తమ ఖాతాలో వేసుకున్నారు. నేతలు కబ్జా చేసిన ఈ భూమి విలువ రూ.20 కోట్ల పైమాటే.
- పీలేరు మండలం గూడరేవుపల్లెలో సర్వే నంబర్ 774-2లో మూడు ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఎన్‌హెచ్-71 పక్కనే ఉంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు ఈ భూమిని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ భూమి విలువ రూ.30 కోట్లకు పైనేనని రెవెన్యూ శాఖ చెబుతోంది.

అటవీ భూమి కబ్జా

పీలేరు మండలం తలపులలో మురళీమోహన్‌రెడ్డి అనే వైసీపీ నేత మాజీ మంత్రి పెద్దిరెడ్డికి ప్రధాన అనుచరుడు. వైసీపీలో ఆయనదే హవా. ఆయన ఏకంగా రిజర్వ్ ఫారెస్ట్‌పైనే కన్నేసి కబ్జా చేశారు. తలపులలో సర్వే నంబర్లు 1960, 2360-2, 2361-10, 2361-11లో 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మురళీమోహన్ రెడ్డి 25 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఫిర్యాదులు రాగా రెవెన్యూ శాఖ విచారించింది. ఆయన 14 ఎకరాలు ఆక్రమించినట్టు నిర్ధారణ అయ్యింది. ఇది రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగంగా ఉంది. ఇక్కడ సకల సదుపాయాలతో ఇంటి నిర్మాణం చేశారు. ఈ భూమి మార్కెట్ విలువ కనీసం రూ.90 కోట్లపైనే.

పోసానికి ఆదోని కోర్టు రిమాండ్

- కర్నూలు జిల్లా జైలుకు తరలింపు
- బెయిల్ పిటిషన్‌పై నేడు నరసరావుపేట కోర్టులో విచారణ
- ఇటు బెజవాడలోనూ ఆయనపై పీటీ వారెంట్లు



కర్నూలు/గుంటూరు లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఆదోని కోర్టు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన అసభ్య పదజాలంతో దూషించారని ఆదోని జనసేన నాయకుడు మలిశెట్టి రేణువర్మ పోలీసులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆదోని మూడో పట్టణ పోలీసులు పీటీ వారెంట్‌పై పోసానిని గుంటూరు జైలు నుంచి మంగళవారం తీసుకొచ్చారు. అర్ధరాత్రి దాటాక కర్నూలు వీఆర్ కాలనీలో నివాసముంటున్న ఆదోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ అపర్ణ ఎదుట హాజరుపరిచారు. న్యాయాధికారి ఆయనకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. తనను ఆదోని జైలులో కాకుండా కర్నూలు జిల్లా జైలులో ఉంచాలని పోసాని కోరగా.. ఆయన విజ్ఞప్తి మేరకు కర్నూలు జిల్లా జైలుకు పంపుతూ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన్ను కర్నూలు శివారులోని పంచలింగాలలో ఉన్న జిల్లా కారాగారానికి తరలించారు. కాగా.. మరో కేసులో ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై పల్నాడు జిల్లా నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం విచారణ జరుగనుంది. నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు పీటీ వారెంట్‌పై అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి తీసుకొచ్చి స్థానిక కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే. ఇంకోవైపు.. పోసానిపై విజయవాడలో బుధవారం పీటీ వారెంట్లు దాఖలయ్యాయి. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారంటూ సూర్యారావుపేట, భవానీపురం పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

వంశీని మరో 10 రోజుల కస్టడీకి ఇవ్వండి

- మూడు రోజుల కస్టడీలో విచారణకు సహకరించలేదు
- వంశీ నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉంది
- బెజవాడ కోర్టులో పోలీసుల పిటిషన్



విజయవాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు వల్లభనేని వంశీమోహన్‌ను మరో పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును అభ్యర్థించారు. ఈ మేరకు విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టులో బుధవారం పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇంతకు ముందు తాము పది రోజుల కస్టడీకి కోరితే మూడు రోజులే అనుమతించారని, ఆ మూడు రోజుల్లో వంశీ విచారణకు సహకరించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు అడిగిన ప్రశ్నలకు సరిగా సమాధానాలు చెప్పలేదని, కొన్ని ప్రశ్నలకు విచారణను తప్పుదోవ పట్టించేలా జవాబులు ఇచ్చారని వివరించారు. ఈ కేసులో ఇంకా కొంతమంది కీలకమైన వ్యక్తులను అరెస్టు చేయాల్సి ఉందని, మరికొన్ని వివరాలను రాబట్టాల్సి ఉందని పేర్కొన్నారు.

సీసీ ఫుటేజ్ భద్రపరిచేలా పోలీసులను ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన వంశీ భార్య... విచారణ వాయిదా

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తన భర్త అరెస్టు అక్రమమని నిరూపించేందుకు ఆధారమైన విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ నేత వల్లభనేని వంశీ సతీమణి పంకజశ్రీ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గతనెల 10 నుంచి 15వ తేదీ వరకు పోలీసుస్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సహాయ ప్రభుత్వ న్యాయవాది బసవేశ్వరరావు స్పందిస్తూ... వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని, విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ విచారణను 10వ తేదీకి వాయిదా వేశారు.

నాపై సీఐడీ కేసును కొట్టివేయండి

- హైకోర్టును ఆశ్రయించిన దర్శకుడు ఆర్జీవీ

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు బుధవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 'గుంటూరు జిల్లా, మంగళగిరికి చెందిన బండారు వంశీకృష్ణ నాపైన ఇచ్చిన ఫిర్యాదులో చేసిన ఆరోపణలు అన్నీ కట్టుకథలే. రాజకీయ దురుద్దేశంతో మానసికంగా వేధించేందుకు నాపై కేసు పెట్టారు. సీబీఎఫ్‌సీ సర్టిఫికేషన్ తరువాతే 2019లో సినిమా విడుదల చేశాము. 2024లో కేసు పెట్టడంలో అర్థంలేదు. ఫిర్యాదులో నాపై నిర్దిష్ట ఆరోపణలు లేవు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయండి. కేసు ఆధారంగా తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి' అని పిటిషన్‌లో ఆర్జీవీ కోరారు.

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడపై కేసు పెట్టాలి

- కైకలూరు పోలీస్ స్టేషన్‌లో జనసేన నేతల ఫిర్యాదు

కైకలూరు, గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై ఆ పార్టీ నాయకులు ఏలూరు జిల్లా కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. దువ్వాడ శ్రీనివాస్ ప్రాంతాలు, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించారని, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశాయని, తక్షణమే కేసు నమోదు చేయాలని కోరారు. కాగా ఇదే అంశంపై గుంటూరులోనూ కేసు నమోదయింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.